

గోన గన్నారెడ్డి
రూ॥ 230/-
పేజీలు: 266
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్), హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ, హిమాయత్‌నగర్ (హైదరాబాద్) హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★


దేశ భవిష్యత్తు కోసమే ఇష్టా సాంస్కృతిక ఉద్యమం

తెలంగాణకు బిజెపి సర్కార్ ద్రోహం

లోపలి పేజీల్లో


సంపుటి 08, సంచిక: 176 | సోమవారం | 26-05-2025 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



05

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశమంతా ఏకమైంది

- 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ


05

ఐదు అసెంబ్లీ స్థానాల్లో ఉప ఎన్నికలు


05

ఢిల్లీని ముంచెత్తుతున్న భారీ వర్షాలు

- నీటమునిగిన కార్లు, బస్సులు
- 180 విమానాలపై ప్రభావం, 49 విమానాలు దారిమళ్లింపు

ఉక్రేన్–రష్యా మధ్య భారీసంఖ్యలో బందీ సైనికుల మార్పిడి 02



- చర్చలకు సిద్ధమని మావోయిస్టులు చెబుతున్నా కేంద్రం అవకాశం ఇవ్వకపోవడం దారుణం
- మతాలు, ప్రాంతాల పేరుతో మనుషుల మధ్య వైషమ్యాలు రెచ్చగొడుతున్న బిజెపి సర్కార్
- కాషాయ పార్టీని అంతం చేయాల్సిందే
- ఎర్రకోటపై జెండా ఎగురవేతే లక్ష్యంగా వామపక్ష పార్టీలన్నీ ఏకమవ్వాలి
- సిపిఐ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మహాసభల్లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని
- అన్ని వర్గాలకు అండగా నిలిచేది సిపిఐ మాత్రమే : ఎమ్మెల్సీ నెల్లికంటి



# అర్హులకు పథకాలందేలా సిపిఐ పోరాటాలు

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి

ఎర్రకోటపై ఎర్రజెండా ఎగుర వేసే లక్ష్యంగా స్వల్ప విభేదాలతో వేర్వేరుగా కొనసాగుతున్న వామపక్ష పార్టీలన్నీ ఏకమై ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. శ్రామిక, కార్మిక, కర్షక వర్గ నిరుపేదల పక్షాన ఫలితాలు సాధించే వరకు పోరాడుతూ గత వందేళ్ల కాలంగా ప్రజల మదిలో నిలిచి పోయింది కేవలం కమ్యూనిస్టులు మాత్రమే అని ఆయన తెలిపారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం దిగజార్చిన ఆర్థిక పరిస్థితులు, తప్పులను సరిదిద్దలేని ఊబిలోకి కాంగ్రెస్ ప్రభుత్వం ఇరుక్కుపోయింది. అన్ని పథకాలు అర్హులందరికి దక్కేలా సిపిఐ శ్రేణులు పోరాటం చేయాలన్నారు. ఇసిఐఎల్‌లోని బంజారా ఫంక్షన్ హాలులో సిపిఐ సహాయ కార్యదర్శి జి.దామోదర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మేడ్చల్ జిల్లా 4వ మహాసభలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్ బోస్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్‌లతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు తామే హిందువుల ప్రతినిధిగా పేర్కొంటూ వివిధ వర్గాలు, మతాలు, ప్రాంతాల పేరిట మనుషుల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టటం ద్వారా ఓట్లు దండుకొనే రాజకీయాలతో పదేళ్ల పైబడి కేంద్రంలో అధికారం వెలగబెడుతున్న బిజెపి ప్రభుత్వం తరువాయి 12లో

## సిపిఐ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శిగా ఉమామహేష్



సిపిఐ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శిగా ఉమామహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన సిపిఐ జిల్లా 4వ మహాసభలో ఆయన ఎన్నికను ప్రకటించారు. కుత్బుల్లాపూర్ మండలానికి చెందిన ఉమామహేష్ గతంలో జిల్లా పార్టీ సహాయ కార్యదర్శిగా పని చేశారు.



## నాలుగు రోజులు భారీ వర్షాలు

రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రానున్న నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఈ నెల 26న ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే తరువాయి 2లో



## ఈసెట్ పరీక్షలో 93.87% ఉత్తీర్ణత

ఫలితాలు వెల్లడించిన రాష్ట్ర ఉన్నతవిద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

పాలిటెక్నిక్, బిఎస్సి, మ్యాథ్స్ విద్యార్థులు లేటరల్ ఎంట్రీ ద్వారా బిటెక్, బి ఫార్మసి కోర్సులలో చేరేందుకు నిర్వహించిన 'ఈ సెట్' పరీక్షలో93.87 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలో తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ వి.బాలకిష్టారెడ్డి ఆదివారం ఫలితాలను విడుదల చేశారు. టిజి ఈసెట్ పరీక్ష మే 12న నిర్వహించారు. ఈ పరీక్షకు 19,672 మంది తమ పేర్లను నమోదు చేసుకోగా, ఇందులో 18,928 మంది (96.22 శాతం) పరీక్షకు హాజరయ్యారు. బిఎస్సి మ్యాథ్స్ విభాగంలో మొదటి ర్యాంక్ బి.సంతోష్‌కుమార్, రెండవ ర్యాంక్ తరువాయి 2లో

# విద్య, వైద్య రంగాల్లో భారీ మార్పులు తెస్తాం



- వైద్యరంగ అభివృద్ధితో పాటు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అండ
- వైద్యులు వృత్తి నిపుణులే కాదు.. సమాజ శ్రేయస్సుకోసం పనిచేసే సేవాతత్పరులు
- ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- ముగిసిన 'తానాకాన్' 11వ రాష్ట్ర సదస్సు

ప్రజాపక్షం/కరీంనగర్

తెలంగాణలో ప్రధానంగా విద్య, వైద్య రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఐటిశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. వైద్యరంగ అభివృద్ధితో పాటు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఆదివారం గత రెండు రోజులుగా కరీంనగర్‌లోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో నిర్వహించిన 'తానాకాన్' 2025 (తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్) పదకొండవ రాష్ట్ర సదస్సు తరువాయి 2లో



# ఏం చేద్దాం!

- బిఆర్‌ఎస్ చీఫ్ కెసిఆర్‌తో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ భేటీ
- ఎమ్మెల్సీ కవిత లేఖ, ఆమె వ్యాఖ్యలపై చర్చ
- కాళేశ్వరం కమిషన్ నోటీసులపైనా మంతనాలు
- తండ్రికొడుకుల భేటీపై వెల్లువెత్తుతున్న ఊహాగానాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావుతో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం భేటీ అయ్యారు. ఇటీవల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లేఖ,అనతరం ఆమె చేసిన వ్యాఖ్యలు,వాటి పరిణామాలు, ఇతర రాజకీయ పార్టీల స్పందనతో పాటు తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దినోత్సవమైన జూన్ 2న చేపట్టాల్సిన కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించినట్టు తెలిసింది.అలాగే కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కమిషన్ అందజేసిన నోటీసులు తదితర అంశాలు చర్చకు వచ్చినట్టు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.అయితే జూన్ 1న అమెరికాలో జరిగే ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు కెటిఆర్ ఈ నెల 28న అమెరికాకు వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో జూన్ 2న చేపట్టాల్సిన కార్యక్రమాలు, వాటి బాధ్యతలు తదితర అంశాలపై కూడా చర్చ జరిగినట్టు తెలుస్తోంది. కాగా కెసిఆర్‌తో కెటిఆర్ భేటీ కావడం పట్ల రకరకాల ఉహాగానాలు వినిపిస్తున్నాయి.



## హజ్‌యాత్రకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం

మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్

హజ్‌యాత్ర నిమ్మితం రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్, నాంపల్లిలోని హజ్‌హౌస్ వద్ద హజ్ యాత్రికుల బస్సులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం బాగుండాలని, రాష్ట్రంలో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నాను అని అన్నారు. జీవితంలో అందరికీ హజ్ యాత్రకు అవకాశం రాదని, ఆ అల్లాహ్ దయ వల్లనే అవకాశం వచ్చిందని తెలిపారు. హజ్ యాత్ర సజావుగా సాగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## నంబాల మృతదేహం ఇంకా మార్చురీలోనే



మరణం తర్వాత కూడా వీడని చిక్కుముడి

భౌతికకాయం అప్పగింతపై తీవ్రస్థాయిలో చర్చ

ప్రజాపక్షం/ఖమ్మం

డెబ్బైఐదేళ్ల నంబాల కేశవరావు 55 సంవత్సరాల పాటు సాయుధ పోరాటంలో పలు కీలక బాధ్యతల్లో పనిచేస్తూ అనేక హింసాత్మక ఘటనలకు నాయకత్వం వహించారు. అదే సమయంలో పలుమార్లు నంబాల కేశవరావుపై విస్తృత స్థాయిలో చర్చ జరిగింది. ఈనెల 21న ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నంబాల కేశవరావు అలియాస్ బసవరాజుతో పాటు మరో 20 మంది మావోయిస్టులు మృతి చెందిన విషయం విధితమే. ఇప్పటి వరకు 22 మృతదేహాలను బంధుమిత్రులకు అప్పగించారు. నంబాల మృతదేహం అప్పగింతపై తీవ్ర స్థాయిలో చర్చ జరుగుతుంది. నంబాల ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన వారు కావడంతో మృతదేహాన్ని శ్రీకాకుళంకు తరలిస్తే తరువాయి 2లో

## కొచ్చి తీరంలో 'హై'అలర్ట్



సముద్రంలో మునిగిన 640 కంటైనర్ల నౌక

**13 కంటైనర్లలో ప్రమాదకర రసాయనాలు**

కొచ్చి : ప్రమాదకరమైన సరుకులతో కూడిన 13 కంటైనర్లతో సహా 640 కంటైనర్లతో కూడిన లైబీరియన్ నౌక ఆదివారం కొచ్చి తీరంలో మునిగిపోయింది. దీంతో చమురు బహిర్గతమవుతుందోనన్న భయాలు వ్యక్తమయ్యాయి. అవి లీకైతే సముద్ర జలాలు తీవ్రంగా కలుషితమయయ్యే ప్రమాదం ఉండడంతో అధికారులు కొచ్చి తీరంలో హై అలర్ట్ ప్రకటించారు. శనివారం నౌక తీవ్ర వంపు తిరిగిన తర్వాత 24 మంది సిబ్బందిని రక్షించినట్లు అధికారులు తెలిపారు. ఇండియన్ కోస్ట్ గార్డ్‌తో కలిసి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నందున ఇప్పటివరకు ఎటువంటి చమురు చిందటం జరగలేదని రక్షణ మంత్రిత్వ శాఖ ఆదివారం తెలిపింది. లైబీరియన్ తరువాయి 2లో

## అహీం సంస్థపై పోలీసుల డేగ కన్ను

వరంగల్‌కు పాకిన 'ఉగ్ర' లింక్

నసీర్, సమీర్‌లను మూడవ రోజూ విచారించిన పోలీసులు

ప్రజాపక్షం/హైదరాబాద్

పేలుళ్ల కుట్ర కేసులో పట్టుబడిన నసీర్, సమీర్‌లు మూడో రోజు విచారణలో సంచలన విషయాలు వెలుగు బయటపడ్డాయి. వరంగల్‌కు చెందిన ఫరహాన్‌తో నసీర్, సమీర్‌లకు ఉగ్ర పరిచయాలు ఉన్నాయని విచారణలో తేలినట్లు తెలిసింది. ఫరహాన్ స్థానికంగా అహీం అనే సంస్థను నిర్వహిస్తున్నాడని, ఈ సంస్థను అడ్డుపెట్టుకుని దాని చాటున ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడని పోలీసులు అనుమానిస్తున్నారు. అహీం అనే సంస్థపై ఆరా తీసేందుకు నాలుగు పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి. ఫరహాన్ కుటుంబ నేపథ్యం, స్థానికంగా అతని కార్యకలాపాలపై తరువాయి 12లో

## పెద్ద కుమారుడిని బహిష్కరించిన లాలూ

తేజ్ ప్రతాప్ యాదవ్‌ను పార్టీ నుంచి ఆరేళ్లుపాటు తొలగిస్తున్నట్లు ప్రకటన

ఇకపై మా కుటుంబంలో స్థానం లేదని వెల్లడి




పాట్నా : ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూ ప్రసాద్ తన పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్‌ను ఆదివారం పార్టీ నుండి బహిష్కరించారు. అంతేకాకుండా అతనికి కుటుంబంతో ఎటువంటి సంబం ధం ఉండదని ప్రకటించారు. తేజ్ ప్రతాప్ యాదవ్ శనివారం సాయంత్రం సోషల్ మీడియాలో తరువాయి 12లో

## ఖాకీవనంలో కలుపుతీతే లక్ష్యం



లంచగొండుల పట్ల దూకుడు పెంచిన ఎసిబి

రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడుతున్న పోలీసులు

అయినా మారని తీరు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఖాకీ వనంలో కలుపుమొక్కలను ఏరివేసేందుకు అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) దూకుడు పెంచింది. అవినీతికి పాల్పడిన పోలీసులపై వస్తున్న ఫిర్యాదుపై ఒక్కింత ఆశ్చర్యం వ్యక్తం చేసింది. కొంత మంది పోలీసులు అవినీతికి పాల్పడుతూ పోలీసు శాఖకే చెడ్డపేరు తెస్తున్నారు. వీరి పట్ల డిజిపి డాక్టర్ జితేందర్ కూడా కఠినంగానే వ్యవహరిస్తున్నారు. అవినీతికి పాల్పడుతున్న వారిలో కానిస్టేబుల్ స్థాయి నుంచి డిఎస్‌పి స్థాయి వరకు ఉండడం పోలీసు శాఖను ఆందోళనకు గురి చేస్తోంది. ఈ మధ్య తరచూ పోలీసులు ఎసిబికి చిక్కిపోతున్న కేసులు పెరిగిపోవడం పట్ల ప్రజల్లో పోలీసులు చులకనైపోతున్నారు. ఆయా విభాగాల అధిపతుల పర్యవేక్షణ లేకపోవడం వల్లనే కింది స్థాయి పోలీసులు లంచాలకు అలవాటు పడుతున్నారనే వాదన ఉంది. కేసు మాఫీ చేసేందుకు, నిందితులకు స్టేషన్ బెయిల్ ఇప్పించేందుకు, చార్జిషీట్‌లో నిందితుల పేరు తొలగించేందుకు, ఎఫ్‌ఐఆర్ నమోదు చేసేందుకు, భూకబ్జాలకు సహకరించేందుకు, సెటిల్‌మెంట్లు ఇలా ఆయా కేసుల్లో తరువాయి 12లో







# ప్రపంచం
WORLD NEWS

## పాకిస్థాన్‌లో గాలి దుమారం

### 14 మంది మృతి

**లాహోర్ :** పాకిస్థాన్‌లో విపరీతమైన వడగాలులు తీవ్ర ప్రతాపం చూపించిన తర్వాత పెనుగాలి దుమారం చెలరేగింది. ఈ గాలి దుమారం ప్రభావం వల్ల 14 మంది మరణించారు. మరో 100 మంది గాయపడ్డారు. గోడలు కూలిపోవడంవల్ల, ఇంటి పైకప్పులు పడిపోవడంవల్ల, ఎక్కడో పైన ఉన్న సోలార్ ప్యానల్స్ విరిగి కింద పడిపోవడంవల్ల ఎక్కువ మంది మరణించారు. సెంట్రల్‌పాకిస్థాన్, ఈశాన్యపాకిస్థాన్ ప్రాంతాలలో ఈ గాలిదుమారం చెలరేగింది. పెద్దపెద్ద చెట్లు కూకటివేళ్ళతోసహా నేలకు ఒరిగాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి.

వర్షం లేకుండా, ఉరుములు, మెరుపులు, విపరీతమైన గాలిదుమారం బీభత్సం సృష్టించింది. శనివారం మధ్యాహ్నం ఈ ప్రకృతి వైపరీత్యం సంభవించిందని అధికారులు ఆదివారం నాడు ప్రకటించారు. తూర్పు పంజాబ్, వాయువ్య ఖైబర్ పంఖ్తుంఖ్వా రాష్ట్రాలలో ఎక్కువ నష్టం వాటిల్లిందని చెప్పారు.

## ఉక్రేన్—రష్యా మధ్య భారీసంఖ్యలో

# 1,990మంది బందీ సైనికుల మార్పిడి





**మాస్కో :** రష్యా, ఉక్రేన్ దేశాలు తమ వద్ద బందీలుగా ఉన్న సైనికులు—పౌరుల పరస్పర మార్పిడి ప్రక్రియ వరుసగా మూడోరోజు కూడా కొనసాగింది. ఆదివారంనాడు రెండు దేశాలూ 606 మంది సైనికుల పరస్పర మార్పిడి కార్యక్రమం జరిగింది. ఉక్రేన్ తమవద్ద బందీలుగా ఉన్న 303 మంది సైనికులను రష్యాకు స్వాధీనం చేయగా, రష్యా కూడా 303 మంది ఉక్రేన్ సైనికులను ఆ దేశానికి అప్పగించింది. మొత్తంగా చూస్తే ఈ మూడు రోజుల్లో మొత్తం 1,990 మంది సైనికులను పరస్పరం స్వాధీనం చేశాయి. గడచిన మూడు సంవత్సరాలుగా ఉక్రేన్‌లో జరుగుతున్న యుద్ధంలో బందీలైన సైనికుల పరస్పర మార్పిడి ప్రక్రియ ఇంతభారీ స్థాయిలో జరగడం ఇదే మొదటిసారి. దీనిపై రష్యా విదేశాంగమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా స్పందిస్తూ, ఇస్తాంబుల్‌లో చర్చలను రష్యా ప్రతిపాదించిందనీ, పశ్చిమదేశాలకు చర్చల పట్ల చిత్తశుద్ధిలేదన్న విషయం ఈ సైనికుల మార్పిడి ప్రక్రియ స్పష్టం చేసిందన్నారు. ఈ సంక్షోభానిన పశ్చిమ దేశాలే సృష్టించాయన్నారు. ఇస్తాంబుల్‌లో ఒప్పందం ప్రకారం మే 23,24 తేదీలలో రెండు దేశాలూ పరస్పరం 1,384 మంది సైనికులను ఇచ్చిపుచ్చుకున్నాయి. శుక్రవారంనాడు 390 మందిని, శనివారంనాడు 307 మంది సైనికులను రష్యాకు ఉక్రేన్ అప్పగించింది. అదేవిధంగా రష్యా కూడా శుక్రవారంనాడు 270 మంది సైనికులను, 120 మంది పౌరులను, శనివారంనాడు 307 మంది సైనికులను ఆ ఉక్రేన్‌కు అప్పగించింది.

## రష్యా సామూహిక డ్రోన్ దాడి

### ఉక్రేన్‌కు భారీనష్టం : 12 మంది మృతి

**కీవ్ :** ఉక్రేన్ రాజధాని నగరం కీవ్‌పై ఆదివారం తెల్లవారుజామున రష్యా భారీస్థాయిలో దాడులు చేసింది. ఈ దాడుల్లో 12 మంది ప్రజలు మరణించగా, 70 పౌరులు గాయపడ్డారు. 80 నివాసిత ప్రాంతాలపై డ్రోన్ల దాడులు జరిగాయి. కీవ్‌లో ఉన్నతిధికారులు ఈ విషయం చెప్పారు. గతంలో లేనంత తీవ్రంగా డ్రోన్లు, క్షిపణులతో రష్యా సైన్యం దాడి చేసింది. ఐతే గాయపడినవారిసంఖ్య చాలా ఎక్కువసంఖ్యలో ఉందని, ఇది తమకు దిగ్భ్రాంతి కలిగించిందని ఉక్రేన్ అధికారులు చెప్పారు. మొత్తం 142 ప్రాంతాలలో ఈ దాడులవల్ల ధ్వంసం జరిగింది. ఆయుధ డిపోలు, మిలిటరీ ఎయిర్ ఫీల్డ్స్, ఎలక్ట్రిక్ వార్‌ఫేర్ స్టేషన్లను డ్రోన్లు ధ్వంసం చేసి ఉక్రేన్‌కు భారీ నష్టం చేశాయి. మొత్తం 367 డ్రోన్లు, క్షిపణులు,266 యుఎవిలను 22 లక్ష్యాలపై రష్యా ప్రయోగించిందని ఉక్రేన్ వైమానికదళ అధికార ప్రతినిధి యూరీవ్‌ఇహ్నాట్ చెప్పారు. వివిధ రకాల 69 క్షిపణులను, ఇరాన్‌లో తయారు చేసిన 298 డ్రోన్లను ప్రయోగించిందని చెప్పారు. ఐతే దీనిపై రష్యా సైన్యం వెంటనే స్పందించలేదు. కాగా ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ స్పందిస్తూ, దాదాపు 30 నగరాలు, గ్రామాలపై రష్యా డ్రోన్ల దాడి చేసిందనీ, రష్యాపై వెంటనే ఆంక్షలు విధించాలని యూరప్ దేశాలకు విజ్ఞప్తి చేశారు. 2022 ఫిబ్రవరిలో ప్రారంభమైన యుద్ధం ఆదివారంనాటికి 1,186 రోజుకు చేరుకుంది.





## రుమేనియా ఎన్నికల్లో యూరప్ ప్రయోజనాల కోసమే టెలిగ్రామ్ సిఇఓ అరెస్టు



**మాస్కో :** రుమేనియా ఎన్నికల్లో విజయం సాధించి ప్రయోజనాలు పొందడంకోసమే టెలిగ్రామ్ సహవ్యవస్థాపకుడు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పావెల్ డ్యూరోవ్‌ను అరెస్టు చేశారని రష్యా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా ఆదివారంనాడు మీడియా సమావేశంలో విమర్శించారు. చాలా అమానుషమైన, ఆటవిక పద్ధతులలో డ్యూరోవ్‌ను అరెస్టు చేశారని విమర్శించారు. అంతర్గత ప్రయోజనాలకోసం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఆదేశాలమేరకు డ్యూరోవ్‌ను అరెస్టు చేశారని, రుమేనియమాలో యూరప్ అనుకూల ఎన్నికల ఫలితాలు సాధించడంకోసం టెలిగ్రామ్ మెసింజర్ యాప్‌ను ఉపయోగించుకోవచ్చుననే దుర్బుద్ధితోనే పావెల్ డ్యూరోవ్‌ను మేక్రాన్ అరెస్టు చేయించారని జఖరోవా విమర్శించారు. అధ్యక్ష ఎన్నికల్లో యూరప్ అనుకూల కన్జర్వేటివ్‌పార్టీకి టెలిగ్రాం ద్వారా మేలు చేయాలని చేసిన విజ్ఞప్తిని తాను తిరస్కరించానని మే 18న డ్యూరోవ్ ప్రకటిన చేశారు. అంతకు ముందే 2024 ఆగస్టు 24న ఫ్రెంచ్ పోలీసులు డ్యూరోవ్‌ను అరెస్టు చేశారు. టెలిగ్రామ్‌లో యూజర్లు తమ ఇష్టానుసారంగా కంటెంట్ క్రియేట్ చేసుకోవడానికి అవకాశాలు ఇచ్చే విధానాన్ని పాటించారన్న ఆరోపణపై, టెలిగ్రామ్ సిఇఓ ఫ్రెంచ్ పోలీసులు కోరినవిధంగా వారికి సహకరించడంలేదన్న ఆరోపణలపై అరెస్టు చేశారు. ఆయనపై ఆయనపై 12 రకాల క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఫ్రాన్స్ విడిచి ఎక్కడికి వెళ్ళకూడదని అంక్షలు విధించారు. ఇవన్నీ తప్పుడు కేసులనీ, రుమేనియా ఎన్నికల్లో టెలిగ్రామ్ యాప్ ద్వారా ప్రయోజనాలు పొందడమే తెరవెనుక అసలు ఉద్దేశమని జఖరోవా విమర్శించారు. నాటో కూటమి అనుకూలవాద, మధ్యేవాద రాజకీయనాయకుడు, బుఖారెస్ట్ మేయర్ నిక్యుసర్ డాన్ (55) ఈ ఏడాది మే 18న జరిగిన రన్నాఫ్ ఎన్నికల్లో అధ్యక్ష పదవిని గెలుచుకున్నారు. ఉక్రేన్ అధ్యక్షుడు వి.జెలెన్స్కీ దీనిని చారిత్రక విజయంగా జెలెన్స్కీ అభివర్ణించారు. పొరుగుదేశం రుమేనియా తమకు ఎంతో ముఖ్యమైన మిత్రదేశమని, ఇక కలిసి పనిచేస్తామనీ ఆయన పేర్కొన్నారు. నాటోలో రుమేనియా సభ్యత్వం పొందాలని డాన్ గట్టి పట్టుదలతో ఉన్నారు. ఉక్రేన్‌కు ఆయుధ సరఫరాను తిరస్కరించడమే లక్ష్యంగా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసిన యూనియన్ ఫర్ రుమేనియా కూటమి (ఎయుఆర్) వ్యవస్థాపక అధ్యక్షుడు జార్జ్ సిమియన్ ఓడిపోయారు. ఉక్రేన్‌కు యుద్ధసహాయం పంపకూడదని సిమియన్ గట్టిగా వాదించడం యూరప్ దేశాలకు నచ్చలేదు. గత ఏడాది నవంబరులో రుమేనియా అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి జార్జెస్క్యూ ఆశ్చర్యకరంగా మొదటి రౌండులో 23 శాతం ఓట్ల ఆధిక్యం సంపాదించారు. కానీ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలతో రుమేనియా ఉన్నతన్యాయస్థానం ఈ ఎన్నిక ఫలితాన్ని రద్దుచేసి జార్జెస్క్యూను ఎన్నికల్లో పోటీకి అనర్హుడుగా ప్రకటించింది.

## 77 శాతం గాజా ఇజ్రాయెల్ స్వాధీనం : జర్నలిస్టు మృతి

**గాజాలో** ఇజ్రాయెల్ సైన్యం దాడుల బీభత్సాన్ని కొనసాగిస్తోంది. 77 శాతం గాజా ప్రాంతం ఇజ్రాయెల్ స్వాధీనంలోకి వెళ్ళిందని గాజా ప్రభుత్వ మీడియా ఆదివారంనాడు ప్రకటించింది. ఈ దాడుల్లో స్థానిక జర్నలిస్టు హస్సన్ మజ్దీ వార్దా మరణించారు. ఆయన కుటుంబంలో ఉన్న అనేకమంది కూడా మరణించారు. ఆదివారం తెల్లవారుజాము నుండీ జరిగిన దాడుల్లో 22 మంది పాలస్తీనియన్లు మరణించారు. ఒకవైపు ఊచకోత కొనసాగుతుండగా, మరోవైపు ఆహార కొరత సమస్య ఇంకా పరిష్కారం కాలేదు. గడచిన బుధవారం నుండీ గాజాలోకి 100 లారీలలో ఆహారాన్ని, మంచినీటిని, ఇతర వస్తువులను గాజాలోకి ఇజ్రాయెల్ సైన్యం అనుమతించింది. కానీ ఒక్కరోజుకు 600 లారీలలో సహాయం వస్తేగానీ గాజాలో ప్రజల సమస్య పరిష్కారంకాదు. బయట నుండి వచ్చిన ఆహారమే పాలస్తినా ప్రజలకు దిక్కు. గాజాలో 20 లక్షలమంది ప్రజల కడుపులు నింపాలంటే బయట నుండి ఆహారసరఫరాలు రావాల్సిందే. ఈ ఏడాది మార్చి రెండో తేదీ నుండి గాజాలోకి ఇజ్రాయెల్ అంతర్జాతీయ సహాయాన్ని అనుమతించకుండా అడ్డుకుంది. దీంతో ఐక్యరాజ్యసమితి, ఇతర సహాయ బృందాలు పంపిన 3,000 పైగా లారీలు గాజా సరిహద్దుల వెలుపల స్తంభించిపోయాయి. అంతర్జాతీయ చట్టాలను, నిబంధనలను సామూహికంగా ఉల్లంఘించి ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణహోమాన్ని ఆపాలని ఐక్యరాజ్యసమితికి, అంతర్జాతీయ ప్రపంచానికి గాజా ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. 2023 సంవత్సరం అక్టోబరు 7 వ తేదీ నుండి జరుగుతున్న దాడుల్లో 53,000 మంది పాలస్తీనియన్లు మరణించగా, మరో 11,000 మంది మృతదేహాలు శిథిలాల్లో చిక్కుకుని ఉన్నాయి. మరో 1.22 లక్షలమంది యుద్ధంలో గాయపడ్డారు.



## భారత్‌లోకి రాకుండా 172 మంది బంగ్లాదేశీయులను అడ్డుకున్న బిఎస్‌ఎఫ్

**ఢాకా:** భారత భద్రతాదళాలు శనివారం రాత్రి నుండి 172 మంది బంగ్లాదేశీయులను మనదేశంలోకి ప్రవేశించకుండా వారి భూభాగంలోకి వెనక్కు నెట్టేసింది. మూడు జిల్లాలలో బంగ్లాదేశ్‌తో ఉన్న సరిహద్దు ప్రాంతాలనుండి వారిని భారత భద్రతా దళాలు వెనక్కు పంపేశాయి. మెహెర్‌పూర్, సిల్హెట్, మౌల్వీబజార్ జిల్లాలలో ఉన్న సరిహద్దుల నుండి భారత్‌లోకి ప్రవేశించేందుకు బంగ్లాదేశీయులు ప్రయత్నం చేశారు. ఇటీవలికాలంలో రోహింగ్యాలు, బంగ్లాదేశీయులు రెండు దేశాలమధ్యా ఉన్న విస్తారమైన సరిహద్దుల నుండి భారత్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నం చేస్తుండగా, ఆ ప్రయత్నాలను భారత్ దళాలు అడ్డుకుని తిరిగి వారిని వెనక్కుగెంటేస్తున్నాయి. బృందాలు, బృందాలుగా బంగ్లాదేశీయులు రాత్రిపూట భద్రతాదళాల కన్నుగప్పి భారత్‌లోకి ప్రవేశించేందుకు చాలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ బృందాలు భారత్‌లోకి ప్రవేశించి కేదార్‌గంజ్ వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా బిఎస్‌ఎఫ్ బలగాలు వారిని పట్టుకుని వెనక్కుపంపాయి.

# కెసిఆర్ దేవుడు అంటూనే జీవ సమాధి చేసే ప్రయత్నం

### టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గా రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కెసిఆర్ దేవుడు అంటూనే ఆయన్ని జీవ సమాధి చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తండ్రి గురించి కవితకు పూర్తి అవగాహన లేకపోవడం దురదృష్టకరమన్నారు. హైదరాబాద్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కెసిఆర్ కుటుంబంలో, పార్టీలో లేఖ కలకలం రేగిందన్నారు. ఏ రాజకీయ పార్టీలోనైనా అంతర్గత అంశాలు ఉంటాయన్నారు. కవిత లేఖ ద్వారా నష్టం జరుగుతుందనేది వారి కుటుంబ వ్యక్తిగత అంశమని, ఈ లేఖతో కెసిఆర్ కుటుంబంలో విభేదాలున్నాయనే భావన ఆ పార్టీ శ్రేణుల్లో కలుగుతుందన్నారు. కల్వకుంట్ల కవిత తండ్రి చాటు బిడ్డగా నాయకురాలు అయిందని, కవిత నేరుగా నాయకురాలు కాలేదన్నారు. రాజకీయంగా బలవంతురాలు కాదని అన్నారు. కవిత డిప్రెషన్‌లో లేఖలు విడుదల చేసిందన్నారు. కవిత లేఖలతో కాంగ్రెస్‌కు వచ్చిన ఇబ్బందేమీ లేదన్నారు. బిఆర్‌ఎస్‌ను చంపడం, బతికించుకోవడం వాళ్ళ వ్యక్తిగతమని అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన కోణంలోనే కెసిఆర్‌కు ప్రజలు పట్టం కట్టారని, తర్వాత అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని తెలిపారు. ఏ చరిత్ర చూసుకున్నా సాధారణంగా కుటుంబానికి కొడుకే వారసుడవుతాడని, కొడుకు లేని పక్షంలో కూతురు వారసురాలు అవుతుందన్నారు. కవిత రాష్ట్ర రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపించదని, కెసిఆర్ కూతురు కాబట్టే కవిత ఎపిసో మీడియాకి ఆసక్తిగా మారిందన్నారు. కవిత లేఖ వల్ల బిఆర్‌ఎస్ ఓటు బ్యాంకు చెదిరిపోయిందని చెప్పారు. కవిత లేఖ వల్ల కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి నష్టం లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పటి నుంచో బలంగా ఉందని, భవిష్యత్తులో కూడా అదే పటిష్టతతో కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్ మొదటి స్థానంలో, బిఆర్‌ఎస్ రెండో స్థానంలో, బిజెపి మూడో స్థానంలో ఉన్నాయని చెప్పారు. కవిత రాస్తున్న లేఖలు తమ రాజకీయ శత్రువైన బిజెపికి ఉపయోగపడతాయన్నదే తమ ఆందోళన అని జగ్గారెడ్డి అన్నారు. బిఆర్‌ఎస్ కార్యకర్తలను కాంగ్రెస్ వైపు ఆకర్షించేందుకు తగిన వ్యూహాన్ని ముఖ్యమంత్రి, టిపిసిసి అధ్యక్షులతో చర్చించి అమలు చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పార్టీ శ్రేణులకు జగ్గారెడ్డి సూచించారు.

## ఉగ్రవాదాన్ని ఎవరు ప్రోత్సహించినా తీవ్ర పరిణామాలు

### లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

**జంషెడ్‌పూర్ /రాంచీ (జార్ఖండ్) :** భారతదేశ నేలపై ఉగ్రవాదాన్ని ఎవరు ప్రోత్సహించినా ఆపరేషన్ సిందూర్ కంటే తీవ్రస్థాయి పరిణామాలను చవి చూడాల్సి వస్తుందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఉద్ఘాటించారు. సరిహద్దు వెంబడి లక్ష్యాలను చేదించడంలో భారత సైన్యం శౌర్యం, ధైర్యాన్ని ప్రశంసిన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, భారతదేశం తనకు తానుగా రక్షించుకుంటుందని, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కొత్త విధానాలు, కార్యక్రమాలను కూడా అమలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు.జంషెడ్‌పూర్‌లోని సింగ్‌భూమ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎస్‌సిసిఐ)లో జరిగిన ప్లాటినమ్ జుబ్లీ ఉత్సవాల సందర్భంగా హాజరైన వారిని ఉద్దేశించి ఓం బిర్లా ప్రసంగించారు. ప్రపంచంలో ఎక్కడైనా సరే ఉగ్రవాదాన్ని సమష్టిగా ఎదుర్కోవాలని ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు పిలుపునిచ్చారని ఆయన తెలిపారు. ఏదేశమైనా మన భూభాగంలో ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తే పరిణామాలు ఎలా ఉంటాయన్నది భారత సైన్యం నిరూపించిందన్నారు. అయితే ఇక ముందు అలాంటి పరిణామాలు ఆపరేషన్ సిందూర్ కంటే కూడా చాలా తీవ్రస్థాయిలో ఉంటాయని ఓం బిర్లా ఉద్ఘాటించారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యం సాధించిన విజయానికి ఆయన స్వదేశీ రక్షణ పరిశ్రమను ప్రశంసించారు. గడచిన ఒక దశాబ్ద కాలంలో సాంకేతికత, వ్యవస్థాపకత, నైపుణ్యం లోపించిన కారణంగా భారతదేశం రక్షణ సామాగ్రిని దిగుమతి చేసుకునేదని, అయితే ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. భారతదేశం క్రమంగా స్వయం స్వావలంభన సాధించడమే కాకుండా రక్షణ సామాగ్రిని ఎగుమతి చేసే ప్రపంచ నాయకుడిగా ఎదిగిందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సంతోషాన్ని వ్యక్తం చేశారు. దేశీయ పరిశ్రమలకు మోదీజీ కొత్త దిశానిర్దేశం చేశారని, అంతేకాకుండా స్వయం స్వావలంభన అవసరమని ఆయన నొక్కిచెప్పారని తెలియజేశారు.ప్రబలంగా ఉన్నటువంటి పోటీ ప్రపంచ దృశ్యంలో భారతదేశం అవకాశాల భూమిగా విరాజిల్లుతున్నదని లోక్‌సభ స్పీకర్ నొక్కిచెప్పారు. మేధోశక్తి, సాంకేతికత, యువ, నైపుణ్య మానవ వనరులు ప్రపంచాన్ని నడిపించే సామర్థ్యం భారతదేశానికి మెండుగా ఉన్నదని ఆయన ప్రస్తుతించారు.

## బలగం అంజన్న కన్నుమూత



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ప్రముఖ రంగస్థల కళాకారుడు,బలగం సినిమా నటుడు అంజన్న (జీవీ బాబు) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఆయన ఇవాళ వరంగల్ లోని హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మృతి చెందారు. కమెడియన్ వేణు యెల్దండి దర్శకత్వం, దిల్ రాజు ప్రొడక్ష న్ నుండి వచ్చిన సినిమాలో బాబు హీరో ప్రియదర్శి తాతగా నటించి ఆకట్టుకున్నారు. గత కొన్ని రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధప డుతూ ఓ ప్రైవేట్ హస్పిటల్ లో డయాలసిస్ పొందుతున్నారు. ఈ మధ్యే బలగం డైరెక్టర్ వేణు యెల్దండి, హీరో ప్రియదర్శి జీవీ బాబు వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందించారు. బలగం చిత్ర బృందంలోని సభ్యులు బాలు కాయితి, ఆకునూరి దేవయ్య, బలగం కొము రమ్మలు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి వారికి ధైర్యం చెప్పి వచ్చారు. వేణు జీవీ బాబు సతీ మణితో ఫోన్లో మాట్లాడి ఓదార్చారు. జీవీ బాబుకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఇంతలోనే అంజన్న మరణించడం బాధాకరమ ని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని డైరెక్టర్ వేణు యెల్దండి పేర్కొన్నారు. హీరో ప్రియదర్శి జీవీ బాబు మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు.అంజన్న రంగస్థల నటుడు.. బలగం సినిమా తర్వాత రజకార్ మూవీలో కూడా నటించారు. మొత్తం 20 సినిమాలకు పైగా నటించిన జీవీ బాబు.. బలగం చిత్రంతో గుర్తింపు పొందారు.

## భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

అవకాశం ఉందన్నారు. మంగళ, బుధవారాల్లో జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలో.మీ. వేగంతో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. 29న రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. సాధారణంగా జూన్ మొదటి వారంలో నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకుతాయి. కానీ ఈ ఏడాది 8 రోజులు ముందే తీరాన్ని తాకాయి. గత 16 సంవత్సరాలలో ఈ సారే కేరళలో రుతుపవనాలు తొలిసారిగా ప్రారంభమయ్యాయి.

## 93.87% ఉత్తీర్ణత

(మొదటి పేజీ తరువాయి)

దార శశికాంత్, మూడవ ర్యాంక్‌లో గండె శ్రీరామ్ మిశ్ర ఉన్నారు. అలాగే కెమికల్ ఇంజినీరింగ్‌లో మొదటి ర్యాంక్ లెంక తేజ సాయికురాగా, సివిల్ ఇంజినీరింగ్‌లో గోల్కొండ నిఖిల్ కౌశిక్, కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్‌లో శ్రీకాంత్, ఎలక్ట్రానిక్స్,కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో మొదటి ర్యాంక్ కట్లే రేవతి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో మొదటి ర్యాంక్ కాసుల శ్రావణి. ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రూమెంటేషన్ ఇంజినీరింగ్‌లో రాపర్తి చందన, మెకానికల్ ఇంజినీరింగ్‌లో పోతూ గంటి కార్తిక్ మెటలర్జికల్ ఇంజినీరింగ్‌లో మొదటి ర్యాంక్ తోట సుబ్రహ్మణ్యం సత్తా చాటారు. మైనింగ్ ఇంజినీరింగ్‌లో మొదటి ర్యాంక్ కుర్మా అక్షయ, ఫార్మసీలో తొలి ర్యాంక్ ఐలి చందన ర్యాంక్ సాధించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా విసి ప్రొఫెసర్ కుమార్ మొలుగురం, సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్, ఉన్నత విద్యామండలి వైస్‌ఛైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## ఇంకా మార్చురీలోనే

(మొదటి పేజీ తరువాయి)

శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని అక్కడి పోలీసులు ఛత్తీస్‌ఘఢ్ ప్రభుత్వానికి లేఖ రాశారు. ఇదే సమయంలో పౌర హక్కుల సంఘం, అమరవీరుల బంధుమిత్రుల సంఘం నంబాల మృత దేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు నంబాల మృతదేహాన్ని అప్పగించాలని పోలీసులకు సూచించింది. కానీ ఛత్తీస్‌ఘఢ్ అడ్వకేట్ జనరల్ మాట్లాడుతూ ఛత్తీస్‌ఘఢ్ ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఎలా సూచనలు ఇస్తుందని ప్రశ్నించారు. దీనితో నంబాల మృతదేహం అప్పగింత మళ్లీ సమస్యాత్మకమైంది. ఇప్పటి వరకు ఛత్తీస్‌ఘఢ్ రాష్ట్రం నారాయణపూర్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో కేశవరావు మృతదేహం ఉన్నట్లు సమాచారం. ఎన్‌కౌంటర్ జరిగిన ఐదురోజులు కావడం నంబాల కేశవరావు మృతదేహాన్ని గుర్తించిన తర్వాత కూడా మృతదేహం అప్పగింతపై తర్జన భర్జనలు జరుగుతున్నాయి. బంధుమిత్రులు, పౌర హక్కుల సంఘాలు సుప్రీం కోర్టును ఆశ్రయించే పనిలో ఉన్నాయి. ఇదిలా ఉండగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా మృతదేహాన్ని శ్రీకాకుళం తరలిస్తే శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని మృతదేహాన్ని ఇక్కడకు తరలించ రాదని సుప్రీం కోర్టును ఆశ్రయించే పనిలో ఉన్నారని సమాచారం. మొత్తంగా మధ్య భారతంలో సాయుధ పోరాటానికి ఒక ఊపును, రూపును ఇచ్చిన నంబాల కేశవరావు మరణం, మృతదేహం అప్పగింత కూడా చర్చనీయాంశమే అయింది. ఎన్‌కౌంటర్‌లో మరణించ లేదని ఒడిశా ఆసుపత్రిలో షుగర్ వ్యాధికి చికిత్స పొందుతున్న కేశవరావును పట్టుకువచ్చి హింసించి చంపారని ఒక వైపు ఆరోపణలు, మరో వైపు మృతదేహం అప్పగింతపై రెండు ప్రభుత్వాలు కేశవరావు బంధుమిత్రుల మధ్య వివాదం నడుస్తుంది. దీనిపై అంతిమంగా ఎవరు ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

## హై అలర్ట్ (మొదటి పేజీ తరువాయి)

కంటైనర్ నౌక ఎంఎస్‌సి ఇఎల్‌ఎస్‌ఎ 3 (ఐఎంఒ నం. ఆదివారం ఉదయం 07:50 గంటలకు కొచ్చి తీరంలో వరదల కారణంగా మునిగిపోయింది. ఈ నౌక 640 కంటైనర్ల వస్తుందగా మునిగిపోయింది. వాటిలో 13 ప్రమాదకరమైన సరుకుతో కూడిన కంటైనర్లు, 12 కాల్షియం కార్బైడ్ కలిగి ఉన్నాయి. దీనిలో 84.44 మెట్రిక్ టన్నుల డీజిల్, 367.1 మెట్రిక్ టన్నుల ఫర్నేస్ ఆయిల్ కూడా లోడ్ చేయబడ్డాయని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 24 మంది సిబ్బందిలో 21 మందిని శనివారం ఇండియన్ కోస్ట్ గార్డ్ రక్షించిచగా, మిగిలిన ముగ్గురిని ఐసిజి ప్రారంభించిన రెస్క్యూ ఆపరేషన్‌లో చేరిన ఐఎన్ఎస్ సుజాత రక్షించినట్లు అధికారులు తెలిపారు. ఒడ్డుకు కొట్టుకువచ్చే ఏవైనా కార్గో కంటైనర్లు లేదా చమురు చిందటాలను తాకవద్దని కేరళ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ (కెఎస్‌డిఎంఎ) ప్రజలను హెచ్చరించింది. ఓడ మెరైన్ గ్యాస్ ఆయిల్, చాలా తక్కువ సల్ఫర్ ఇంధన నూనెను తీసుకువెళుతున్నట్లు కోస్ట్ గార్డ్ నిర్ధారించింది. లైబీరియన్ కంటైనర్ నౌక నుండి వచ్చిన డిస్ట్రెస్ కాల్ తర్వాత ఇండియన్ కోస్ట్ గార్డ్ ఓడలు, విమానాలను మోహరించి శనివారం రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించింది. రష్యా, ఉక్రెయిన్, జార్జియా, ఫిలిప్పీన్స్‌కు చెందిన పౌరులు సహా 24 మంది సిబ్బందిలో 21 మందిని రక్షించారు. రక్షణ ఏర్పాట్లలో సహాయం చేయడానికి ముగ్గురు సీనియర్ సిబ్బంది అక్కడే ఉన్నారని మంత్రిత్వ శాఖ తెలిపింది. అయితే, శనివారం రాత్రి పూట ఓడ పరిస్థితి క్షీణించగా, ఆదివారం బోల్తా పడిందని, ముగ్గురు సిబ్బందిని ఓడను వదిలివేయవలసి రాగా, ఐఎన్ఎస్ సుజాత వారిని రక్షించిందని మంత్రిత్వ శాఖ ప్రకటన తెలిపింది. 184 మీటర్ల పొడవున్న ఎంఎస్‌సి ఆఎల్‌ఎస్‌ఎ 3 అనే నౌక శుక్రవారం విజింజం ఓడరేవు నుండి కొచ్చికి బయలుదేరింది. 24న మధ్యాహ్నం 1.25 గంటల ప్రాంతంలో ఓడను కలిగి ఉన్న కంపెనీ 26 డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గుతున్నట్లు భారత అధికారులకు తెలియజేసింది. అత్యవసర సహాయం కోరింది. కోస్ట్ గార్డ్ ప్రమాదంలో ఉన్న ఓడ సమీపంలో ఓడలు, విమానాలను మోహరించడం ద్వారా సహాయ కార్యకలాపాలను సమన్వయం చేస్తోంది. ఓడలోని 24 మంది సభ్యుల సిబ్బందిలో ఒక రష్యన్ (ది మాస్టర్), 20 మంది ఫిలిప్పీన్స్, ఇద్దరు ఉక్రేనియన్లు, ఒక జార్జియన్ జాతీయుడు ఉన్నారు. కేరళ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ ప్రకారం... కంటైనర్లు, చమురుతో సహా సరుకు ఒడ్డుకు కొట్టుకుపోయే అవకాశం ఉంది. తీరంలోని కొన్ని ప్రాంతాలలో చమురు పొరలు కనిపించవచ్చని కెఎస్‌డిఎంఎ హెచ్చరించింది.

## భారీ మార్పులు తెస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ముగింపు కార్యక్రమానికి మంత్రి శ్రీధర్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మా ట్లాడారు. వైద్యులు కేవలం వృత్తి నిపుణులే కాదని, సమాజ శ్రేయస్సు కోసం పని చేసే సేవాతత్పరులని కొనియాడారు. వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహలకు వైద్యులు తెలిపిన సూచనలు, సమస్యలపై సుధీర్ఘంగా చర్చించేందుకు ఓ సమావేశాన్ని ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ అమెండ్మెంట్, అనుమతులు, లైసెన్సింగ్, తదితర పరిపాలన సంబంధిత సమస్యలపై వైద్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభు త్వం సానుభూతితో చూస్తుందని తెలిపారు. వైద్యులు సమాజంలో పోషిస్తున్న పాత్రకు అండ గా ఉండాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నా రు. తానాకాన్ 11వ రాష్ట్ర సదస్సు ద్వారా వైద్యు లు తమ సమస్యలను సమగ్రంగా చర్చించుకోవడం హర్షణీయమని, ఇలాంటి వేదికలు ప్రభుత్వానికి చక్కటి సూచనలు అందించే అవకాశం కల్పిస్తాయని పేర్కొన్నారు. వైద్యులు సూచించిన సమస్యలను, జిల్లా స్థాయిలో పరిష్కరించేందుకు కలెక్టర్లతో చర్చించి తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన దిశగా విద్య, ఆరోగ్యరంగాలకు ప్రాధాన్యతనిస్తూ భారీ స్థాయిలో మార్పులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి మార్గంలో తీసుకెళ్లే విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. విద్యారంగ అభివృద్ధికి సంబంధించి ప్రత్యేకంగా ఎడ్యుకేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేయగా విద్యావిధానాల రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు పెంచి నిపుణుల సేవలను అం దుబాటులోకి తీసుకువస్తామన్నారు. వైద్యులు ప్రజలకు సేవ చేయడానికి రాజకీయాల్లోకి రావ డం శుభపరిణామం అన్నారు. అనంతరం ప్రభు త్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యానారాయణ( మానకొండూర్ ఎమ్మెల్యే), డా.హరీష్‌బాబు (సిర్పూర్ ఎమ్మెల్యే), డా.సంజయ్ (జగిత్యాల ఎమ్మెల్యే). డా.సంజయ్ (కోరుట్ల ఎమ్మెల్యే)లు మాట్లాడుతూ సామాన్యులకతీతంగా అతి తక్కువ ధరలో వైద్యం అందిస్తున్న చిన్న మధ్యతరగతి హాస్పిటల్స్‌కు 33 అనుమతులు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్‌తో ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వివిధ విభాగాల నుంచి పర్మిషన్ ఒకే వ్యవస్థ నుంచి తీసుకునే విధంగా ఉండాలని, వారి సమస్యలను పరిష్కరించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వైద్యులు వైద్యాన్ని సామాజిక కోణంలో చూసి సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. అనంతరం తానాకాన్ రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్‌కతారి, ఆర్గనైజింగ్ చైర్మన్ ఎలంగందుల శ్రీనివాస్, కార్యదర్శి చాట్ల శ్రీధర్‌లు మాట్లాడుతూ చిన్న మధ్యతరగతి దవాఖానలు ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బీహార్, హర్యానా రాష్ట్రాలలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌లో సవరణలు చేశారని, తెలంగాణలోనూ చేయాలని కోరారు. ఈ సదస్సుకు 900 మంది వైద్యులు హాజరైనట్లు తెలిపారు. 50 పడకల ఆసుపత్రులకు అనుమతులను సరళీకరించాలని కోరా రు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ ట్రెజరర్ డాక్టర్ రాజ్‌కుమార్, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డా.ఎనమల్ల నరేష్, డా.మంగీలాల్, డా.సునీల్‌రెడ్డి, డా.మహేష్, డా.సూర్యనారాయణ రెడ్డి, డా.జగన్‌మోహన్ రావు, డా.బిఎన్‌రావు, డా.విజేందర్‌రెడ్డి, డా.టికెకె నాయుడు, డా.లక్ష్మ ణ్, డా.రఘురాం, డా.విజయ మోహన్‌రెడ్డి, డా.శ్రీలతరెడ్డి, డా.శైలజ, డా.మమతా రెడ్డి, డా.వై.నరేంద్ర, డా.జయరాం, డా.ఈ.శైలజ, డా.శేష శైలజ, డా.రవికాంత్, డా. రమణాచారి, డా.రామ్‌కిరణ్ తదితరులున్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## శంషాబాద్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని ఢీ కొట్టిన లారీ

కానిస్టేబుల్ మృతి..ఇద్దరు కానిస్టేబుళ్లకు తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** బెంగళూరు హైదరాబాద్ జాతీయ రహదారిపై ఉన్న శంషాబాద్ వద్ద ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శంషాబాద్ సమీపంలో అదుపుతప్పి ఓ లారీ బోల్తాపడిందని పోలీసులకు సమాచారం అందింది. దీంతో స్థానిక పోలీసులు పెట్రోలింగ్ వాహనంలో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అదే సమయంలో అతివేగంగా వచ్చిన మరో లారీ వెనక నుంచి పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో విజయ్‌కుమార్ అనే కానిస్టేబుల్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు కానిస్టేబుళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను సమీపంలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. లారీ డ్రైవర్ మద్యం మత్తు, మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. మృతి చెందిన కానిస్టేబుల్ విజయ్ కుమార్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడు శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు.

## మునీర్ మరణం అత్యంత బాధాకరం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సీనియర్ పాత్రికేయుడు ఎండి. మునీర్ మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. వృత్తి పట్ల నిబద్ధత, సామాజిక ఉద్యమాల పట్ల అంకిత భావం కలిగిన మునీర్ మరణం అత్యంత బాధాకరమన్నారు. వివిధ పత్రికల్లో పనిచేసిన మునీర్ సింగరేణికి సంబంధించి ఎన్నో విషయాల్లో ప్రజలను చైతన్యపరిచారన్నారు. మునీర్ మరణం పాత్రికేయలోకానికి తీరనిలోటు అని అన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ముఖ్యమంత్రి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ఉత్తమ జర్నలిస్ట్‌ను కోల్పోయాం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సంతాపం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సీనియర్ జర్నలిస్ట్ మునీర్ మరణం బాధాకరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. మునీర్ మరణం పట్ల ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎఐటియుసి సీనియర్ నాయకుడు అబ్రహం నాయకత్వంలో మునీర్ ఎఐవైఎఫ్ నాయకుడిగా, క్రియాశీలకమైన నాయకుడిగా ఎదిగారన్నారు. ఆ తరుణంలో అనేక నిర్బంధాలను ఎదుర్కొన్నారని సాంబశివరావు తెలిపారు. కార్మికుల కోసం సమ్మె చేసిన సందర్భంలో దాదాపు ఏడుగురు కాల్పుల్లో చనిపోయారని, ఆ ఉద్యమానికి అబ్రహం, మునీర్ లాంటి వారు నాయకత్వం వహించారని గుర్తు చేశారు. ఆ తర్వాత జర్నలిస్టుగా ప్రతిరోజు అనర్గళంగా వ్యాసాలు రాసిన గొప్ప వ్యక్తి అని కొనియడారు. ఏ అంశంపైనైనా వ్యాసాలు రాసే జర్నలిస్టుగా మంచి గుర్తింపు పొందారన్నారు. వ్యక్తిగతంగా తనకు 1980 నుండి సంబంధాలు ఉన్నాయని సాంబశివరావు చెప్పారు. ఉత్తమ కమ్యూనిస్టు నాయకుడు, ఉత్తమ కార్మిక నాయకుడు, ఉత్తమ జర్నలిస్టు, ఉత్తమ సామాజిక ఉద్యమకారున్ని కోల్పోవడం చాలా దురదృష్టకరమని అన్నారు.

## ఆకట్టుకొన్న 'నీల మేఘ శ్యామ' నృత్యరూపకం

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** దాదాపు 200 మంది విద్యార్థులు ప్రదర్శించిన 'నీల మేఘ శ్యామ' నృత్యరూపకం వీక్షకులను ఆకట్టుకొన్నది. గురు శ్రవ్యమానస ఆధ్వర్యంలో ప్రముఖ కూచిపూడి నృత్యకళా సంస్థ సుమధుర ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన వేసవి శిక్షణాశిబిరం ముగింపు వేడుక సందర్భంగా ఆదివారం రవీంద్రభారతిలో అంగరంగవైభవంగా ఈ నృత్యరూపక ప్రదర్శన జరిగింది. కృష్ణ భగవానుని లీలామృతంలోని కొన్ని ముఖ్యఘట్టాలను గురు శ్రవ్య మానస భోగిరెడ్డి తన శిష్యబృందంతో అద్భుతంగా రూపకల్పన చేశారు. ఈ సందర్భంగా శిల్పారామం ప్రత్యేకాధికారి, రిటైర్డ్ ఐఎఎస్ జి.కిషన్‌రావు, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ ఎండి డా.కె.లక్ష్మి, ప్రముఖ సినీ నటులు విద్యార్థుల ప్రదర్శనను మంత్రముగ్ధులై ఆశీర్వదించారు. విద్యార్థులను మెమోంటోలతో సత్కరించారు.

## దేశ భవిష్యత్తు కోసమే ఇప్టా సాంస్కృతిక ఉద్యమం

ఇప్టా జాతీయ ఉపాధ్యాక్షుడు కందిమల్ల ప్రతాపరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ భవిష్యత్తు కోసం స్వాతంత్ర్య పోరాటంలో ఇండియన్ పిపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) సాంస్కృతిక ఉద్యమం సాగించిందని ఇప్టా జాతీయ ఉపాధ్యాక్షుడు కందిమల్ల ప్రతాపరెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కళారూపాయాలతో జనంలో చైతన్యం నింపడం ద్వారా ఉద్యమ ఉధృతికి శ్రమించిందన్నారు. 'ఇప్టా' 83వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ హిమాయత్‌నగర్ సత్యనారాయణ రెడ్డి భవన్ వద్ద 'ఇప్టా' జెండాను ఆయన ఎగురవేశారు. అంతకుముందు మాదాల రంగారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కందిమల్ల ప్రతాప రెడ్డి మాట్లాడుతూ 1943 మే 25న దేశంలో ఉన్నతమైన లక్ష్యాలతో ఇప్టా ప్రారంభమైందని తెలిపారు. యుద్ధాలకు వ్యతిరేకంగా శాంతి కోసం ప్రయత్నాలు చేసిందన్నారు. దేశ భవిష్యత్తు కోసం స్వాతంత్ర్య పోరాటంలో సాంస్కృతిక ఉద్యమం సాగించిందని చెప్పారు. నేడు కులం, మతం పేరిట ప్రజలు కొట్టుకుచస్తున్నారని, కులరహిత సమ సమాజం కోసం ప్రజాకళాకారులు తమ కళలు, సాహిత్యం ద్వారా చైతన్యవంతులను చేయవలసిన అవసరం ఉందన్నారు. ప్రముఖ విప్లవ నటుడు, దర్శకుడు మాదాల రంగారావు జయంతి సందర్భంగా ఎర్ర మల్లెలు, ఎర్ర సూర్యుడు, విప్లవ శంఖం సినిమాలలోని పాటలు పాడుతూ కళాకారులు నివాళులు అర్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్ద శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కన్నం లక్ష్మి నారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి కేతరాజు ఉప్పలయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి డి.వేణుగోపాల్ చారి, జనసేవాదళ్ నాయకుడు మురళీకృష్ణ ఎఐవైఎఫ్ హైదరాబాద్ నాయకులు కాంపల్లి కళ్యాణ్, పెరిమళ్ అనిల్ కుమార్, కళాకారులు రాము, శేఖర్, విజయ్‌కుమార్, సరస్వతి భాస్కర్, మహేష్, పరుశురాం, రమేష్ పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇచ్చేవిధంగా కృషి చేస్తానని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. హైదరాబాద్ హరిత హోటల్‌లో జరిగిన అభినందన సభలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్‌ఖన్నా నేతృత్వంలో ప్రతినిధి బృందం వినతిపత్రం అందచేశారు. సత్యంను కార్మికులు ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఆరోగ్య మిషన్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం రామ రాజేష్‌ఖన్నా, కార్యనిర్వాహక కార్యదర్శి నూర సంపత్ పటేల్ మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరికీ క్యాడర్ ఫిక్సేషన్ చేసి, బేసిక్‌పే అమలు చేయాలని కోరారు. పిఎఫ్ ద్వారా ప్రతి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగి పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఉద్యోగ విరమణ ప్రయోజనాలలో పెన్షన్ విధానంలో ప్రతి ఉద్యోగికి ఉద్యోగ భద్రత కల్పిస్తూ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ప్రస్తుత కాలానికి అనుగుణంగా పెరిగిన నిత్యావసర ధరలు, పిల్లల చదువులకు తగ్గట్టుగా మూల వేతన సవరణ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 7 నెలల పిఆర్‌సి బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగి విధి నిర్వహణలో మరణిస్తే, వారి కుటుంబంలో ఒకరికి ఆరు నెలలలోపు కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగులందరికీ సంవత్సరానికి 35 సాధారణ సెలవులు మంజూరు చేయాలని, ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు, హెల్త్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని, సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వారు కోరారు.



## మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై సమగ్ర విచారణ

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి డిమాండ్

**ప్రజాపక్షం/చిగురుమామిడి :** కేంద్ర ప్రభుత్వం కగార్ ఆపరేషన్ పేరుతో ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దుల్లో మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేయడం సరికాదని, ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తిచే సమగ్ర విచారణ జరిపించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం చిగురుమమిడి మండల కేంద్రంలోని ముస్కు రాజిరెడ్డి స్మారక భవన్‌లో మండల సహాయ కార్యదర్శి బూడిద సదాశివ అధ్యక్షతన మండల కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని, అంతరాలు లేని సమసమాజ నిర్మాణం కోసం, పేదల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేయడం సరైనది కాదన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు అవుతుందని, పేదవాడి సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చెందిందన్నారు. ఉద్యోగ ఉపాధి కల్పించడంలో ఘోరంగా విఫలం చెందారని ఆరోపించారు. కార్పొరేట్ బడా పారిశ్రామిక వేత్తలకు ఊడిగంచేయడం తప్ప ప్రజలకు చేసిందేమీలేదని విమర్శించారు. పేదల కోసం పనిచేసే మావోయిస్టులను అంతం చేస్తున్నారని, పేదల డిమాండ్ల కోసం పోరాటం చేస్తున్న మావోయిస్టులపై బిజెపి ప్రభుత్వ దమనకాండను మేధావులు, అభ్యుదయవాదులు ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు.

రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడం మూలంగా అభివృద్ధి కుంటుపడిందని, తక్షణమే గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, బోయిని అశోక్, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు అందె చిన్నస్వామి, బోయిని సర్దార్ వల్లభాయ్ పటేల్, కాంతాల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సిపిఐ కరీంనగర్ జిల్లా 23వ మహాసభలు ఈనెల 27, 28 తేదీలలో కరీంనగర్‌లోని మధు గార్డెన్‌లో జరుగుతాయని, మహాసభల విజయవంతం కొరకు కరపత్రాన్ని సిపిఐ జిల్లా, మండల నాయకులు ఆవిష్కరించారు. మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ హాజరవుతున్నారని, మహాసభల విజయవంతం కోసం పార్టీ ఎంపిక చేయబడిన ప్రతినిధులంతా హాజరుకావాలని కోరారు.

## తెలంగాణకు బిజెపి సర్కార్ ద్రోహం

ఎపిలోని అక్రమ ప్రాజెక్టులను తక్షణమే రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు ఆపాలి

దిల్లీకి అఖిలపక్షాన్నయినా తీసుకెళ్లాలి

మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రానికి కేంద్రంలోని బిజెపి తీవ్ర ద్రోహం చేస్తోందని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు దుయ్యబట్టారు. ఎపిలోని అక్రమ ప్రాజెక్ట్‌లను తక్షణమే రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఆపాలని, లేదంటే ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపైన ఢిల్లీలోని సిడబ్ల్యుసి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని, కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ నీతిని ఎండగడుతామని హరీశ్‌రావు హెచ్చరించారు. త్వరలోనే ప్రత్యేక శాసనసభ సమావేశాన్ని నిర్వహించి, బనకచర్ల ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసి, ఆ తీర్మానాన్ని కేంద్రానికి పంపించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై సుప్రీం కోర్టులో న్యాయ పోరాటం చేయాలని, ఎంపిలు పార్లమెంట్‌లో గట్టిగా ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ అక్రమ ప్రాజెక్ట్‌ల విషయంలో బిజెపి కేంద్ర మంత్రులు ఆలోచించాలని, కాంగ్రెస్ మొద్దు నిద్ర వీడాలని, రాష్ట్ర హక్కులు కాపాడాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రాజెక్టులకు కేంద్రం అనుమతులు ఇవ్వబోదని, కానీ ఎపిలో ప్రాజెక్టులకు అనుమతులు లేకపోయినప్పటికీ కేంద్రం నిధుల కనకవర్షం కురిపిస్తోందని, ఇదెక్కడి నీతి అని నిలదీశారు. పోలవరం ప్రాజెక్ట్‌కు రూ.80వేల కోట్లు, బనకచర్లకు రూ.80వేల కోట్లు మొత్తం రూ.1,60,000 కోట్లు ఎపికి ఇస్తారని, కానీ ఒక్క శాతమైనా తెలంగాణ రాష్ట్ర ప్రాజెక్ట్‌లకు ఇచ్చారా? అని నిలదీశారు. ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది బిజెపి ఎంపిలు ఉండి ఏం లాభమన్నారు. కాళేశ్వరం కోసం తాము ఆర్‌ఇసి, పిఎఫ్‌సి నుంచి రుణాలు తీసుకొచ్చామని, ఎఫ్‌ఆర్‌బిఎం కంటే అదనంగా ఉన్నదని కేంద్రం రికవరీ పెట్టిందని, ఎపికి మాత్రం ఎఫ్‌ఆర్‌బిఎం పరిధి దాటి రుణాలు తెచ్చుకునే అవకాశం కల్పిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ పట్ల బిజెపికి కక్ష, సవతి తల్లి ప్రేమ ఏమిటని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇచ్చారని, కానీ కాళేశ్వరం, పాలమూరు, సీతారామ ప్రాజెక్టులకు ఎందుకు జాతీయ హోదా ఇవ్వలేదని ప్రశ్నించారు. గోదావరి ట్రిబ్యునల్ వచ్చేలోపే బనకచర్ల ప్రాజెక్ట్‌ను నిర్మించి, ప్రజాధనం ఖర్చు చేశామని, అందుకే నీళ్ల కేటాయించాలని చెప్పి, 200 టిఎంసిలు తీసుకునేందుకు ఎపి కుట్ర చేస్తోందని ఆరోపించారు. దీనిని కూడా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవడంలేదని, కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేంద్ర మంత్రులుగా ఉండి ఏం చేస్తున్నారని నిలదీశారు.

**నీతి ఆయోగ్‌లో ఎందుకు ప్రశ్నించలేదు :**

నీతి ఆయోగ్‌ను బహిష్కరిస్తామని చెప్పిన సిఎం రేవంత్ రెడ్డి, ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ సమావేశానికి హాజరయ్యారని, ఈ సమావేశంలో బనకచర్ల ప్రాజెక్ట్ అంశంపై నీతి ఆయోగ్‌లో ఎందుకు మాట్లాడలేదని హరీశ్‌రావు మండిపడ్డారు. గోదావరి మీద కూడా భవిష్యత్తులో కొత్త ట్రిబ్యునల్ వస్తుందని భావించి, ప్రాణహిత ప్రాజెక్ట్‌కు 160 టిఎంసిల నీటి కేటాయింపులు ఉంటే, కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు 240 టిఎంసిల నీటి కేటాయింపులు చేశామని వివరించారు. దేవాదుల 38 నుంచి 60 టిఎంసిలకు, సీతమ్మ సాగర్‌కు 67 టిఎంసిలు, సమ్మక్కసాగర్‌కు 47 టిఎంసిలు, చనాఖా కొరాటాకు 5, వార్ధా 5 టిఎంసి అంటే మొత్తం 969 టిఎంసిలలో 950 టిఎంసిలు కేటాయించి, పూర్తి చేశామని, మరి కొన్ని ప్రాసెస్‌లో ఉన్నాయని తెలిపారు. కృష్ణాలో తాత్కాలిక ఒప్పందం ప్రకారం, 34శాతం నీటి కేటాయింపులు ఉన్నాయని, కానీ సిఎం రేవంత్ చేతగాని తనంతోనే తెలంగాణ 65 టిఎంసిల నీళ్లను తక్కువ వాడుకున్నదన్నారు. 27 శాతం మాత్రమే వాడుకున్నదని, చరిత్రలో ఇది అత్యల్పమని, చంద్రబాబుకు రేవంత్‌రెడ్డి గురుదక్షిణ చెల్లిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు.

## పాటలతో పోరాడటానికి ప్రజలను సిద్ధంచేయాలి

పెట్టుబడిదారులకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం / వరంగల్ ప్రతినిధి :** పాటలతో ప్రజలను చైతన్యపరిచి పోరాటాలకు ప్రజలను సిద్ధం చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం వరంగల్ శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో సిపిఐ జిల్లా కార్యాలయంలో ప్రజానాట్యమండలి 83వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా సువర్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రజానాట్యమండలి ప్రజలను చైతన్యపరిచిందని అన్నారు. పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు పాటలు, నాటికలు, కథల రూపంలో ఎలుగెత్తి చాటిందన్నారు. దేశంలో ఇప్టా, ప్రజానాట్యమండలికి గొప్ప చరిత్ర ఉందని, ఎందరో కళాకారులను తయారు చేసిన చరిత్ర ప్రజానాట్యమండలిదేనని అన్నారు. దేశంలో మతోన్మాదానికి వ్యతిరేకంగా వామపక్ష, అభ్యుదయ శక్తులకు అండగా ప్రజానాట్యమండలి నిలిచిందన్నారు. దేశంలో కార్పొరేట్, పెట్టుబడి దారులకు మోదీ ప్రభుత్వం ప్రజల సంపదను ధారాదత్తం చేస్తూ ప్రజల సంక్షేమాన్ని విస్మరించందని అన్నారు. రానున్న రోజులలో పెట్టబడిదారులకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయంగా నిలుస్తారని చెప్పారు. ఈ దిశగా ప్రజానాట్యమండలి కళాకారులు ప్రజలను మరింతగా చైతన్యపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె.బాష్‌మియా, ప్రజానాట్యమండలి గౌరవ అధ్యక్షుడు గన్నారపు రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి దామెర క్రిష్ణ, ఉపాధ్యక్షులు ఆరెల్లి రవి, దండు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో కళాకారులకు, షీల్డ్‌లను, ప్రశంసాపత్రాలను అందించారు. తొలుత ప్రజానాట్యమండలి జెండాను సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఎగురవేశారు.

## వెల్ఫేర్ బోర్డు కమిటీ సమావేశం రద్దు చేయాల్సిందే

ప్రైవేట్ ఏజెన్సీలతో ఉద్యోగ నియామకాలు నిలిపేయాలి

మంత్రి పొన్నం ప్రభాకర్ హామీతో సమ్మె వాయిదా

జూన్ 2లోపు జెఎసికి ఇచ్చిన హామీలు అమలు చేయాలి

లేదంటే మళ్లీ సమ్మె బాటపడుతాం

టిజిఎస్ ఆర్‌టిసి చైర్మన్ ఈదురు వెంకన్న

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వెల్ఫేర్ బోర్డు కమిటీ సమావేశం రద్దు చేయాలని టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి చైర్మన్, (ఇయు ప్రధాన కార్యదర్శి) ఈదురు వెంకన్న, కోచైర్మన్, (టిజెఎంయు ప్రధాన కార్యదర్శి) హనుమంత్ ముదిరాజ్, వైఎస్ చైర్మన్, (టిఎంయు ప్రధాన కార్యదర్శి) ఎం.థామస్‌రెడ్డి, కన్వీనర్, (ఎన్‌ఎంయు ప్రధాన కార్యదర్శి) ఎండి. మౌలానా, కోకన్వీనర్, (బికెయు ప్రధాన కార్యదర్శి) కత్తుల యాదయ్య, కోకన్వీనర్, (బిడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి) సుద్దాల సురేష్, కోకన్వీనర్, (కెపి ప్రధాన కార్యదర్శి) బి.యాదగిరి అన్నారు. ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కండక్టర్, డ్రైవర్‌లను నియమించే విధానం మానుకోవాలని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వారు డిమాండ్ చేశారు. ఈనెల 5వ తేదీన సచివాలయంలో జెఎసి నాయకులతో జరిగిన చర్చల సందర్భంగా రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీలలో యూనియన్‌ల పునరుద్ధరణ అంశం కూడా ఉందని తెలిపారు. మంత్రి ఇచ్చిన హామీ మేరకు సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేశామని, అయినా ఆర్‌టిసి యాజమాన్యం వెల్ఫేర్ బోర్డ్ సమావేశం నిర్వహణ కోసం సర్క్యులర్ జారీ చేయడం పుండు మీద కారం చల్లడమేనని విమర్శించారు. అలాగే ఈ సర్క్యులర్‌తో ప్రభుత్వం ఇచ్చిన హామీలకు అడ్డు పడే విధంగా ఉందని జెఎసి భావిస్తుందన్నారు. లేనియెడల మళ్ళీ సమ్మె బాట పడుతామని జెఎసి నేతలు హెచ్చరించారు. జూన్ 2 తేదీ వరకు ప్రభుత్వం జెఎసికి ఇచ్చిన హామీలు అమలు చేయని పక్షంలో మళ్ళీ సమ్మె వైపు వెళతామని, దీనికి పూర్తి బాధ్యత ఆర్‌టిసి యాజమాన్యం వహించాల్సి వస్తుందని జెఎసి నేతలు హెచ్చరించారు.

## మన బహుళ అంతస్తులు పదిలమేనా?

వరుస అగ్ని ప్రమాదాలతో ప్రజల్లో ఆందోళన

కొరవడిన పర్యవేక్షణ

కాసులతో ముడిపడిన నిరభ్యంతర ధృవీకరణ

**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్రంలో హైదరాబాద్ మహా నగరం తర్వాత బహుళ అంతస్తుల భవనాలు ఖమ్మం నగరంలోనే ఎక్కువ. హైదరాబాద్ సహా పలు నగరాల్లో జరుగుతున్న వరుస అగ్నిప్రమాదాలు, ఆ సందర్భంగా జరుగుతున్న మరణాలు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. మన భవనాలు పదిలమేనా అన్న భావన బహుళ అంతస్తుల భవనాల్లో నివసిస్తున్న వారిలో కలుగుతుంది. ఖమ్మం నగరంలో విద్యాలయాలు, ఆసుపత్రులు, షాపింగ్‌మాల్స్, కార్పొరేట్ కార్యాలయాలు అన్నింటికీ మించి నగరంలో 20 శాతానికి పైగా జనం బహుళ అంతస్తుల్లో నివసిస్తున్నారు. ప్రాథమిక విద్యను అందిస్తున్న పలు ప్రైవేటు విద్యాలయాలు సైతం బహుళ అంతస్తుల భవనాల్లో నిర్వహిస్తున్నారు.

నగరంలో విస్తరించిన బహుళ అంతస్తుల నిర్మాణాల్లో అగ్ని ప్రమాదాల నియంత్రకాల ఏర్పాటు ఎలా ఉంది అన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది. బహుళ అంతస్తుల నిర్మాణాలకు సంబంధించి అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు రక్షణ చర్యలు చేపట్టే వ్యవస్థను ఏర్పాటు చేశారా, అవి పనిచేస్తున్నాయా వీటిని పర్యవేక్షించాల్సిన ఫైర్‌సేఫ్టీ అధికారులు పర్యవేక్షిస్తున్నారా అంటే అన్ని ప్రభుత్వ విభాగాల మాదిరిగానే ఈ వ్యవస్థ తయారైందన్న సమాచారం. పసి పిల్లలు చదివే విద్యాలయాలు కమర్షియల్ కాంప్లెక్స్‌లపైన మూడు, నాలుగు అంతస్తుల్లో నిర్వహిస్తుంటే ఆట స్థలం సహా అన్ని ఉన్నట్లు విద్యాశాఖాధికారులు ధృవీకరిస్తున్నారు. అలాగే అగ్నిప్రమాద నిరోధక వ్యవస్థ లేకుండానే అంతా సక్రమంగా ఉన్నట్లు ఫైర్ సేఫ్టీ అధికారులు ధృవీకరిస్తున్నారు. ఖమ్మం నగరంలో ఆసుపత్రులన్నీ బహుళ అంతస్తుల భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. వీటన్నింటిలో అగ్నిప్రమాద హెచ్చరిక సామాగ్రిని అమర్చారా, అగ్ని ప్రమాదం జరిగితే రోగులు ప్రాణాలు కోల్పోకుండా కాపాడే వ్యవస్థ ఉందా అంటే ఆలోచిస్తున్నారు. బహుళ అంతస్తుల భవనాలకు సంబంధించి పైన అంతస్తులు నిర్మాణంలో ఉండగానే క్రింది అంతస్తుల్లో విద్యాలయాలు, ఆసుపత్రులు, వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటికి అనుమతులు ఎలా తీసుకున్నారు, ఎలా ఇచ్చారన్న ప్రశ్నకు సమాధానం దొరకదు. కానీ ఖమ్మంలో నిర్మించిన బహుళ అంతస్తుల నిర్మాణాలకు సంబంధించి అన్నింటికీ అగ్నిప్రమాద నిరోధకాలు ఏర్పాటు చేసినట్లు, భవనంలో ఎక్కడ ప్రమాదం జరిగినా అందరికీ తెలిసేవిధంగా అలారం సిస్టం ఏర్పాటు చేసినట్లు భవన యజమానుల వద్ద ఫైర్ స్టేఫీ అధికారులు ఇచ్చిన ధృవీకరణ పత్రాలు మాత్రమే ఉన్నాయి. ఏమి ఉన్నా లేకపోయినా కాసులతో ఫైర్ సేఫ్టీ ధృవీకరణను తెచ్చుకోవచ్చునన్న భావనను భవన నిర్మాణ సంస్థల్లోనూ, యజమానుల్లోనూ బలపడింది. ఇది ప్రాణాలతో చెలగాటమనే విషయాన్ని అధికార యంత్రాంగం మరిచిపోతుంది. ఇటీవల బుర్హాన్‌పురంలో ఒక బహుళ అంతస్తుల భవనంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం జరిగి పొగ కమ్ముకుంటే ఏమీచేయలేని స్థితి. ఆ సమయంలో భవనంలో ఎవరూ లేరు కాబట్టి సరిపోయింది.



ఒకవేళ ఉండి ఉంటే పరిస్థితి ఏమిటన్నదానికి సమాధానమే లేదు. తక్షణ అవసరం లేకపోయినా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసి అమర్చినట్లు, శారీరక వైకల్యం లేకపోయినా పరీక్షించకుండా 50 శాతం అంగవైకల్యం ఉన్నట్లు ధృవీకరించినట్లు, అంతా బాగున్నా ఆపరేషన్ అవసరం సెలవు మంజూరు చేస్తే మంచిదని వైద్యుడు ధృవీకరించి మెడికల్ సర్టిఫికెట్ ఇచ్చినట్లు ఫైర్‌సేఫ్టీ అధికారులు సైతం భవనాలు పరిశీలించకుండానే కార్యాలయాల్లో తమను తృప్తిపరిస్తే ధృవీకరణ ఇచ్చేస్తున్నారు. ఖమ్మం నగరంలో ఎన్ని బహుళ అంతస్తుల భవనాలు ఉన్నాయి, ఎన్నింట్లో ఫైర్‌సేఫ్టీ సిస్టం ఉందా అని పరిశీలిస్తే మన అధికారుల తీరు బయటపడుతుంది. ఇప్పటివరకు ప్రమాదాలు జరగలేదు కాబట్టి సరిపోయింది. జరిగితే...? మొన్న హైదరాబాద్ అగ్ని ప్రమాద ఘటన తర్వాతనైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు దీనిపై దృష్టి సారించాల్సి ఉంది.

బహుళ అంతస్తుల భవనాల్లో సిసి కెమెరాలు అనుమతి తప్పనిసరి అని పోలీస్ శాఖ హెచ్చరించి ఆయా భవన యజమానులు, నివాసితులతో సమావేశాలు ఏర్పాటు చేసినా ఆశించిన ఫలితం దక్కలేదు. ఇప్పటికైనా చేతులు కాలాక ఆకులు పట్టుకున్న సామెతలా కాకుండా బహుళ అంతస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి ఫైర్ సేఫ్టీ సిస్టం ఏర్పాటు చేసేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.




## కాలాతీత కవిత

రాజకీయ, ఆర్థిక, సామాజిక సిద్ధాంతాలపై వెరపులేని అభిప్రాయాన్ని నిక్కచ్చిగా చెప్పే కవిత్వం కలకాలం నిలిచివుంటుంది. ఛత్తీస్‌గఢ్‌లో చోటు చేసుకుంటున్న పరిణామాలు సాయుధ పోరాటం మాత్రమే ప్రజారాజ్యానికి పునాది వేస్తుందనే సిద్ధాంతంపై మరోసారి చర్చకు దారితీశాయి. తుపాకీ గొట్టం ద్వారానే స్వేచ్ఛ సాధ్యమని నమ్మిన ఎంతో మంది సాయుధ ఉద్యమాల్లోకి వెళ్లడం, వివిధ ఘటనల్లో ప్రాణాలు కోల్పోవడం దశాబ్దాలుగా జరుగుతునే ఉంది. వారు త్యాగాలు చేస్తున్న మాట వాస్తవమేగానీ, అవి అడవిలో కాసిన వెన్నల అవుతున్నదని సుమారు దశాబ్దం క్రితమే రాసిన కవితలో రచయిత 'చంద్రశేఖర్' ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితులకు సైతం అద్దం పడుతున్న ఆ కవిత కాలానికి అతీతం. సాధ్యాసాధ్యాలను ఆలోచించకుండా, పోతున్న ప్రాణాలను కాపాడే ప్రయత్నాలు చేయకుండా, ఎన్‌కౌంటర్లలో నేలకొరిగిన తర్వాత ఎన్ని మాటలు చెప్తేనేం? ఎన్ని ప్రసంగాలు చేస్తేనేం? పరోక్షంగా ఇలాంటి ఎన్నో ప్రశ్నలు సంధించిన రచయిత, ఈ కవితలో ఉపయోగించిన భాష, తొణికించిన భావం, కనబరచిన స్థైర్యం అనన్యసామాన్యం. అందుకే, ఇది కాలాతీత కవిత్వమైంది.

అడవి కాదు, హృదయం దుఃఖిస్తున్నది
మీరిప్పుడు సంతాపాలు ప్రకటిస్తున్నరు
నేనెప్పుడో ఆశలు వదులుకున్న
ఆ చైతన్యం తిరిగిరాదని దిగులుతో
మీరిప్పుడు కన్నీరు కార్చుతున్నరు
నా కళ్లెప్పుడో ఎండిపోయాయి
ఆ పాట ఇక వినిపించదని తెలిసి
మీరిప్పుడు వారి త్యాగాలను కీర్తిస్తున్నరు
నాకు ముందే తెలుస్తున్నది
అది త్యాగం కాదని, అడవిలో కాసిన వెన్నెలని
మీరిప్పుడు వారు నిరాయుధులని చెబుతున్నరు
నాకే కాదు లోకానికంతా తెలుసు
ఆయుధం కోసమే అడవికి వెళ్లారని



యుద్ధం కోసమే సన్నద్ధులవుతారని
యుద్ధంలో నీతీ గీతీ ఉండదని
ఆయుధానికి భాష ధ్యాస ఉండవని
మీరిప్పుడు వాళ్ళను కీర్తిస్తరు
వాళ్ళు దివిటీలని, పతాకాలనీ ఊరేగిస్తారు
ఒళ్ళు ఊళ్లు కదలకుండా
ఏసీ గదులు వదలకుండా
మరికొన్ని మిడుతలు ఆర్తిగా, ఆవేశంగా
ఆ వెలుగులను ముద్దాడుతాయి
ఇంకొన్నాళ్ళకి ఇదే దృశ్యం, ఇవే కన్నీళ్లు
మీదేం పోయింది
ఒక సభ, ఒక సంతాపం, వస్తే ఒక కన్నీటి చుక్క
రాస్తే ఒక వ్యాసం, చేస్తే ఒక ఉపన్యాసం
కాలు కదిలేది లేదు, ఖర్చయ్యేది లేదు
వాళ్ళది తెలియని ఆవేశం
మీది తెలిసి తెలిసీ పదే పదే ప్రదర్శించే నాటకం
తుపాకీ చేతబట్టిన ఆశయానికి విలువలేదు
ఆశయాన్ని మించిన తుపాకీ పుట్టలేదు
ఇదెప్పుడు తెలుసుకుంటారు మిత్రమా?

– చంద్రశేఖర్
(2016, సెప్టెంబర్ 17న రాసిన కవిత/ సోషల్ మీడియా నుంచి సేకరణ)

# వర్తమానంతోనే ఇస్మాయిల్ సహవాసం

ఇస్మాయిల్ పేరు తెలుగు సాహిత్యంలో నిలిచిపోవడానికి జపనీస్ సాహిత్యంలోని కవితా ప్రక్రియ 'హైకూ'ను పరిచయం చేయడం ఒక కారణమైతే, వర్తమానంతోనే సహవాసం చేయడం మరో కారణం. ఆయనకు గతం గురించి విచారం లేదు. భవిష్యత్తుపై ఆందోళన లేదు. ఉన్నదంతా 'నేడు' మాత్రమే. సమకాలీన అంశాలకు ప్రాధాన్యతనిచ్చిన ప్రముఖ తెలుగు కవి, సాహితీ విమర్శకుడు, తత్వశాస్త్ర అధ్యాపకుడు ఇస్మాయిల్‌కు 'చెట్టు కవి' అనే పేరుంది. 'చెట్టు నా ఆదర్శం', 'చిలకలు వాలిన చెట్టు', 'మృత్యుపక్షం', 'కప్పల నిశ్శబ్దం' (హైకూలు), 'ఆదర్శం', 'బాల్చీలో చంద్రోదయం', 'రాత్రివచ్చిన రహస్యపు వాన', 'కరుణ ముఖ్యం' వంటి ఎన్నో రచనలు ఆయన కీర్తిపతకాన్ని రెపరెపలాడించాయి. 'మృత్యుపక్షం' కవితా సంకలనానికి ఫ్రీవర్స్ ఫ్రంట్ పురస్కారం లభించింది. నేడు ప్రపంచం మొత్తం యుద్ధ భయంతో వణికిపోతున్న నేపథ్యంలో ఆయన మాటలను గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. 'బుద్ధిగా ప్రేమించుకోక యుద్ధాలెందుకు చేస్తారో నాకు అర్థం కాదు' అంటారు ఆయన. ప్రేమించిన చోట ద్వేషాలు ఉండవు... యుద్ధాల ప్రసక్తి లేనేలేదు. ఇస్మాయిల్ కాకినాడ పిఆర్ గవర్నమెంటు కాలేజీలో చాలా కాలం ఫిలాసఫీ లెక్చరరుగా పని చేసి, కాలేజీ ప్రిన్సిపాలుగా పదవీవిరమణ చేశారు. కొంత కాలం అధికార భాషా సంఘం సభ్యునిగా కూడా ఉన్నారు. ఆరు కవితా సంకలనాలు, రెండు వ్యాస సంకలనాలు, 'రెండో ప్రతిపాదన' అనే పేరుతో ఇతర భాషలనుండి అనువదించిన కవితల సంకలనం ప్రచురించారు. జీవిత సత్యాలను ఇస్మాయిల్ అర్థం చేసుకోవడమేకాదు.. వాటిని తన కవిత్వంలో పొందుపరిచారు. గతం ఎప్పటికీ తిరిగి రాదు.. మృత్యువు ఏదో ఒకరోజు రాక మానదు. గతాన్ని మార్చలేం. భవిష్యత్తు ఎలా ఉంటుందో అంతుబట్టదు. ఇలాంటి పరిస్థితుల్లో వర్తమానాన్ని విడిచిపెట్టి, అనవసర మానసికోద్రేకాలు ఎందుకన్నది ఆయన ప్రశ్న. అందుకే, ఆహ్లాదకరమైన, ఆరోగ్యవంతమైన కవితాన్ని అందించగలిగారు. మనుషులతో మాత్రమేకాదు.. సకల చరాచర సృష్టితోనూ ఇస్మాయిల్ మమేకమయ్యారు. సెలయేర్లతో మాట్లాడడం, చెట్లతో ఆప్యాయంగా కబుర్లు చెప్పడం ఆయనకు మాత్రమే సాధ్యమైంది. 'ఎరుపెక్కిన సంధ్య.. నలుపెక్కి వచ్చే నిరాశాంధం' ఆయన దృష్టిలో ఒకటే. ఏవీ తన మనస్సులో ఆనందాన్ని అడ్డుకోలేవని స్పష్టం చేస్తారు. పిల్లలపై ఇస్మాయిల్‌కు అవాజ్య ప్రేమ ఉందని ఆయన రాసిన అనేక కవితలు, పద్యాలు చెప్పకనే చెప్తున్నాయి. వర్షంలో పిల్లలు ఆడుకోవడాన్ని ప్రస్తావిస్తూ,

**'ఎవరి కోసం వర్షిస్తాయి మేఘాలు..**
**పిల్లల కోసం కాకపోతే**
**గొడుగులడ్డు పెట్టుకునే వాళ్ళ కోసమా?'** అనడంలో ఆయనే చిన్న పిల్లవాడిగా మారిన విధానం మన కళ్ల ముందు సాక్షాత్కారమవుతుంది.

**'పిట్టల్ని తోలమని**
**పాపని కాపలా పెడితే**
**కాకుల్తో స్నేహం చేస్తోంది'** అంటారు మరో హైకూలో. ఎల్లలు లేని ప్రేలకు సజీవ రూపాలైన పిల్లలు అంతే,,, పక్షులతో స్నేహం చేస్తారు. ఆడుకునే సమయంలో మట్టి మనుషులవుతారు. పిల్లలను ప్రేమించినా... ప్రకృతిని ఆరాధించినా... 'సెంటిమెంట్' ఆయన సాహిత్యంలో ఎక్కడా కనిపించదు. న్యాయానికి తెలుగు మాత్రమేకాదు... ప్రపంచ సాహిత్యం మొత్తంలో ఎక్కడ వెతికినా ఏదో ఒక రకమైన సెంటిమెంటుతో జతకలిసిన రచనలే కనిపిస్తాయి. కానీ, ఇస్మాయిల్‌కు సెంటిమెంట్‌ను పండించడం కంటే, వాస్తవాలను ప్రస్తావించడం అంటేనే ఇష్టం. భవిష్యత్తు గురించి ఆందోళన చెందడంగానీ, మృత్యువు గురించా ఆలోచించడంగానీ నచ్చకపోయినప్పటికీ, 'మృత్యువృక్షం'లో ఆయన స్థూలంగా ఈ అంశాన్ని ప్రస్తావిస్తారు. చివరికి మిగిలేది ఏమీ ఉండదని పేర్కొంటూ, వర్తమానానికి ఉన్న ప్రాధాన్యతను చాటిచెప్పారు. ఇస్మాయిల్ కవిత్వంలో మరో ప్రధాన లక్షణం 'పోలిక' లేకపోవడం. ఆయన ఏదైనా అంశాన్నిగానీ, వివరణనుగానీ మరే ఇతర అంశాలతో పోల్చరు. అలాంటి పోలిక లేకపోవడంతో, ఇస్మాయిల్ కవితల్లోని ప్రతి భావం స్వతంత్రమైనదే. పోలిక వెన్నంటే విమర్శలు ఉంటాయి. పోలికే లేనప్పుడు విమర్శలకు తావెక్కడ? ఎవరికీ చిక్కని రీతిలో చక్కని, చిక్కని భావంతో కవిత్వం రాసిన ఇస్మాయిల్‌ను కొంత మంది అనుభూతి కవిగా పేర్కొన్నారు. ఇక్కడ ఒక విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావించుకోవాలి. ఆయన రాసిన అనుభూతి కవితలు ఏదైనా ఒక ప్రత్యేక సందర్భానికి లేదా ఒక చిన్న ఘటనకు సంబంధించినవి మాత్రమే. విస్తారమైన అంశాలను ఆయన వస్తువుగా చేసుకోలేదు. 'దాహం' లేదా 'టీ తేవడం' లేదా 'నిద్ర నుంచి ఉలిక్కిపడి లేవడం' వంటి సాధారణ ఘటనలను కూడా ఆయన తన కవిత్వంలో చేర్చుకున్నారు.

**'కుక్కపిల్లా.. అగ్నిపుల్లా.. సబ్బుబిళ్లా**
**హీనంగా చూడకు దేన్నీ**
**కవితామయమేనోయ్ అన్నీ'** అన్న మహాకవి శ్రీశ్రీ భావాన్ని ఆచరణలో చూపారు ఇస్మాయిల్. ఒక ఆలోచనను మాత్రమే ప్రతిబింబించేందుకు చేసిన ప్రయత్నాలు, ఒక్కో సమయంలో కవి నిర్దేశించుకున్న పరిధులు దాటి పరుగులు తీస్తాయి. 'స్వేచ్ఛాగానం' ఇందుకు ఓ చక్కని ఉదాహరణ. నిజానికి ఒకదానితో మరొక అంశం ముడిపడి ఉంటుందనేది ఆయన ఎంచుకున్న అంశం. 'స్వేచ్ఛాగానం' అని పేరు ఉన్నప్పటికీ, బంధనాలను వివరిస్తూ వెళతారు కవి.

**'దివిలో ఊగే విహంగాన్ని**
**భువిలో పాకే పురుగు బంధిస్తుంది**
**గడియేని ఆగని సూర్యుణ్ణి**
**గడియారపు బాహువులు బంధిస్తాయి'** అంటూ ఈ స్వేచ్ఛాగానం మొదలవుతుంది. పీతడెక్కల చంద్రుణ్ణి చేతులెత్తే సముద్రం బంధిస్తుందన్న ఊహ గొప్పగా ఉంటుంది. గలగలలాడే తరంగాల్ని జలకాలాడే అంగాలు బంధిస్తాయని అంటారు ఇస్మాయిల్. బండి చక్రం ఎప్పుడూ తన చుట్టూ తాను తిరుగుతుంది. అయితే, మలుపులు తిరిగే రోడ్డు ఆ చక్రాన్ని బంధిస్తుందని పేర్కొంటారు కవి. అంతేకాదు... తెగవాగే జలపాతపు నాలికలను, సెగలెగిసే గ్రీష్మం అదే విధంగా, మడలు పడ్డ ముసలి సాయంత్రాన్ని మాటలురాని కాలవ బంధిస్తాయట. రాత్రి వచ్చిన రహస్యపు వాన తనను ఎవరూ చూడలేదనుకుంటుంది... కానీ, నేలలోని వ్రేళ్లు వర్షాన్ని బంధిస్తాయంటారు ఇస్మాయిల్. చివరిలో..

**'గురి మరచిన గాలి బాణాన్ని**
**తెరలెత్తిన నౌకా ధనస్సు బంధిస్తుంది**
**ఈ మనిషి ఆ మనిషిని బంధిస్తాడు**
**ఇద్దర్నీ బంధిస్తుంది మనీష'** అంటూ బంధనాలను బహు చక్కగా ముగించారు. ఆయన కవితల్లో ఇలాంటి చమక్కులు ఎన్నో. చిన్నచిన్న వాక్యాల్లో అంతులేని అర్థాలను వివరించే శక్తి ఇస్మాయిల్ వంటి సమర్థులకు మాత్రమే ఉంటుంది.


నేడు 97వ జయంతి

ఇస్మాయిల్ (మే 26, 1928 - నవంబర్ 25, 2003) కవి, అధ్యాపకుడు. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా కావలి పట్టణంలో, 1928, మే 26న జన్మించిన ఇస్మాయిల్ ప్రజాదరణ పొందిన కవి. అధ్యాపకుడు. కాకినాడ, వాల్తేరు లలో విద్యాభ్యాసం చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి బిఎ (ఆనర్స్) పట్టా పుచ్చుకున్నారు. కాకినాడ పిఆర్ కళాశాలలో ఫిలాసఫీ లెక్చరర్‌గా పనిచేసి ఆ తరువాత విజయవాడ ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా పనిచేసి, 1988లో ఉద్యోగ విరమణ చేశారు. అధికార భాషాసంఘంలో సభ్యునిగా కొంతకాలం పనిచేశారు. లండన్‌లోని ఆంధ్ర కల్చరల్ సొసైటీ ఆహ్వానం మేరకు 1978లో ఇంగ్లాండు తదితర ఐరోపా దేశాలలో పర్యటించి సాహిత్య కార్యక్రమాలలో పాల్గొన్నారు.

**'వికట ప్రతిబింబాల**
**అద్దాల చెరసాల**
**బందీని నేనే**
**బందిఖానాని నేనే'** అనడంలో మనిషి తన పరిమిత ఆలోచనలు... చేష్టలతో ఎంతగా కుదించుకుపోయాడో వివరిస్తారు.





**'బైట ఉండాల్సినవేమిటో**
**లోన ఉండాల్సినవేమిటో**
**అన్నీ నాకు తెలుసు.**
**ఐతే,ఈ కిటికీకి ఇక్కడేం పని?'** అని గోడతో ప్రశ్నింప చేసిన వైనం అద్భుతం. మనకు అవసరమైనవి మనమే ఎంచుకుంటాం... మనుషులు కావచ్చు... వస్తువులు కావచ్చు... పరిసరాలు కావచ్చు.. ఏవైనా, ఏదైనా అంతే. కానీ, ఎంచుకున్న దాని తో తృప్తిపడని జీవితాలు మనవి. మనం విడిచిపెట్టిన జీవితాల్లోకి తొంగిచూసే వైనం మనది. అందుకే, గోడ పెట్టి విడదీసినప్పటికీ, కిటికీ పెట్టి బయట కు తొంగిచూసే దైన్యం మనది. గొప్ప తాత్వికతను ఇంత సరళంగా చెప్పడం ఇస్మాయిల్‌కే సాధ్యం. స్థూలంగా పరిశీలిస్తే ఇస్మాయిల్ కవిత్వంలో గాఢత ఉంటుంది. సరళత కూడా ఉంటుంది. అన్నిటినీ మించి స్పష్టత ఉంటుంది. ఎవరికీ అర్థంగాని భాషను ప్రయోగిస్తూ, అంతుచిక్కని భావాన్ని ప్రదర్శిస్తూ చాలా మంది కవులు తమను తాము మేధావులుగా ముద్ర వేసుకుంటున్న తరుణంలో ఇస్మాయిల్ కవిత్వం పాఠకులకు ఆటవిడుపు. సంక్లిష్ట పదప్రయోగాల గ్రీష్మతాపంలో వాడిపోయి... ఎండిపోయి.. మోడువారుతున్న కవిత్వంపై ఆసక్తికి లభించిన ఊరట. ఇస్మాయిల్ కవితాతత్వం అందరికీ అర్థమవుతుంది. లో తైన విషయాలను కూడా సరళమైన భాషలో చెప్పి మెప్పించారు ఆయన. 'కవిత్వంలో నిశ్శబ్దం', 'కరుణ ముఖ్యం' వంటి వ్యాస సంకలనాలు ఆయన ఆలోచనలను మనకు పరిచయం చేస్తాయి. మనసును విశ్లేషించి మన ముందు ఉంచుతాయి. ఇస్మాయిల్ ఒక జనరంజన తాత్వికుడు. నవయుగపు సాహితీ పాంథకుడు.

– సత్యశ్రీ

## చదవాల్సిన పుస్తకం

# ప్రేమ్‌చంద్ సాహిత్య వ్యాసాలు

సాహిత్యం అంటే ఏమిటి? భూమి గుండ్రంగా ఉన్నదని కొత్తగా చెప్పనట్టు, ఈ ప్రశ్న ఇప్పుడు ఉదయించడం కొందరికి హాస్యాస్పదంగా ఉండవచ్చు. కానీ, సాహిత్యం పేరుతో పుంఖానుపుంఖంగా వచ్చినపడుతున్న 'చెత్త'ను చూసినప్పుడు, కొత్తగా ఈ ప్రశ్న ఉదయించక మానదు. తాము రాసిందంతా సాహిత్యమేనన్న అపోహ చాలా మందిలో ఉంది. కొంత మంది మరో అడుగు ముందుకేసి, తాము రాసింది మాత్రమే సాహిత్యమని అడ్డంగా వాదిస్తున్నారు. అదే భ్రమలో బతుకుతున్నారు. ఈ పరిస్థితుల్లో, ఇటు సాహితీప్రియులకు, అటు ఔత్సాహిక రచయితలకు 'ప్రేమ్‌చంద్ సాహత్య వ్యాసాలు' పుస్తకం మార్గదర్శకం చేస్తుంది. ప్రేమ్‌చంద్‌గా అందరికీ సుపరిచితుడైన ధనపత్ రాయ్ శ్రీవాస్తవ్ గురించి ప్రత్యేకంగా పరిచయ వాక్యాలు అనవసరం. సాహిత్యంపై ఆయన వైఖరి ఈ వ్యాసాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. నిజానికి సాహిత్యం అనేది కేవలం సౌందర్యాన్ని వర్ణించేది కాదు. అది సమాజాన్ని ప్రతిబింబించే అద్దం. ఈ అభిప్రాయాన్ని వాస్తవంగా చాటి చెప్పినవారిలో అగ్రగామిగా నిలిచినవారు మున్షీ ప్రేమ్‌చంద్. ఆయన సాహిత్యం అంతర్భావాన్ని విశ్లేషించేటప్పుడు కథలు, నవలలే కాక, వ్యాసాలకు ప్రత్యేక స్థానం ఇవ్వాలి. ప్రేమ్‌చంద్ రాసిన వ్యాసాలు భారతీయ సమాజంలోని అనేక మూల విషయాలను ప్రస్తావిస్తూ ప్రజల సమస్యలను నిగూఢంగా వెలుగులోకి తీసుకొచ్చాయి. ప్రేమ్‌చంద్ కలం సామాజిక న్యాయం, మానవీయ విలువలు, సామ్యవాద దృక్పథంతో నిండి ఉంటుంది. హిందీ, ఉర్దూ భాషలలో ఆయన రచనలు సమానమైన బలాన్ని కలిగి ఉన్నాయి. గోదాన్, నమక్ కా దార్‌ఒగా, కర్బానీ కా ఫల్స్‌ఫా వంటి రచనలు ఆయన్ని సాహిత్య రంగంలో శాశ్వతంగా నిలిపాయి. అలాంటి గొప్ప రచయిత సాహిత్యంపై వెలుబుచ్చిన అభిప్రాయాలు శిరోధార్యాలు. ఈ పుస్తకంలోని 14 వ్యాసాలలోని స్పష్టత, సరళత, ప్రజల భాష, ప్రామాణికత పాఠకులను ఆకట్టుకుంటాయి. సాహిత్య ఉద్దేశ ప్రయోజనాలను గురించి ప్రేమ్‌చంద్ విపులంగాను, హేతుబద్ధంగాను, అభ్యుద దృష్టితోనూ చర్చించారని ప్రకాశకులు పేర్కోవడం సముచితం. ఇది సాహితీపరులకు, సాహితీ విమర్శకులకు మార్గదర్శకంగా ఉపయోగపడుతుందన్న మాట కూడా వాస్తవమే. ప్రేమ్‌చంద్ సాహిత్యాన్ని సామాజిక ప్రయోజనాలకు ఉపయోగపడే సాధనంగా పరిగణించారు. ఆయన అభిప్రాయం ప్రకారం, ఒక రచయిత సమాజంలో అన్యాయాన్ని, అసమానతను, శోషణను ప్రశ్నించాలి. ఈ వ్యాసాల్లో ఆయన సామాజిక అవాంఛనీయతపై తీవ్రమైన విమర్శలు చేశారు. సాహిత్యంపై విస్పష్టమైన అభిప్రాయాలను వెల్లడించారు. 'రాయబడిందంతా సాహిత్యమంటే నేనెప్పుడూ అంగీకరించను. సత్యాన్ని వ్యక్తీకరించుతూ, భాష ప్రౌఢంగాను, సందరంగాను ఉండి, మస్సు మీద, మేధస్సు మీద కూడా ప్రభావం చూపేది మాత్రమే సాహిత్యమనాలి' అని తేల్చిచెప్పారు. 'విమర్శించడం, గౌరవించడం అనేది ప్రతి రచనకూ ఉంటుంది. అప్పటి చాలా మంది రచయితలకు రచనలే జీవనాధారం. వాళ్లు రచించిన కావ్యాలను రాజులు, జమీందారులు తప్ప మరెవరూ ఆదరించేవారు కారు. కవులు సాధారణ జీవన సమస్యలను ఎదుర్కోవడానికిగానీ, అందులో ఉన్న నగ్న సత్యాల ప్రభావాన్ని గుర్తించటంగానీ చేయకుండా, మానసికంగా దిగజారిపోయారు. అందువలన వారి రచనల్లో మానసిక, బౌద్ధిక జీవనం చాలా వరకూ లోపించింది' అంటూ గొప్ప ప్రబంధాలపై విమర్శలు గుప్పించారు. సాహిత్యానికి ఉండాల్సిన లక్షణాలను వివరించారు. ప్రతి అంశాన్నీ లోతుగా విశ్లేషించారు. 'సాహిత్యానికి ఒకే విలువ ఉంది. ఒక వేళ అది మానవ జాతికి ఉపయోగపడే అవకాశం ఉంటేనే నిజమైన సాహిత్యం అనుకోవాలి. అలా కాకుండా, జీవితానికి ఏమీ ఉపయోగపడకుండా, జీవితమంటే అర్థం చెప్పకుండా ఉన్నట్టయితే, అది సరళ భాషలో ఉన్నప్పటికీ, ఆనందం కలుగచేసినప్పటికీ, సాహిత్యం కాదు' అని ప్రేమ్‌చంద్ అభిప్రాయం. మన దేశంలో సాహిత్య సమైక్యతా భావం అనాదిగా ఉన్నప్పటికీ, భాషా సహకారం లేదని తేల్చిచెప్పారు. నవలా రచనలను విశ్లేషించారు. సాహిత్యంలో ఆస్తిక, నాస్తిక వాదాలను ప్రస్తావించారు. సినిమాల ప్రభావాన్ని సైతం ఆయన ఒక వ్యాసంలో వివరించారు. ఒక్క మాటలో చెప్పాలంటే, ఈ పుస్తకం సాహిత్యంపై ప్రేమ్‌చంద్ అభిప్రాయాలనేకాదు.. వాస్తవ పరిస్థితులను, రచనల విధివిధాలను కూడా ఆవిష్కరిస్తుంది. అందుకే ఇది తప్పక చదాల్సిన పుస్తకమైంది.




### పుస్తకం పేరు

ప్రేమ్‌చంద్ సాహిత్య వ్యాసాలు
వెల: రూ. 70
ప్రతులకు
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్)
జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068.
(నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).




# ఆచరణతో చరిత్ర సృష్టించిన 'కందుకూరి'

తెలుగు పునరుజ్జీవనోద్యమ పితామహుడు, అభినవాంధ్రకు ఆద్యబ్రహ్మ కందుకూరి వీరేశలింగం పంతులు ఒకవైపు సమాజానికి, మరోవైపు సాహిత్యానికి విశేష సేవలు అందించారు. ఆరుద్ర అన్నట్లు, 'తాము శారీరకంగా దుర్బలులైనా జాతిని బలిష్ఠం చేసి దేశాభివృద్ధిని, భాషాభివృద్ధిని సాధించిన మనోబల భీములలో పంతులు ప్రథములు. అటువంటి ఉజ్వల చారిత్రకుని ఏ బిరుదుతో వర్ణించినా అది అసమగ్రమే. అయినా నవ్యాంధ్ర నిర్మాతలనే నిర్మించినవారిగా నేను పంతులుగారిని భావిస్తున్నాను. అభినవాంధ్రకు ఆయన ఆద్యబ్రహ్మ.' ఈ మాటలు వినగానే ఆయన గొప్పదనం నూరు మాటలు చెప్పినా తీరనిది అనిపిస్తుంది. కందుకూరి వీరేశలింగం 1848 ఏప్రిల్ 16న రాజమండ్రిలో పున్నమ్మ, సుబ్బారాయుడు దంపతులకు జన్మించారు. ఆయన తాతలు వలస వచ్చిన కందుకూరు అనే ఊరినే తమ ఇంటి పేరుగా చేసుకున్నారు. ఐదేళ్ల వయసులోనే బడిలో అడుగు పెట్టి, బాల రామాయణం, సుమతీ శతకం, కృష్ణ శతకం వంటివి ముందు వెనుక లేకుండా నేర్చుకున్నారు. పన్నెండేళ్ల వయసులో రాజమండ్రిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంలో చేరి, ఆంగ్ల సాహిత్యంతో పాటు కేశవ్ చంద్ర సేన్ రచనలను అవపోసన పట్టారు. ఈ రచనలు ఆయనను విపరీతంగా ప్రభావితం చేశాయి. అప్పట్లో విగ్రహారాధన, పూజలపై ఆయన నమ్మకం తగ్గడమే కాక, దయ్యాలు, భూతాలు లేవని నిరూపించడానికి అర్ధరాత్రి శ్మశానానికి కూడా వెళ్ళే గుండె నిబ్బరం ఉన్న వ్యక్తి ఆయన. సంఘసేవలో వీరేశలింగం గారు ఎంత కృషి చేశారో, సాహిత్యంలోనూ అంతే కృషి చేశారు. 130కి పైగా గ్రంథాలు రచించారు. అన్ని గ్రంథాలు వ్రాసినవారు తెలుగులో కలగన్నా కనపడరు. సాంఘిక దురాచారాలను, మూఢ నమ్మకాలను విమర్శిస్తూ చక్కని తెలుగు సామెతలను, లోకోక్తులను ప్రయోగించి తొలి తెలుగు సాంఘిక నవలైన రాజశేఖర చరిత్రను రాశారు. సమాజపు వికృత సంఘటనలను అవహేళన చేస్తూ సత్యరాజా పూర్వదేశ యాత్రలు ఆయన రచనలలో ప్రముఖమైనవి. స్వీయ చరిత్ర, ఆంధ్ర కవుల చరిత్ర కూడా ప్రచురించారు. చిన్నయసూరి వదిలివేసిన నీతిచంద్రిక (తెలుగు పంచతంత్రం) లోని సంధి, విగ్రహం భాగాలను వీరేశలింగం పూర్తి చేశారు. వ్యవహార ధర్మబోధిని, చమత్కార రత్నావళి, అభిజ్ఞాన శాకుంతలం, రత్నావళి వంటి పన్నెండు నాటకాలు రాశారు. స్త్రీ విద్య ప్రాముఖ్యతను నొక్కి చెప్పే సత్యవతి చరిత్ర, మతపరమైన ఆచారాల గురించి చంద్రమతి చరిత్ర ఆయన ఇతర నవలలు. వేశ్యాభిమానం, చాదస్తపుటాచారాలు, శాఖాభేదాలు, అజ్ఞానం, వేశ్యా విషయ సంవాదము, చంద్ర గ్రహణం మొదలైన యాభైకి పైగా ప్రహసనములు వ్రా శారు. నీతి కథా మంజరి అనే 158 చిన్న కథల సంకలనాన్ని కూడా వెలువరించారు. సమాజంలోని దురాచారాలపై తన భావాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి 1874 అక్టోబరులో వివేకవర్ధని అనే పత్రికను ప్రారంభించారు. 'సంఘంలోని అవకతవకలను ఎత్తి చూపడం, దురాచారాల నిర్మూలన, ప్రభుత్వ వ్యవస్థలో ప్రబలంగా ఉన్న అవినీతిని ఎత్తిచూపి, అవినీతిపరులను సంఘం ముందు పెట్టడం' వివేకవర్ధని లక్ష్యాలని ఆయన మొదటి సంచికలో స్పష్టంగా తెలియజేశారు. చెప్పడమే కాదు, అలాగే నడిపారు కూడా. వివేకవర్ధని పత్రిక అవినీతిపరుల పాలిట సింహస్వప్నంలా మారింది. ఆంధ్రదేశంలో బ్రహ్మ సమాజాన్ని స్థాపించిన వీరేశలింగం గారు ఒక గొప్ప హేతువాది. సంఘసంస్కరణకు నడుం బిగించారు. కార్యదీక్ష, సాహసం, విజ్ఞాన తృష్ణ ఆయనకు పుట్టుకతో వచ్చిన లక్షణాలు. రాజారామమోహన రాయ్, దేవేంద్రనాథ్ ఠాగూర్, కేశవ చంద్ర సేన్, ఈశ్వర చంద్ర విద్యాసాగర్‌ల బోధనలు, రచనలచే ప్రభావితులై 1887లో సంఘసంస్కరణ సమాజాన్ని స్థాపించి, మతమనే ముసుగులో అధోగతిలో ఉన్న హైందవ సమాజంలోని దురాచారాలపై విప్లవం ప్రారంభించారు. మూఢ విశ్వాసాలు, సనాతనాచారాలపై ఆయన నిరంతరం పోరాటం సాగించారు.

– డి. జైరాం

ఒక వ్యక్తిగా, సంఘసంస్కర్తగా, రచయితగా వీరేశలింగం గారికి అనేక విశిష్టతలు ఉన్నాయి. అనేక విషయాలలో ఆంధ్రులకు ఆయన ఆద్యుడు, ఆరాధ్యుడు. ఆధునికాంధ్ర సమాజ పితామహుడిగా కీర్తి గడించిన వ్యక్తి కందుకూరి. మొట్టమొదటి వితంతు వివాహం జరిపించిన వ్యక్తి. తొలి సహవిద్యా పాఠశాల స్థాపకుడు. తెలుగులో మొదటి స్వీయ చరిత్ర, తొలి నవల, తొలి ప్రహసనం రాసింది ఈయనే. యుగకర్తగా ప్రసిద్ధి పొందిన ఆయనకు గద్య తిక్కన అనే బిరుదు కూడా ఉంది. తన జీవితపు చివరి దశలో, రాజమండ్రిలో స్థాపించిన విడోస్ హోమ్‌తో పాటు చాలా సామాజిక కార్యకలాపాలను పర్యవేక్షించే హితకారిణి సమాజం కోసం తన ఆస్తి మొత్తాన్ని ధారాదత్తం చేశారు. 1919 మే 27న ఆయన మరణించారు.


మే 27 వర్ధంతి

## ఈ వారం కవితలు

### నిద్రనివ్వని రాత్రి

ఓ సంధ్యవేళ..
సరస్సులో సడిచేయని కెరటాలకు,
నీలాభ్రంలో ఉదయించి
తళుకులీనుతూ
కాంతిని వెదజల్లబోయే చుక్కలకు
మనసును పారేసుకున్న నేను,
ఆ రేయి కలతనిద్రలో
జంబూఫలరంగువంటి చీకటిమాటున
ఆలోచనలతో కలగంటున్నవేళ,
ఉన్నట్టుండి నిద్రలేచా,
విడివడని నిద్రరెప్పల్ని
వేళ్ళతో రుద్దుకొంటూ,
దర్వాజావైపు నడిచా.

బయటకు చూస్తే
గుహలనుండి వెలువడిన
గజరాజులను పోలిన చీకటి,
వీరభద్రుని జడలవంటి చీకటి.

అంతవరకు అటునిటు అశాంతిగా
తిరుగుతూఉండిన పాదపాలు
నన్నుచూసి అనుకుంటా
మునుల్లా మౌనంధరించాయి.
నన్నునేను ఆవిష్కరించుకొంటానని
బహుశా వాటికీ తెలుసేమో.

ఎందుకంటే ప్రతిసారీ,
నాకు దారి చూపించే సూచిక నేనే.అందుకై
నాకై ఒక దారి వేసుకోవాల్సింది నేనే.
అందుకోసం నన్నునేను నుగ్గునుగ్గు చేసుకుని,
నా ఎముకల తెల్లనిపొడితో
చీకటిపలకమీద చుక్కలముగ్గు వేసి,
వాటి మధ్యలో వెన్నెల దుప్పటి పరుచుకుని
పడుకుందామనుకుని, కిటికీలోంచి
ఎంతచేయిచాచినా ఆకాశం అందట్లేదు,
నిద్రనివ్వని ఈ చీకటీ వదలట్లేదు.

– వేమూరి శ్రీనివాస్, 9912128967

### కాడెడ్ల బండి బతుకు

ఎడ్ల బండి బతుకు
రెండడుగులు ఒక్కటై
సాగుతేనే ముందుకు !
బండికి ఎన్నెన్ని అతుకులు
బతుకుకు ఎన్నెన్ని వెతుకులు

అతుకులు అంటిపెట్టుకొని
ఉండే కుటుంబం
వెతుకులంటే ఆశల
ఆరాటాల కదంబం

అవసరాల అన్వేషణలో
బ్రతుకు యాగమై సాగుతుంది!
బండిని లాగుతున్నట్లు
కనిపించేవి కావవి ఎద్దులు!

కనిపించని పెద్ద తనపు
బాధ్యత బరువుమోసే నిబద్దులు!

చెరిసగమై సాగే జగతి బండికి
ఆశలు మోసే కాడి చందం!

ఎద్దుకు బండికి బాధ్యతల బంధం!
బ్రతుకు పథం అయినా
జగతి రథం అయినా
బంధాలను అనుబంధాలతో

అల్లుకొని బండిని సమతౌల్యం తో
లాఘవంగ లాగవలసిందే!
పగలు రాత్రి కలిసి
కాల చక్రాన్ని లాగుతున్నట్లు

స్త్రీ పురుషులు ఒక్కటిగా
బ్రతుకు బంధమై కొనసాగి
గమ్యం చేరవలసిందే !

– పట్లోళ్ళ బక్కారెడ్డి , 9705315250

### రియల్ హీరోస్..!!

మాకు నటించడం చేతకాదు
బార్డర్ లో తుపాకీతో సావాసం చేస్తాం
ఎదురొడ్డి పోరాటానికి ఆజ్యం పోస్తాం
ప్రాణాలను పనంగా పెట్టి
రణరంగంలో అడుగు పెడతాం
మాది చిత్రీకరణ విచిత్రం కాదు
గ్రాఫిక్స్ ఫైట్స్ తో చూపే వీరోచితం కాదు
ఫిరంగులతో మమేకమౌతూ
యుద్ధ విమానాలతో ఆకాశాన్ని చుట్టి
విలనిజాన్ని ఎదుర్కొంటాం

మాకు ప్రేమ దోమలుండవు
కన్నవారి ఆశిస్సులు
భారతదేశ నాయకత్వ అండదండలు
ఆలు బిడ్డల దీవెనలే మా బలగం
మా కథలాంటి నిజ జీవితంలో
విజయం లేదా ముగింపు
మలుపులు తిప్పుకునే హిరోయిజం కాదు

చివరి పోరాటం వరకు
ఎదురొడ్డి నిలబడే దమ్ము ధైర్యమే అండ
మాకు ఈవెంట్ లు కంటెంట్ లు వుండవు
గురి తప్పకుండా శిక్షణలు
యుద్ధ రంగంలో నైపుణ్యతలే శరణ్యాలు
మాకు పెద్ద పెద్ద కటౌట్లు వుండవు సుమీ
బ్రతికి జయిస్తే వీరోచితం
వీర మరణం పొందితే భరతజాతి వీడ్కోలు
లాభాపేక్ష లేని హీరోయిజం మాది

మాకు దేశమంతా అభిమానులే
రియాలిటీ మాకున్న ఒకే ఒక నైజం
అడగు అడుగులో ఉత్కంఠ
ఇదే మా కథకు వాస్తవికతకు సంకేతం
దేశ స్వేచ్ఛకు ప్రతీకలం
భారతావనికి అనునిత్యం రక్షకులం
భారత పౌరుల జీవనానికి కవచాలం
మేమే అసలైన రియల్ హీరోస్
జై జవాన్ జై భారత్
నరెద్దుల రాజారెడ్డి, సెల్ : 9666016636



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఐదు అసెంబ్లీ స్థానాల్లో ఉప ఎన్నికలు



**న్యూఢిల్లీ :** నాలుగు రాష్ట్రాల్లో ఐదు అసెంబ్లీ స్థానాల్లో ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల కమిషన్ ఆదివారం షెడ్యూల్ విడుదల చేసింది. గుజరాత్‌లోని రెండు అసెంబ్లీ స్థానాలకు, కేరళ, బెంగాల్, పంజాబ్‌లోని ఒక నియోజవర్గానికి జూన్ 19వ తేదీన ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం పేర్కొంది. గుజరాత్‌లో కాది నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే కర్సాన్‌భాయి పుంజాభాయి సోలంకి మృతి చెందడంతో అక్కడ ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. మరో స్థానం విసవదర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే భయాని భూపేంద్రభాయి గండుభాయి తన పదవికి రాజీనామా చేశారు. కేరళలోని నిలాంబర్ స్థానంలో పివి అన్వర్ రాజీనామా చేశారు. పంజాబ్ లూధియానా సీటులో సిట్టింగ్ సభ్యుడు గుర్‌ప్రీత్ బస్సి గోగి మృతి చెందారు. ఇక బెంగాల్‌లోని కాళీగంజ్ అసెంబ్లీ స్థానంలో సిట్టింగ్ ఎమ్మెల్యే నసిరుద్దీన్ అహ్మద్ మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఈ స్థానాల్లో ఉప ఎన్నికల అనివార్యమయ్యాయి.

### ఉగ్రవాదానికి వ్యతిరేకంగా..
# దేశమంతా ఏకమైంది

'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ :** ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశమంతా ఏకమైందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో సైన్యం చూపించిన ధైర్య సాహసాలకు ప్రతి భారతీయుడు గర్వపడుతున్నట్లు చెప్పారు. 122వ మన్ కీ బాత్ రేడియో కార్యక్రమంలో భాగంగా దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని మాట్లాడారు. నక్సలిజానికి వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతోందని ప్రధాని మన్ కీ బాత్‌లో తెలిపారు. మావోయిస్టుల హింసాత్మక చర్యలు క్రమంగా తగ్గుతున్నాయని, దంతెవాడ ఆపరేషన్‌లో జవాన్లు ఎంతో సాహసం చూపారని మోదీ కొనియాడారు. ఆపరేషన్ సిందూర్‌తో దేశ ప్రజలందరూ భావోద్వేగానికి గురయ్యారని తెలిపారు. 'ఉగ్రవాదానికి వ్యతిరకేంగా చేసే పోరాటంలో ఆపరేషన్ సిందూర్ కొత్త ఉత్సహాన్ని నింపింది. మన సైన్యం ప్రదర్శించిన ధైర్యసాహసాలు ప్రతి భారతీయుడిని తల ఎత్తుకునేలా చేసింది. కచ్చితత్వంతో పిఒజెకెలోని ఉగ్రవాద క్యాంపులపై సైన్యం జరిపిన దాడులు అద్భుతం. మొత్తం దేశం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఏకమైంది. ఉగ్రవాదాన్ని అంతం చేయాలనేది ప్రతి భారతీయుడి సంకల్పం. మన రోజువారీ జీవితంలో సాధ్యమైనంత వరకు దేశంలోనే తయారైన వస్తువులను వాడాలి. ఇది కేవలం ఆర్థిక ఆత్మ నిర్భరత కోసం మాత్రమే కాదు. జాతి నిర్మాణంలో ఒక భావన లాంటింది' అని మోదీ అన్నారు. 'ఆపరేషన్ సిందూర్ కేవలం సైనిక చర్య మాత్రమే కాదు. మన సంకల్పం, ధైర్యం, దేశభక్తితో నిండిన నవభారతానికి నిదర్శనం. అనేక కుటుంబాలు దీనిని తమ జీవితాల్లో భాగంగా చేసుకున్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పుట్టిన పిల్లలకు సిందూర్ అని పేరు పెట్టారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత అనేక నగరాలు, గ్రామా లు, పట్టణాల్లో తిరంగ యాత్రలు నిర్వహించారు. సివిల్ డిఫెన్స్ వాలంటీర్లుగా అనేక నగరాల నుంచి యువత ముందుకు వచ్చారు. కవితలు రాయడం, సంకల్ప గీతాలు పాడటం, పిల్లలు గొప్ప సందేశాలతో చిత్రాలను వేశారు' ప్రధాని మోదీ చెప్పారు. మరోవైపు మావోయిస్టుల హింసాత్మక చర్యలు క్రమంగా తగ్గుతున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దంతెవాడ ఆపరేషన్‌లో జవాన్లు చూపిన సాహసాన్ని ఆయన కొనియాడారు. నక్సలిజానికి వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతోందని చెప్పారు. నక్సలిజం నిర్మూలనలో గర్వించే విజయం సాధించామన్నారు.

**సంగారెడ్డి మహిళలు స్కైవారియర్స్**

తెలంగాణలోని సంగారెడ్డి మహిళల గురించి ప్రధాని మోదీ మన్ కీ బాత్‌లో ప్రస్తావించారు. వారు వ్యవసాయంలో డ్రోన్లను వినియోగించడాన్ని ఆయన ప్రశంసించారు. గ్రామీణ మహిళలు డ్రోన్ ఆపరేటర్లుగా శిక్షణ పొంది.. పండ్ల తోటలపై పురుగుల మందులు ఇతర అవసరాల కోసం డ్రోన్లను వినియోగిస్తున్నారన్నారు. డ్రోన్ దీదీలను స్కై వారియర్స్ అని మోదీ అభివర్ణించారు.

**పెరిగిన సింహాల సంఖ్య..**

దేశంలో సింహాల సంఖ్య ఆశించిన స్థాయిలో పెరుగుతోందని మోదీ తెలిపారు. గత ఐదేళ్లలో గుజరాత్‌లోని గిర్‌లో 674 నుంచి 891కి చేరిందన్నారు. ఫారెస్ట్ ఆఫీసర్లుగా ఎక్కువ మంది మహిళలను నియమించిన తొలిరాష్ట్రంగా గుజరాత్ నిలిచిందన్నారు.

# ఢిల్లీని ముంచెత్తుతున్న భారీ వర్షాలు

నీట మునిగిన కార్లు, బస్సులు

180 విమానాలపై ప్రభావం, 49 విమానాలు దారిమళ్లింపు



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీని భారీ వర్షాలు ముంచెత్తాయి. శనివారం రాత్రి నుంచి ఈదురుగాలులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. వర్షానికి పలు చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన కూడళ్లు జల దిగ్బంధంలో చిక్కుకుపోయాయి. అనేక ప్రాంతాల్లో రహదారులు నీటమునగడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ధౌలా కువాన్, సుబ్రోతో పార్క్, నానక్ పురాలో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఢిల్లీ కంటోన్మెంట్‌లోని లోతట్టు ప్రాంతాల్లో భారీగా వర్షం పడటంతో ఓ బస్సు, కారు వరద నీటిలో చిక్కుకుపోయాయి. ఈదురుగాలులతో కూడిన వర్షానికి అక్బర్ రోడ్డు సమీపంలో చెట్లు నేలకొరిగాయి. ఈ కారణంగా విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. అనేక ప్రాంతాల్లో 5 నుంచి 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది అని వాతావరణ శాఖ తెలిపింది. సఫ్దర్‌జంగ్ ప్రాంతంలో 81 మిల్లీ మీటర్లు, పాలంలో 68 మిల్లీ మీటర్లు, పూసా 71 మిల్లీ మీటర్లు, మయూర్ విహార్‌లో 48 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల దవేగంతో గాలులు వీచాయని వెల్లడించింది. భారీ వర్షంతో మింటో రోడ్డు వద్ద ప్రాంతం పూర్తిగా నీటితో నిండిపోవడంతో ఒక కారు మునిగిపోయింది. ప్రతికూల వాతవారణం వల్ల ఢిల్లీకి పలు విమానాల రాకపోకలకు ఆలస్యం అవుతోంది. దాదాపు 180కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా, 17 అంతర్జాతీయ సహా 49 విమానాలను దారి మళ్లించినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ప్రయాణికులకు ఎయిర్‌పోర్టు అడ్వైజరీ జారీ చేసింది. విమానాల సమయాలను సంబంధిత వెబ్‌సైట్లలో చెక్ చేసుకోవాలని సలహా ఇచ్చింది. అటు ఎయిరిండియా, ఇండిగో కూడా ప్రయాణికులను అప్రమత్తం చేశాయి. తాజా అప్‌డేట్‌లను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని చెప్పాయి. అంతకు ముందు శనివారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి ఢిల్లీ నగరాన్ని విమానాశ్రయానికి అనుసంధానించే ప్రధాన అండర్‌పాస్ జలమయమైంది. ఫలితంగా డజన్ల కొద్దీ కార్లు, బస్సులు నీటమునిగాయి. ముఖ్యంగా రానున్న కొన్ని గంటల్లో ఉరుములు, మెరుపులతో కూడిన అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. గంటకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని అంచనా వేసింది.

**కేరళలో రెడ్ అలర్ట్**

మరోవైపు రుతుపవనాల రాకతో కేరళలో భారీ ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. పలుచోట్ల చెట్లు,విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. రోడ్లన్నీ వరద నీటితో జలమయమవ్వగా రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలోనే కాసర్‌గోడ్, కన్నూర్, కోజికోడ్ వయనాడ్ మలప్పురం జిల్లాల్లో అధికారులు రెడ్ అలెర్ట్ ప్రకటించారు. మిగిలిన అన్ని జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించా రు. వచ్చే నాలుగు రోజులు కేరళలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు భారత వాతావరణ విభాగం హెచ్చరించింది. అత్యవసరమై తే తప్ప ప్రజలు ఇళ్లు వదిలి రావద్దని సూచించింది. మహారాష్ట్ర, రాజస్థాన్‌లో కూడా వర్షా లు కురుస్తున్నాయి.

## రోడ్డు దాటుతుండగా ఢీకొట్టిన కారు..
ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం

**న్యూఢిల్లీ :** తమిళనాడు రాష్ట్రం మధురై జిల్లాలోని కుంజంపట్టి సమీపంలో ఆదివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు ఢీకొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం పాలయ్యారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు రోడ్డు దాటుతుండగా అతి వేగంగా దూసుకొచ్చిన కారు వీరిని ఢీకొట్టింది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. ఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. మృతుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు మధురై పోలీసు సూపరింటెండెంట్ అరవింద్ తెలిపారు. ఒకే కుటుంబంలోని నలుగురు వ్యక్తులు ఒకేసారి మరణించడంతో వారి స్వగ్రామంలో విషాదం అలుముకుంది. కాగా ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెప్పారు.

## జపాన్‌ను దాటేశాం..
4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్: నీతి ఆయోగ్



**న్యూఢిల్లీ :** జపాన్‌ను వెనక్కి నెట్టి ప్రపంచంలోనే నాలుగోవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించిందని నీతి ఆయోగ్ సిఇఒ బివిఆర్ సుబ్రహ్మణ్యం చెప్పారు. దేశ నామమాత్రపు జిడిపి 4 ట్రిలియన్ డాలర్లకు చేరుకుందని తెలిపారు. 2024 వరకు భారత్ ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నది. 'వీక్షిత్ రాజ్య ఫర్ వీక్షిత్ భారత్ 2047' అనే అంశంపై శనివారం ఢిల్లీలో 10వ నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశం జరిగింది. తర్వాత నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీవీఆర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) డేటా ప్రకారం.. భారత ఆర్థిక వ్యవస్థ 4 ట్రిలియన్ డాలర్ల మార్కును చేరుకున్నట్లు చెప్పారు. 'నేను చెప్పినట్లుగా మనం నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగాం. మనది 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ. ఇది నా డేటా కాదు.. ఐఎంఎఫ్ డేటా. నేడు భారత్, జపాన్ కంటే పెద్ద ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందింది. యునైటెడ్ స్టేట్స్, చైనా, జర్మనీ మాత్రమే మనకంటే పెద్ద ఆర్థిక వ్యవస్థలుగా ఉన్నాయి. మనం వేసుకున్న ప్రణాళికకు కట్టుబడి ఉంటే.. మరో 2, 2.5 నుండి 3 సంవత్సరాలలోనే ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతాం అని సుబ్రహ్మణ్యం అన్నారు.

## కుల గణన విభజనలకు దారితీయదు
ఎన్‌సిఎస్‌సి చైర్‌పర్సన్ కిషోర్ మక్వానా



**న్యూఢిల్లీ :** కులగణన సమాజంలో అగాధాలను సృష్టిస్తుందనే ఆరోపణలను జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ (ఎన్‌సిఎస్‌సి) చైర్‌పర్సన్ కిషోర్ మక్వానా త్రోసిపుచ్చారు. సేకరించిన గణాంకాలు విధాన నిర్ణయాలకు పునాదిగా పనిచేస్తాయని, సామాజిక న్యాయాన్ని బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. అణగారిన వెనుకబడన వర్గాల వృద్ధికి దోహదపడుతుందని ఆయన పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. నాభా లెక్కల్లో కుల గణనను చేర్చాలని బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం నిర్ణయించడాన్ని మక్వానా స్వాగతించారు. 2011 మాదిరి కాకుండా సంక్షేమ పథకాలకు దామాషా ప్రాప్యతను నిర్ధారించే కచ్చితమైన గణాంకాలు అందుబాటులో ఉంటాయన్నారు. యుపిఎ ప్రభుత్వం 2011లో సామాజిక, ఆర్థిక, కుల గణనను నిర్వహించింది. ఇది 1931 తర్వాత దేశవ్యాప్తంగా కుల డేటాను సేకరించడానికి చేసిన మొదటి ప్రయత్నం. అయితే, ఎస్ఇసిసి– 2011 నుండి కుల డేటాను ఎప్పుడూ పూర్తిగా విడుదల చేయలేదు. అదే విధంగా దేనికీ ఉపయోగించుకోలేదు. కాగా, కుల గణన మతపరమైన విభజనలకు దారితీస్తుందనే ఆందోళనలను మక్వానా త్రోసిపుచ్చుతూ ఇది కులం ఆధారంగా ఎటువంటి విభజనను సృష్టించదన్నారు. దానికి బదులుగా సామాజిక న్యాయాన్ని బలోపేతం చేస్తుందన్నారు. వెనుకబడిన కులాలను వృద్ధిలోకి తెచ్చేందుకు సహాయా పడుతుందన్నారు. షెడ్యూల్డ్ కుల సమాజం కోసం బాబాసాహెబ్ అంబేద్కర్ కలలు కన్న మూడు అంశాలైన సామాజిక, రాజకీయ, ఆర్థికంగా బలోపేతం చేస్తుందన్నారు. కులగణన ద్వారా వెనుకబడిన వారిలో చివరి వ్యక్తికి కూడా హక్కులు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఎన్‌సిఎస్‌సి గణన ప్రక్రియలో ప్రత్యక్షంగా పాల్గొనదని, జనాభా లెక్కల తర్వాత విధాన రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తుందని మక్వానా స్పష్టం చేశారు. డేటా సేకరణలో తమ పాత్ర ఉండదని, కానీ డేటా విడుదలైన తర్వాత షెడ్యూల్డ్ కులాలకు నిష్పత్తి ఆధారంగా వారి వాటా లభించేలా చూసుకోవడంలో కమిషన్ పాత్ర ఉంటుందని తెలిపారు. చివరగా కుల గణన 1931లో నిర్వహించగా, నవీకరించబడిన డేటా లేకపోవడంతో జనాభాలో ఎస్‌సిలు 7 శాతంగా ఉన్నారనే భావనపై తాము పనిచేస్తున్నామని మక్వానా స్పష్టం చేశారు. కొత్త జనాభా గణన కేవలం ఎస్‌సిలకు మాత్రమే కాకుండా, ముస్లిం, క్రైస్తవ వర్గాలలోని ఉపకులాకు సంబంధించిన వివరణాత్మక డేటా బహిర్గతమవుతుందన్నారు. కమిషన్ విస్తృత కార్యకలాపాలపై చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఎన్‌సిఎస్‌సి రాష్ట్ర స్థాయి విచారణలను నిర్వహించడం ప్రారంభించిందని, ఇది ఇంతకు ముందు ఎప్పుడూ జరగలేదన్నారు. తాము పంజాబ్, రాజస్థాన్‌లలో విచారణలు నిర్వహించామని, ప్రజల మధ్యకు వెళ్తున్నామని, చట్టపరమైన నిబంధనలు మాత్రమే కుల ఆధారిత సమస్యలను పరిష్కరించవన్నారు. సమాజంలో కూడా సానుభూతి, భావోద్వేగ సంబంధం ఉండాలన్నారు.

## 'నేడు' భారత్–మాల్దీవుల... భాగస్వామ్యంపై చర్చలు

అమలును సమీక్షించనున్న ఇరుదేశాల విదేశీ వ్యవహారాల శాఖ మంత్రులు

భారత్ చేరుకున్నమాల్దీవుల విదేశీ వ్యవహారాల మంత్రి అబ్దుల్లా ఖలీల్



**న్యూఢిల్లీ :** భారతదేశంమాల్దీవుల మధ్య ఆర్థిక, సముద్ర భద్రత వ్యవహారాలలో స్నేహ సంబంధం చిగురించేందుకు మార్గం సుగమం కానున్నది. ఈ మేరకు భారతదేశ విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్, మాల్దీవుల విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి అబ్దుల్లా ఖలీల్ ఇరువురూ సోమవారం సమగ్ర ఆర్థిక, సముద్ర భద్రతకు సంబంధించి భాగస్వామ్యం అమలును సమీక్షించనున్నారు. ఆదివారం సాయంత్రం నుంచి ప్రారంభం అయ్యే మూడు రోజుల పర్యటన కోసం మాల్దీవుల విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి అబ్దుల్లా ఖలీల్ ఒక అత్యున్నత స్థాయి ప్రతినిధి బృందంతో భారత పర్యటనకు వచ్చారు. భారత్‌లో పర్యటించడం అబ్దుల్లా ఖలీల్‌కు ఇది మూడవ సారి.సమగ్ర ఆర్థిక, సముద్ర భద్రత భాగస్వామ్యంపై గత ఏడాది (2024) అక్టోబరులో భారత దేశంమాల్దీవుల దార్శనిక పత్రాన్ని భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముఇజ్జు ఆమోదించారు. విదేశీ వ్యవహారాల మంత్రి అబ్దుల్లా ఖలీల్ సందర్శన భారతదేశంమాల్దీవుల మధ్య ఉన్నత స్థాయి రాజకీయ మార్పిడులను పెంపొందించడాన్ని కొనసాగించనుందని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఇఎ) ఈ పర్యటన గురించి ఒక ప్రకటన విడుదల చేసింది. సమగ్ర ఆర్థిక. సముద్ర భద్రతా భాగస్వామ్యంపై భారతదేశంమాల్దీవుల దార్శనిక పత్రాన్ని అమలు చేయడంలో పురోగతిని పర్యవేక్షించడానికి జరుగబోయే రెండవ కోర్ గ్రూప్ (హెచ్‌ఎల్‌సిజి) సమావేశంలో అబ్దుల్లా ఖలీల్ మాల్దీవులకు నాయకత్వం వహిస్తారని ఆ ప్రకటన తెలియజేసింది. మాల్దీవుల విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి అబ్దుల్లా ఖలీల్ భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్‌తో ద్వైపాక్షిక చర్చలను కూడా జరుపుతారని వెల్లడించింది. మాల్దీవులు భారతదేశానికి కీలకమైన సముద్ర పొరుగుదేశం. భారతదేశానికి ముఖ్యమైన మొదటి పాలసీ కలిగి ఉన్న పొరుగుదేశమే కాకుండా అన్ని ప్రాంతాల భద్రత, వృద్ధికి 'విజన్ మహాసాగర్' తప్పనిసరి, సమగ్రమైన పురోగతి అని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఆ ప్రకటనలో తెలియజేసింది. రెండు దేశాల మధ్య సమగ్ర ఆర్థిక, సముద్ర భద్రత భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడమే ఈ పర్యటన లక్ష్యంగా నిర్దేశించుకుందని ఎంఇఏ ప్రకటన వెల్లడించింది. చైనా అనుకూలంగా మొగ్గు చూపుతారనిన భావించే మహమ్మద్ ముయిజ్జు 2023 నవంబరులో మాల్దీవుల అత్యున్నత పదవి అయిన అధ్యక్ష పదవికి బాధ్యతలు స్వీకరించిన తర్వాత భారతదేశంమాల్దీవుల మధ్య సంబంధాలు ఉద్రిక్తంగా మారాయి. ప్రమాణస్వీకారం చేసిన కొన్ని గంటలలోనే తన దేశం నుండి భారత దేశ సైనిక సిబ్బందిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత భారత సైనిక సిబ్బంది స్థానంలో పౌరులు వచ్చారు. అక్టోబర్‌లో ఢిల్లీ పర్యటన సందర్భంగా మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జా భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకుంటానని ప్రతిజ్ఞ చేయడంతో భారతదేశంమాల్దీవుల సంబంధాలలో కొంత మార్పు వచ్చింది.

## న్యాయ సహాయ పథకాల ప్రభావంపై కేంద్రం స్వతంత్ర ఆడిట్ యోచన

**న్యూఢిల్లీ :** ప్రభుత్వం 2026లో ముగియనున్న దాని కీలక న్యాయ సహాయ పథకాల ప్రభావాన్ని అంచనా వేయడానికి స్వతంత్ర ఆడిట్‌ను నిర్వహించాలని యోచిస్తోంది. 2026 తర్వాత కార్యక్రమాల స్కేలబిలిటీ, స్థిరత్వాన్ని కూడా ఆడిట్ నిర్ణయిస్తుంది. కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖలోని న్యాయ శాఖ కేంద్ర రంగ పథకం అయిన 'దిశ '(భారతదేశంలో న్యాయం యొక్క సమగ్రప్రాప్తి కోసం వినూత్న పరిష్కారాల రూపొందించడం) పథకం న్యాయం పొందడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది మూడు కీలక కార్యక్రమాలను కలిగి ఉంటుంది. టెలిలా, న్యాయ బంధు( ప్రో బోనో లీగల్ సర్వీసెస్), న్యాయ అక్షరాస్యత, న్యాయ అవగాహన, ఇవన్నీ పౌరులకు ముఖ్యంగా మారుమూల ప్రాంతాల వారికి అందుబాటులో ఉన్న, చౌకైన సేవలను అందించడానికి పనిచేస్తాయి. ఐదు సంవత్సరాల ఈ దిశ పథకం (2021–2026) కోసం రూ.250 కోట్లు ఆర్థిక వ్యయం నిర్దేశించబడింది.కార్యక్రమం ప్రభావాన్ని అంచనావేయడానికి, కోర్సు దిద్దుబాటు లేదా మెరుగుదలను పరిష్కరించడానికి, 2026 తర్వాత స్కేలబిలిటీ, స్థిరత్వాన్ని నిర్ణయించడానికి న్యాయశాఖ మూల్యాంకనం ఉద్దేశించబడింది. దీని కోసం నిర్ణీత సమయంలోపు మూల్యాంకనం నిర్వహించాలని, సకాలంలో పూర్తి చేయాలని 'టెండర్ ఆహ్వానిస్తూ నోటీస్' జారీ చేసింది. ప్రతిపాదిత మూల్యాంకనం కలిగి ఉన్న మూడు కార్యక్రమాలు దిశ పథకం కింద ఉన్న 'టెలిలా', న్యాయ బందు (ప్రో బోనో లీగల్ సర్వీసెస్), లీగల్ లిటరసీ మరియు లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ (ఎల్‌ఎల్‌ఎల్‌ఎపి) సంబంధిత లబ్ధిదారులు, రంగాలు, ప్రాంతాలను విశ్లేషించి అంచనా వేస్తుంది. ఆడిట్ పథకం కింద కార్యక్రమాలను విశ్లేషించి, అవుట్‌పుట్ ఫలితాన్ని చేపడుతుంది. ఈ పథకం కింద కార్యక్రమాల అమలులో ఏవైనా అంతరాలు ఉంటే వాటిని గుర్తించి అధ్యయనం చేయడమే కాకుండా చర్యలను సూచిస్తుంది.

# ఇక అలా కుదరదు

పాకిస్థాన్‌లో కూర్చుని శిక్ష తప్పించుకోలేరు

సరిహద్దు ఉగ్రవాదంపై భారత్ వైఖరిని

ప్రపంచనాయకులకు చెప్పిన అఖిలపక్ష బృందాలు

**న్యూయార్క్ :** పాకిస్థాన్ సరిహద్దుల నుండి ఎదురయ్యే ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి భారతదేశం సరికొత్త వైఖరిని అనుసరిస్తుందని, ఇలాంటి నేరాలకు పాల్పడినవారిని ఇక శిక్షించకుండా వదిలిపెట్టేదిలేదని వివిధ దేశాల్లో పర్యటనలకు వెళ్ళిన ఏడు భారత బహుళపక్ష ప్రతినిధి బృందాలు ప్రపంచ నాయకులకు తెలియజేశాయి. భారతదేశం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తుందని, అదేసమయంలో అన్ని దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను వృద్ధి చేసుకుంటుదని చెప్పాయి. శశిథరూర్, సంజయ్ కుమార్ ఝా, బైజయంత్ జై పాండే, కనిమొళి, సుప్రియాసూలే నాయకత్వాన పలు ప్రతినిధి బృందాలు పాకిస్థాన్ దుశ్చర్యలను, ఉగ్రవాదంతో దానికున్న సుదీర్ఘ అనుబంధాన్ని వివిధ దేశాల నాయకులకు తెలియజెప్పేందుకు వెళ్ళారు.

**మొత్తం 33 దేశాలలో ఈ బృందాలు పర్యటిస్తాయి.**

పాకిస్థాన్‌లో కూర్చుని సునాయాసంగా సరిహద్దులు దాటివచ్చి భారతీయులను చంపి పారిపోతామంటే ఇకమీదట సహించబోమని,ఉగ్రవాదులు శిక్ష తప్పించుకోలేరని, వారు అందుకు తగిన మూల్యం చెల్లించుకుంటారనీ కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ నాయత్వాన అమెరికాలో పర్యటిస్తున్న బహుళపక్ష భారత ప్రతినిధిబృందం స్పష్టం చేసింది. పర్యటనలో భాగంగా బృందం ఆదివారంనాడు న్యూయార్క్‌లో దిగింది, ఎంపిక చేసిన గ్రూపులతో జరిగిన అనుసంధాన కార్యక్రమంలో పాల్గొంది. భారత కాన్సులేట్ జనరల్ ఆతిథ్యం ఇచ్చిన ఈ సమావేశంలో భారత్–అమెరికాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. ఈ బృందం గుయానా బయలుదేరి వెళ్ళేముందుగా జరిగిన ఈ సమావేశంలో శశిథరూర్ మాట్లాడుతూ, పాకిస్థాన్‌కు భారతదేశం ఇచ్చే సందేశం చాలా స్పష్టంగా ఉందని శశిథరూర్ అన్నారు. న్యూయార్క్‌లో ఉన్న 9/11 స్మారక కేం ద్రాన్ని ఈ బృందం సందర్శించింది.



పహల్గామ్‌లో దాడుల తర్వాత కొత్త నిబంధనలను భారత్ అమలు చేస్తోందన్నారు. ''నడుచుకుంటూ వెళ్ళి చాలా సులభంగా సరిహద్దులు దాటి ఎలాంటి శిక్షలూ లేకుండా భారతీయులను చంపి వెళ్ళిపోవచ్చు అనుకునేవాళ్ళను ఇకమీదట ఎట్టిపరిస్థితుల్లో అనుమతించబోం'' అని శశిథరూర్ హెచ్చరించారు.

''మేం ఇప్పుడే ఉగ్రవాదులకు ఒక సందేశాన్ని పంపిస్తున్నాం, మీరు ప్రారంభించారు, మేం సమాధానం చెప్పాం, మీరు ఆపేస్తే, మేమూ ఆపేస్తాం, 88 గంటలసేపు యుద్ధం జరిగింది, వాళ్ళు ఆపేశారు, మేం వెనక్కు తిరిగి పరిశీలించాం, ఈ యుద్ధం జరగాల్సిందికాదు, చాలా ఆవేదన చెందాం, విలు వైన ప్రాణాలు కోల్పోయాం. అదే సమయంలో వెనక్కు తిరిగి అన్ని అనుభ వాలను నెమరువేసుకున్నాం,బలమైన ఉక్కు సంకల్పంతో, సరికొత్త ఆలోచ నలతో కృతనిశ్చయం చేసుకున్నాం, ఇక కొత్త నిబంధనలు అమలు చేస్తాం, సులభంగా సరిహద్దులు దాటి వెళ్ళిపోవచ్చు, భారతీయులను చంపేయొచ్చు, ఎలాంటి శిక్షలూ లేకుండా బయటపడిపోవచ్చు అని పాకిస్థాన్‌లో కూర్చుని నమ్మేవాళ్ళను ఇక వదిలిపెట్టేదిలేదు, వారు మూల్యం చెల్లించుకుంటారు'' అని చెప్పారు. ''శరవేగంగా విస్తరిస్తున్న ప్రపంచ ప్రజాస్వామ్య స్వేచ్ఛా మార్కెట్లపై మేం కొన్ని సంవత్సరాలపాటు దృష్టి కేంద్రీకరిస్తాం, మాది అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ,దానిమీదే ఇప్పుడు మా దృష్టి అంతా పెడతాం, టెక్నాలజీ, సంబంధిత వృద్ధి, పేద రికం నుండి పెద్దసంఖ్యలో ప్రజలను బయటపడేయడం వంటి విషయాపైనే కేంద్రీరి స్తాం21వ శతాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా వచ్చే అవకాశాలపై భారతదేశం దృష్టిపెడు తుంది,ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చెందడం పైనే కాదు, మా ప్రజలను ప్రపంచంలోకి తీసుకువస్తాం'' అని ఆయన చెప్పారు.

శశిథరూర్ నాయకత్వంలో ఒక ప్రతినిధిబృంద గుయానా, పనామా, కొలంబియా, బ్రెజిల్, అమెరికా దేశాలలో ఈ బృందం పర్యటిస్తుంది. ఈ బృందంలో సర్ఫరాజ్ అహ్మద్ (జెఎంఎం), గంటి హరీశ్ మాధుర్ బాలయోగి (టిడిపి), శశాంక్ మణి త్రిపాఠి (బిజెపి), భువనేశ్వర్ కలిత(బిజెపి), మిలింద్ దియోరా(శివసేన), తేజస్వి సూర్య (బిజెపి),మాజీ దౌత్యవేత్త తరణ్‌జిత్ సంధు ఆయన బృందంలో సభ్యులుగా ఉన్నారు.

ఇక బిజెపి ఎంపి బైజయంత్ జైపాండే నాయకత్వాన బృందం బహ్రైన్ రాజధాని మనామాలో ఆ దేశ ఉపప్రధానమంత్రి షేక్ ఖలీద్ బిన్ అబ్దుల్లా అల్ ఖలీఫాతో సమావేశం జరిపింది. బహ్రైన్,భారత్ మధ్య లోతైన సుదీర్ఘ సంబంధాలు ఉన్నాయని ఆ దేశ ఉపప్రధానమంత్రికి ఈ సందర్భంగా జైపాండే గుర్తుచేశారు. బృందంలో ఉన్న అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ, అమాయకులను హత్యచేసిన ఉగ్రవాదులు తమ వాదనలను సమర్థించుకుంటున్నారనీ, పాకిస్థాన్‌లో ఉగ్రవాదులకు, ఐఎస్ఐఎస్ తక్ఫిరి సిద్ధాంతానికి ఎలాంటి తేడా లేదని అన్నారు. జెడి(యు) ఎంపి సంజయ్ ఝా నాయకత్వాన ఆదివారంనాడు ప్రతినిధిబృందం దక్షిణ కొరియాలో పర్యటించింది. శనివారంనాడు సియోల్ చేరుకున్న ఈ బృందం ఆదివారంనాడు ఇండియన్ డయాస్పోరా సభ్యులతో సమావేశం జరిపింది. మోదీ ప్రభుత్వం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తోందని బృందం ఉద్ఘాటించింది. కొరియా దేశ ప్రముఖులతో ఈ బృందం సమావేశాలు జరిపింది. వీరిలో దక్షిణ కొరియా మాజీ విదేశాంగమంత్రి డా.యూన్ యుంగ్ క్వాన్, విదేశీవ్య వహారాల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు కిమ్ గున్, ఛో హ్యూన్, జాతీయ ఉగ్రవాద వ్యతిరేక కేంద్రం డైరెక్టర్ మేజర్ జనరల్ షిన్ సాంగ్ గ్యుయాన్, భారత్‌లో కొరియా మాజీ దౌత్యవేత్త షిన్ బాంగ్ కిల్, లీ జూన్ గ్యు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. సియోల్‌లోని భారత దౌత్య కార్యాలయం ఎక్స్ వేదికగా ఈ మేరకు పోస్టింగ్ పెట్టింది.ఈనెల 26 వరకూ ఈ బృందం పర్యటన కొనసాగుతుంది. తొలుత ఈ బృందం జపాన్ పర్యటన పూర్తిచేసింది.

సుప్రియాసూలే నాయకత్వాన గల బృందం దోహాలో ఆదివారంనాడు ఖతార్ షురా కౌన్సిల్ డిప్యూటీ స్పీకర్ డా.హమ్దా అల్ సులైతీ, ఇతర ఖతార్ ఎంపీలతో సమావేశమైంది. పాకిస్థాన్ ఉగ్రవాద చర్యలకు వ్యతిరేకంగా ప్రపంచానికి భారత్ గట్టి సందేశాన్ని ఇస్తోందని సుప్రియాసూలే బృందం తెలిపింది. డిఎంకె ఎంపి కనిమొళి నాయకత్వానగల బృందం ఆదివారంనాడు రష్యా రాజధాని మాస్కోలో పర్యటించింది. రష్యా ఎంపీలు, అధికారులు, ఇతర ప్రముఖులతో ఈ బృందం సమావేశమైంది. స్లోవేనియాదేశానికి వెళ్ళి పాకిస్థాన్ దుశ్చర్యలను అక్కడి ప్రభుత్వ ప్రతినిధులకు తెలియజేసింది. ఇండియన్ డయాస్పోరా సభ్యులతో బృందం సమావేశమైంది. ప్రముఖ టాస్ వార్తాసంస్థకు చెందిన జర్నలిస్టులతో ఈ బృందం ముందురోజు సమావేశమైంది. ఉగ్రవాదాన్ని ప్రతిఘటించేందుకు భారత్ చేస్తున్న దౌత్యపరమైన కృషిని ఈ బృందం వివరించింది.

## గ్రామ పరిపాలన అధికారి పరీక్ష ప్రశాంతం

**ప్రజాపక్షం/సూర్యాపేట:** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించిన భూ భారతి చట్టం అమలులో భాగంగా అధికార వీకేంద్రీకరణ ద్వేయంగా ప్రతి గ్రామానికి భూ సమస్యలు పరిష్కరించేందుకు ఒక రెవిన్యూ అధికారిని నియమించేందుకు నిర్వహించిన పరీక్ష ఎ లాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగిసిందని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు తెలిపారు. ఆదివారం ప్రభుత్వ పాలిటెక్నిక్ బాలికల కళాశాలలో జరిగిన గ్రామ పరిపాలన అధికారి పరీక్ష కేంద్రంను జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పరిపాలన అధికారి పరీక్షకి 194 మందికి గానూ 182 మంది హాజరైనట్లు, 12 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చివ్వెంల తహసిల్దార్ కృష్ణయ్య, కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## సిపిఐ మండల కార్యదర్శిగా చింతిరాల రవి ఏకగ్రీవ ఎన్నిక

**ప్రజాపక్షం/చింతలపాలెం:** సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండల సిపిఐ పార్టీ మండల కార్యదర్శిగా చింతిరాల రవి వరుసగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. చింతలపాలెం మండల కేంద్రంలో శనివారం జరిగిన మండల మహాసభలో ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం 13 మందితో నూతన మండల కౌన్సిల్, ఏడుగురితో కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన సిపిఐ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి మూడోసారి బాధ్యతలు అప్పగించడం పట్ల ప్రజా సమస్యలపై నిరంతరం సమరశీల పోరాటాలను కొనసాగిస్తూ పార్టీ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు.





## నల్లగొండలో ప్రశాంతంగా గ్రామపాలన అధికారుల పరీక్ష

**ప్రజాపక్షం/నల్లగొండ:** జిల్లా కేంద్రంలోని నాగార్జున కళాశాలలో ఆదివారం నిర్వహించిన గ్రామ పాలన అధికారుల పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.పరీక్ష ప్రారంభమైన వెంటనే జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఇన్చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ కలిసి గ్రామ పాలనాధికారుల పరీక్షను తనిఖీ చేశారు. పరీక్షా కేందం చీఫ్ సూపరింటిండెంట్ ఇన్విజిలేటర్లతో పరీక్ష తీరు తెన్నులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పరీక్షకు హాజరైన వారు, గైర్హాజరైన వారి వివరాలను, పరీక్షా కేంద్రంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలు, బందోబస్తు ,తదితర అన్ని అంశాలను పరిశీలించారు. కాగా నల్లగొండ జిల్లా నుండి గ్రామ పాలన అధికారుల పరీక్షకు 276 మంది హాజరు కావలసి ఉండగా 241 మంది పరీక్షకు హాజరయ్యారు. 35 మంది పరీక్షకు గైర్హాజరైనట్లు కలెక్టర్ తెలిపారు . గ్రామ పాలనాధికారుల పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని ఆమె తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట ఇన్చార్జి రెవెన్యూ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, స్థానిక సంస్థల ఇన్చార్జ్ అధనపు కలెక్టర్ ,గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, తహసిల్దార్ హరిబాబు ఉన్నారు.

## సిపిఐ నార్కట్‌పల్లి మండల నూతన కార్యదర్శిగా పెండ్యాల శంకరయ్య



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** ప్రజా సమస్యలపై పోరాటానికి నిత్యం ప్రజారాజ్యంలో ఉంటూ సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టులు ముందువరుసలో ఉండాలని నూతనంగా ఎన్నుకోబడిన నార్కట్ పల్లి మండల కమిటీ కార్యదర్శి పెండ్యాల శంకరయ్య అన్నారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన 7వ మహాసభలో పలు తీర్మాలను చేసి అనంతరం నూతన మండల సమితిని ఎన్నుకోవడం జర్గింది. మండలంలో అక్కెనపల్లి వాగు నుండి ఆకారం వరకు కాల్వ పనులను వెంటనే పూర్తి చేయాలని, నార్కట్ పల్లి ఆర్టీసి డిపోకు అదనంగా 20 బస్సులను తెప్పించాలని, నార్కట్‌పల్లిలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ని మరమ్మత్తులు చేయించి వాడుకలోకి తీసుకురావాలని, చెర్వుగట్టు దేవస్థానానికి 20కోట్లు నిధులు విడుదల చేయాలని, జూనియార్ కాలేజీ కి సొంత భవనం ఏర్పాటు చేయాలని, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, బి వెల్లెంల గ్రామంలో పూర్తి చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పేదలకు పంచాలని తీర్మానించడం జర్గిందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్‌కుమార్ తెలిపారు.

**నూతన మండల సమితి ఎన్నిక ఏకగ్రీవం:** మండలంలో నిర్వహించిన 7 వ మహాసభ విజయవంతంగా జరుపుకున్న అనంతరం పార్టీ మండల సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జర్గింది. నూతన మండల కార్యదర్శిగా పెండ్యాల శంకర్, సహాయ కార్యదర్శిగా వంగాల నాగయ్య, వనం వాసుదేవులు తోపాటు 11 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నకోవడం జరిగిందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్‌కుమార్ తెలిపారు.

## జూన్ 6నసిపిఐ మండల మహాసభ



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మర్రిగూడ మండల కేంద్రంలో జూన్ 6న జరుగనున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మండల 15 వ మహాసభను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి ఈదుల బిక్షం రెడ్డి కోరారు.ఆదివారం సిపిఐ కార్యాలయంలో మహాసభకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు,ఈసందర్భంగా ఆయన మాట్లడుతూ మధ్యతరగతి,బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం నిరంతరం పార్టీ పాటుపడుతుందని అన్నారు.ఈ మహాసభను సిపిఐ జాతీయ సమితి సభ్యులు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి ప్రారంభిస్తారని, ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పాల్గొంటారని తెలిపారు మండలంలోని వివిధ గ్రామాల నుంచి సిపిఐ ప్రతినిధులు పాల్గొని మహాసభను జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి బూడిద సురేష్,కార్యవర్గ సభ్యులు బుర్ర శేఖర్,ఎరకల నిరంజన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** కొండమల్లేపల్లి గ్రామ బొడ్రాయి పండుగ తృతియ వార్షికోత్సవంలో ఆదివారం దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలు నాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని అన్నారు. మన సంస్కృతి సాంప్రదాయాల ప్రకారం బొడ్రాయి పండుగను నిర్వహించుకోవడం ఆనంద దాయకం అని అన్నారు. కొండమల్లేపల్లి ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఊట్కూరి వేమన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పిటిసి సలహాదారుడు పసునూరి యుగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.





## సాగర్‌లో పర్యాటకుల సందడి...

**ప్రజాపక్షం/నందికొండ:** ఆదివారం సాగర్‌లో పర్యాటకుల సందడి నెలకొంది వేసవి సెలవులు రావడం అందులో వాతావరణం చల్లబడడంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో సేద తీరెందుకు ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ లో ఆదివారం పర్యాటకులతో సందడి వాతావరణం నెలకొంది రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు సాగర్ అందాలను తిలకించడానికి వచ్చారు ఆదివారం మొత్తం రెండు ట్రిప్పులు వేసిన టూరిజం శాఖ విద్యార్థులు,పర్యాటకులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. వారు లాంచీలో నాగార్జునకొండకు వెళ్లి అక్కడి మ్యూజియంలోని విశేషాలు, బుద్ధుని అవశేషాలు, మాన్యుమెంట్స్ తదితర ప్రాంతాలను సందర్శించారు. అక్కడినుంచి సాయంత్రం వేళలో ఎత్తిపోతల, బుద్ధవనం తదితర ప్రాంతాలను సందర్శించారు. నాగార్జునసాగర్ నుండి కృష్ణానది మధ్యలో ఉన్న నాగార్జున కొండ ఐలాండ్ వరకు లాంచి ప్రయాణం తమకు ఎంతో ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగించిందని ప్రయాణికులు తమ అనుభూతిని పంచుకున్నారు.

## సమ సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు

### సిపిఐ శ్రేణులకు గన్నా చంద్రశేఖర్ దిశా నిర్దేశం



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్(మఠంపల్లి):** సమ సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు కొనసాగుదామని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ సిపిఐ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం మఠంపల్లి మండల సిపిఐ మహాసభ వర్ధాపురం గ్రామంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. నీ, నా, తన, మన స్వార్ధం లేని నూతన సమాజాన్ని నిర్మించాలని, అన్నార్తుల, అక్రందనలు లేని దోపిడిలేని నవ సమాజం నిర్మాణం చేపట్టాలని, రైతన్నకి గిట్టుబాట ధరకు చట్టబద్ధత కల్పించాలని, నిరుద్యోగ యువత బృతి కోసం ఉద్యమించాలని, హరిజన, గిరిజన, ముస్లీం మైనార్టీలకై ప్రతి కార్యకర్త ఉద్యమించాలని ఆయన కోరారు. మఠంపల్లి మండలంలో గత నాలుగు దశాబ్దాలుగా తిష్ట వేసుకుని ఉన్న అనేక సమస్యలు పరిష్కారం కోసం పాలకులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చిందని, ఆ హామీలను అమలు చేయాలని, కొత్త పెన్షన్ కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారని, ఇచ్చిన హామీలను నిలబెట్టుకునేందుకు పాలకులు కృషి చేయాలని, తెలంగాణలో కాంగ్రెస్ ఏర్పడిన సందర్భంగా ప్రజా పాలనలో అనేక దరఖాస్తులు తీసుకున్నారని వాటి పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని, మఠంపల్లి మండలంలో ఉన్న పోడు భూముల రైతులకు పట్టాలిచ్చి వారికి కూడా రైతు బరోసా అందించాలని, అలాగే చివరి భూములకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయ నాయుడు మాట్లాడుతూ అమరవీరుల ఆశయ సాధన కోసం కృషి చేస్తామని, మండల వ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహిస్తామని, భవిష్యత్‌లో కూడా కార్మిక హక్కులు, రైతన్నల హక్కులు, విద్యార్థి, యువజన హక్కులపై ప్రజలను సమీకరించి ఉద్యమాలు చేస్తామన్నారు. అమరారపు మట్టయ్య అధ్యక్షత వహించిన ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు, మఠంపల్లి మండల సిపిఐ కార్యదర్శి అమరారపు పున్నయ్య, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు చిలకరాజు శ్రీను, హుజూర్‌నగర్ సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, వల్దాసు రామయ్య, జలాలుద్దీన్, అలీబాబా, చలువాది సుబ్బారావు, అమరారపు వెంకటయ్య, చిన్న జాను, జానీబాషా, పెద్ద సైదులు, మీరావలి, సతీష్, సైదా, బూర రామకృష్ణ పాల్గొన్నారు.



## దోబీఘాట్ భూమి అన్యక్రాంతం

### మాభూమి మాకు ఇప్పించాలని కోరుతూ రజకుల వినతి

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** తిరుమలగిరి మున్సిపాలిటి కేంద్రంలో సర్వే నెంబర్ 495లో ప్రభుత్వం కేటాయించిన దోభిఘాట్ భూమి 27 కుంటలు అన్యక్రాంతమైంది. దీనిని తిరిగి తమకు ఇప్పించాలని కోరుతూ తిరుమలగిరి రజక సంఘం నాయకులు జిల్లా కలెక్టర్‌ను, ప్రజాప్రతినిధులను కోరారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం అధ్యక్షులు పులిమామిడి సోమన్న ,ప్రధాన కార్యదర్శి పులిమామిడి బిక్షం లు మాట్లాడుతూ తమ పూర్వికుల నుండి సర్వే 495లోని ప్రభుత్వ భూమి 27 కుంటల్లో ఓడల బావిని నిర్మించి అక్కడ బట్టలు ఉతుకుతూ వ్యవసాయం చేస్తూ జీవనం సాగించడం జరిగిందని తెలిపారు. నీటి వసతి లేక బట్టలు ఉతుకుటకు చెరువుల వద్దకు వెళ్లి ఉతుకుతుండటంతో తమకు ప్రభుత్వం కేటాయించిన 27 కుంటల భూమి కబ్జాకు గురైందన్నారు. గత ప్రభుత్వం మోడల్ దోభిఘాట్ నిర్మాణం కోసం అప్పటి తహసిల్దార్ ఇదే భూమిని సర్వే చేసి అధికారికంగా పత్రాలు కూడా తయారుచేసి జిల్లా కలెక్టర్‌కు పంపడం జరిగిందన్నారు. భూముల విలువ పెరగడంతో ధోభిఘాట్ భూమిని కబ్జా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కేటాయించిన భూమిని కబ్జాదారుల నుండి ఇప్పించాలని తాము అధికారుల చుట్టు తిరుగుతున్నామని, ఐనా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూమిని తమకు ఇప్పించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో తిరుగలగిరి రజక సంఘం మండల కార్యదర్శి పులిమామిడి వెంకన్న పాల్గొన్నారు.

## వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతి






**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ ప్రైవేట్ హస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యంతో మరో ఓ బాలింత మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి కోదాడ పట్టణంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని శ్రీతిరుమల ప్రైవేట్ హస్పిటల్ లో తెలంగాణ ఉద్యమకారుడు రాయపూడి వెంకటనారాయణ కుమార్తె హిమబిందు రెండో కాన్పుకోసం ప్రైవేట్ హస్పిటల్ లో చేర్చారు. శనివారం నార్మల్ డెలవరీ చేయడంతో మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం ఆమెను ఆసుపత్రులోని ఐసియులో వైద్యులు ఉంచారు. హిమబిందును చూపాలని ఆమె కుటుంబ సభ్యులు వైద్యులను కోరగా కొంత సమయం తర్వాత చూసేందుకు అనుమతి ఇస్తామని చెప్పారు. ఇలా ఆమెను చూడకుండా మాటలతో మభ్యపెడుతుండటంతో వారిని నిలదీయగా ఆమె మృతి చెందినట్లు చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందిందని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. వైద్యులు మాత్రం తమ తప్పేమిలేదని చెబుతున్నారు. ఈ ప్రైవేట్ హస్పిటల్ గతంలో చికిత్సకు వచ్చిన వారు అనేకమంది మృత్యువాత పడ్డారు. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకుల చెంత చేరుతూ సదరు హస్పిటల్ నిర్వాహకులు కాలం వెల్లదీస్తూ ఇలాంటి విపత్తు నుండి బయటపడుతున్నారు. దీనికి తోడు సామాజిక సేవల పేరుతో రక్తదాన శిబిరాలు నిర్వహించి సొమ్ము చేసుకుంటున్నారే ఆరోపణలు యాజమాన్యంపై ఉన్నాయి. ఇప్పటికైనా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఆసుపత్రి వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## పారదర్శకంగా రాజీవ్ యువవికాసం లబ్ధిదారుల ఎంపిక : రమేష్



**ప్రజాపక్షం/మునగాల:** రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా స్వయం ఉపాధి రుణాల కోసం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేని యువత లక్షలాదిమంది నిరుద్యోగులు, యువత యువ వికాసం పథకంలో దరఖాస్తులు చేసుకున్నారని, ఈ ఎంపిక పారదర్శకంగా జరగాలని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ పథకంలో రాజకీయాలకు అతీతంగా నిజమైన లబ్ధిదారులను గుర్తించి వారికి స్వయం ఉపాధి రుణాలు, యూనిట్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత 15 సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో 30 లక్షల మందికి పైగా నిరుద్యోగ యువత విద్యా ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటి సభ్యులు సతీష్, సైదులు, మండల అధ్యక్షులు ఖాధర్, గడ్డం వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌పి గారూ స్పందించండి... మాకు న్యాయం చేయండి

### ఆత్మకూర్ (ఎస్) ఎస్ఐ బెదిరింపువల్లే నా భర్త ఆత్మహత్యాయత్నం

### మా భూమిని అక్రమించిన వారికి అండగా ఉంటూ మమ్మల్ని వేధిస్తున్నారు

### విలేకరుల ముందు బోరున విలపించిన బాధిత కుటుంబం

**ప్రజాపక్షం/ఆత్మకూర్(ఎస్):** ఆత్మకూర్ (ఎస్) ఎస్ఐ తమ భూమిని అక్రమించిన వారికి అండగా ఉంటూ మమ్మల్ని బెదిరింపులకు గురి చేస్తూ వేధిస్తున్నాడని దీంతో నాభర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చావు బతుకుల మధ్య ఉన్నాడని జిల్లా ఎస్‌పి స్పందించి మా భూమిని మాకు అప్పగించి న్యాయం చేయాలని ఆత్మకూర్ ఎస్ మండల పరిధిలోని తుమ్మల పెన్‌పహడ్ గ్రామానికి చెందిన సూరం ధనలక్ష్మి వేడుకున్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణ జనరల్ ఆసుపత్రిలో ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన తన భర్తను చూపుతూ విలేకరుల ముందు బోరున విలపిస్తూ తనగోడును వెల్లబోసుకున్నారు. తనభర్త సూరం సైదులు అరోగ్యం బాగోలేదని మాకు గ్రామంలోని సర్వే నెంబర్ 118, 119లో 14 ఎకరాల భూమి ఉందని, మా భూమి పక్కనే మా ఆడబిడ్డ భర్త రాంపల్లి రాంబాబుకు ఎకరం భూమి ఉందన్నారు. ఆయన మా భూమికి ముప్పావు ఎకరం భూమి వరకు కబ్జా చేశారని, ఇదేమిటని అడిగితే నాపై, నా భర్తపై దాడిచేసి మముల్నికొట్టి మా ఒంటిపై ఉన్న బంగారం గొలుసు లాక్కెళ్లారని తెలిపారు. దీంతో తాము పోలీసులను ఆశ్రయించామని నాడు పోలీసులు స్పందించకపోవడంతో ఉన్నతాధికారులకు విషయాన్ని తెలపగా వారు చట్ట ప్రకారం తేల్చుకోవాల్సిందిగా సూచించారని తెలిపారు. దీంతో తాము ఆర్టీఏ చట్టం కింద పెట్టామన్నారు. తాము చట్ట ప్రకారం వెళుతుండటంతో ఆడబిడ్డ రాంపల్లి ఉమా రాంబాబులు తిరిగి ఎస్ఐ పై ఒత్తిడి తేస్తూ మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఇటీవల మా పెద్ద ఆడబిడ్డ నా భర్త ఆరోగ్యం సరిగా లేకపోవడంతో చూసేందుకు రాగా ఆమె కుమారిడితో రాంపల్లి రాంబాబు గొడవకు దిగారని, ఇదే విషయమై తాము పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా మీరే దాడిచేసి మీరే ఫిర్యాదు చేస్తున్నారా అంటూ ఎస్ఐ అనరాని మాటలు అన్నాడని తెలిపారు. చీటికి మాటికి మమ్ముల్ని స్టేషన్‌కు పిలిపించి నా కూతురు, కుమారుడిపై కేసు పెడతామంటూ వారిని చదువుకోనివ్వనంటూ బెదిరిస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయమై నా భర్త ఆవేదనకు గురై పోలీసులు పట్టించుకోవడంలేదంటూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని అన్నారు. నా భర్త చావు బతుకుల మధ్య ఉన్నాడని, నా భర్తకు ఏదైనా జరిగితే దానికి ఎస్ఐ బాద్యత వహించాలని అన్నారు. దీనిపై జిల్లా ఎస్‌పి సమగ్ర విచారణ చేసి మా భూమిని మాకు అప్పగించాలని కోరారు.



## రహదారిపై అండర్ పాస్‌లను పెంచాలి



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి పరిధిలో జాతీయ రహదారి 65 నెంబర్‌పై నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ కారణంగా ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అదనంగా మరో రెండు ప్రాంతాలలో అండర్ పాస్ నిర్మాణాలను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం స్థానిక బిజెపి నాయకులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. సుమారు కిలో మీటరు మేర నిర్మిస్తున్న వంతెనకు కేవలం ఒకే దగ్గర అండర్ పాస్ నిర్మాణం చేపట్టడం వల్ల పట్టణ ప్రజలు ఇరు వైపుల వెళ్ళాలంటే అనేక సమస్యలకు గురి కావల్సి వస్తుందని, ముఖ్యంగా పాదచారులు ఒకవైపు నుండి మరోవైపు వెళ్ళాలంటే చాలా దూరం నడిచి వెళ్ళాల్సి ఉంటుందని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. బస్టాండ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీప ప్రాంతాలలో మరో రెండు అండర్ పాస్ నిర్మాణాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, కనీసం పాదచారులు, ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు వెళ్ళేలా నిర్మాణం కోసం చొరవ తీసుకోవాలని వారు కోరారు. వినతి పత్రాన్ని సమర్పించిన వారిలో నాయకులు గుండాల నరేష్‌గౌడ్, మాస శ్రీనివాస్, కందాటి చంద్రారెడ్డి, ముక్కాముల పరమేష్, ఆగు అశోక్ తదితరులున్నారు.

**ఎంఎల్ఏకు విన్నపం:** ఇదే రోజు ఉదయం పట్టణానికి చెందిన అఖిల పక్ష పార్టీలు, వ్యాపారస్థులు, వివిధ వర్గాల ప్రజలు కలిసి అండర్ పాసింగ్‌ల నిర్మాణ విషయంపై స్థానిక శాసనసభ్యులు వేముల వీరేశంను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఎంఎల్ఏ ఈ విషయంపై మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డిని వెంటనే సంప్రదించి సమస్యను వివరించడం జరిగింది. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేస్తానని వారు హామీ ఇచ్చారు.

## మద్యపానాన్ని నిషేదించాలి

**ప్రజాపక్షం/మునగాల:** తెలంగాణ రాష్ట్రంలో తెలుగింటి ఆడపడుచుల పసుపు కుంకుమలను దోచుకుంటున్న మద్యాన్ని సంపూర్ణంగా నిషేదించాలని, లేనిచో బిసి ఉద్యమనేత ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో బిసి సంఘాల ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లోని సెక్రటరీయేట్‌ను ముట్టడిస్తామని బిసి విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో విఫరీతమైన మద్యం షాపులు, బెల్టుషాపులు వల్ల ఎంతోమంది యువకులు తాగుడుకు బానీసై చనిపోతున్నారని, కొంతమంది మద్యంసేవించి వాహనాలు నడపడం వల్ల యాక్సిడెంట్లు జరిగి అనేక మంది ప్రాణాలు గాలిలో కలిశాయని అన్నారు. దీంతో భార్యలు, తల్లిదండ్రులు, చిన్న పిల్లలు అనాధలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళ సంఘాలతో ఉద్యమాలు చేసి హైద్రాబాద్ సెక్రటరియేట్‌ను ముట్టడిస్తామన్నారు.

## సరస్వతి పుష్కరాలలో దొంతి కుటుంబం



**ప్రజాపక్షం/నెక్కొండ:** భూపాలపల్లి జిల్లాలోని కాలేశ్వరం పుణ్యక్షేత్రంలో సరస్వతి అంతర్వాహిని పుష్కరాలను నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి కుటుంబ సభ్యులతో హాజరై పుణ్య స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సరస్వతి అమ్మవారిని, కాలేశ్వరం మహాదేవుడిని నియోజకవర్గం ప్రజలు, వరంగల్ జిల్లా రాష్ట్రం ప్రజలు, సుభిక్షంగా ఉండాలని అందరూ మంచిగా ఉండాలని అందరూ కోసం స్వామి వార్లను వేడుకున్నట్టు ఆయన తెలిపారు.

## 198మంది గాను 187 మంది అభ్యర్థులు హాజరు



**ప్రజాపక్షం / వరంగల్ ప్రతినిధి :** గ్రామ పాలన అధికారి రాత పరీక్ష 2025 ఆదివారం ప్రశాంతంగా జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. వరంగల్ జిల్లాకు సంబంధించి వరంగల్ నగరంలోని ఇస్లామియా కళాశాల లో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రంలో 198 అభ్యర్థులకు గాను 187 మంది అభ్యర్థులు హాజరై పరీక్ష రాశారు. 12 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. గ్రామ పాలన ఆఫీసర్స్ పరీక్ష నిర్వహించిన ఇస్లామియా కళాశాల జిల్లా కలెక్టర్ సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇంతకుముందు రెవెన్యూ శాఖలో పనిచేసిన వీఆర్వోలు, విఆర్ఎలు గ్రామ పాలన ఆఫీసర్స్ పరీక్షను రాశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిఆర్ఓ విజయలక్ష్మి ,కలెక్టరేట్ ఎఒసత్య ప్రసాద్, తహసీల్దార్ ఇక్బాల్, చీఫ్ సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ విలువలను పెంపొందించడానికే పాదయాత్ర

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా జై భీమ్, జై బాపూ, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఆదివారం భూపాలపల్లి మున్సిపాలిటీలోని 20, 21, 22 వార్డులు హనుమాన్‌నగర్, శాంతినగర్, లక్ష్మీనగర్ కాలనీలల్లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జై భీమ్, జై బాపూ, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాపూ, అంబేద్కర్, రాజ్యాంగ పీఠిక చిత్రపటాలకు పూల మాల వేశారు. అక్కడున్న నాయకులతో రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. యాత్రనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ, మన దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. హనుమాన్ నగర్, శాంతినగర్, లక్ష్మీపూర్ కాలనీలల్లో యాత్ర మధ్యలో పలువురు కాలనీవాసులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆ సమస్యలను పరిష్కరించాలని అక్కడున్న మున్సిపల్ ఏఈ మానస కు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ముంజల రవీందర్ గౌడ్, చల్ల రేణుక, కాంగ్రెస్ నాయకులు రజనీకాంత్, ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** ఆడబిడ్డల పెళ్లిళ్లకు రాష్ట్ర ప్రభుత్వం అందించే ఆర్థిక చేయుత అని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం మండల కేంద్రం లోని తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రూ.40లక్షల, 4000, వేల, 640 రూపాయల, 40 మందికి చెక్కులు, ముఖ్యమంత్రి సహాయ నిధి, లబ్ధిదారులకు రూ.13 లక్షల 50వేల విలువగల చెక్కులను లబ్ధిదారులకు కడియం శ్రీహరి అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వారు పాల్గొని మాట్లాడుతూ, స్టేషన్‌ఘన్పూర్ నియోజకవర్గంలో ఒక లింగాల ఘ, ఏడాదిన్నర కాలంలో 241 మందికి సుమారు రెండు కోట్ల 41 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు వారు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వంపై, 8 లక్షల కోట్ల అప్పులు ఉన్నప్పటికీ వాటికి మిత్తీలు కట్టుకుంటూ, పేద ప్రజలకు సంక్షేమ పథకాలు ఆపకుండా సిఎం కొనసాగిస్తున్నారని, వారు తెలిపారు. ఆదాయం మించి ఖర్చులు ఉన్న ప్రజలకు ఇచ్చిన హామీలను, ఒక్కొక్కటిగా నెరవేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి, పేద ప్రజలకు ఉపయోగపడే పథకాలను అమలు చేస్తూ ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో రవీందర్, ఆర్ఐ కిషోర్, జనగామ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, కొల్లూరి శివకుమార్, మాజీ జెడ్పిటిసి, గుడి వంశీధర్ రెడ్డి, జనగామ మార్కెట్ కమిటీ డైరెక్టర్, నీలం మోహన్, కాంగ్రెస్ నాయకులు, బిట్ల, బాబు, పోరెడ్డి మల్లారెడ్డి, దూసరి గణపతి, మార్పు శ్రీనివాస్ రెడ్డి, విజయ భాస్కర్, కాటం కుమార్, కూకట్ల మల్లయ్య, బిట్ల శీను, గవ్వల మల్లేష్, నాగేందర్, కిష్టయ్య, ఉపేందర్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## విలీన గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తాం : ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వచ్చే ఎన్నికల నాటికి ప్రతి కాలనీలో చుక్క నీరు నిల్వకుండా చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపిఎస్ అధికారి కెఆర్ నాగరాజు అన్నారు. గురువారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ పరిధిలోని ఎస్ఆర్‌నగర్‌లో సుమారు రూ.50లక్షలు 15వ ఆర్థిక సంఘం నిధులతో రోడ్డు సైడ్ డ్రైన్, రోడ్డు ల నిర్మాణం కోసం నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి శంకుస్థాపన చేశారు. ఎన్టీఆర్‌నగర్ గ్రామంలో జిడబ్ల్యూఎంసి జనరల్ ఫండ్ రూ20 లక్షల నిధులతో సిసిరోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక ప్రజల అవసరాల దృష్ట్యా సమవుజ్జీగా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని అన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న క్రమంలో నిర్ణీత సమయంలో రోడ్లు, డ్రైన్ నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. అభివృద్ధి అనేది నిరంతరం కొనసాగుతుందని, ప్రజలందరూ ప్రభుత్వానికి అధికారులకు సహకరించాలని కోరారు. డివిజన్ లోని పలుసమస్యల తన దృష్టిలో ఉన్నాయని, ఒక్కొక్కటి అన్ని తీరుస్తానని అన్నారు. ప్రధాన సమస్యలు ఇళ్ళ పట్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఇప్పిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. అలాగే మీకు ఏ సమస్య ఉన్న తన దయాల్ యువర్ ఎమ్మెల్యే నెంబర్ 8096107107 కి ఫోన్ చేసి మీ సమస్య వివరిస్తే త్వరితన పని పూర్తి చేసే విధంగా కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య, డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, కాంగ్రెస్ నాయకులు సొరం చిన్నయ్య, బండ్ల సురేందర్, వరంగల్ భాషా, పురాణం రవి, పైసా మహేష్, స్థానిక గ్రామ పార్టీ అధ్యక్షుడు ముచ్చర్ల స్టాలిన్, ఈర్ల రాజేందర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపల్లి రాకేష్, కస్తూరి భరత్, పిట్ట సుధీర్,పాల్గొన్నారు.

## 26 నుంచి లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ ప్రారంభం

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్) నుండి లైసెన్స్ సర్వేయర్ శిక్షణకు అర్హత కలిగిన అభ్యర్థులు జిల్లా నుండి మొత్తం 225 మంది దరఖాస్తు చేసుకున్నారని ఈనెల 26 నుండి స్థానిక సీజేఐటీ కాలేజీలో శిక్షణ ప్రారంభం అవుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున అభ్యర్థులు ఈ శిక్షణకి ఒరిజినల్ డాక్యుమెంట్స్‌తో హాజరుకావాలని లేదంటే వారు కట్టిన ఫీజు వృథా అవుతుందన్నారు.

# కుంభమేళాను తలపించిన త్రివేణి సంగమ తీరం

- కాళేశ్వరం క్షేత్రానికి పోటెత్తిన భక్త జనం
- భక్తజన సంద్రంగా మారిన పుష్కర ఘాట్
- సోమవారంతో ముగియనున్న సరస్వతీ పుష్కరాలు







**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతి నిధి/ కాళేశ్వరం:**సరస్వతీ నమస్తుభ్యం పుష్కర స్నానం కరిష్యామి పుణ్య ఫలం సిద్ధిర్భవతుమే సదా॥ జయశంకర్ భూపాలపల్లి జిల్లా లో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో కొనసాగుతున్న 11వ రోజు సరస్వతీ పుష్కరాల సందర్భంగా వీకెండ్ ఆదివారం త్రివేణి సంగమ తీరానికి లక్షలాదిగా భక్తులు పోటెత్తడంతో సరస్వతీ నదీమాతల్లి పులకించిపోయింది. సరస్వతీ పుష్కరాలు చివరి ఘట్టం సోమవారంతో ముగుస్తుండగా పుష్కర స్నానాలకు తరలివచ్చిన భక్తజనం తాకిడి పెరిగి త్రివేణి సంగ మ పుష్కర ఘాట్ ప్రాంతమంతా ఇసుక వేస్తే రాలనంతగా దక్షిణ కుంభమేళాగా సంతరించుకుంది. తెలుగు రాష్ట్రాలతో పాటు సరిహద్దు మహారాష్ట్ర,ఛత్తీస్ ఘడ్, ఒడి శా తదితర దేశం నలుమూలల నుండి తెల్లవారుజాము నుండే క్షేత్రానికి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చి పుష్కర స్నానాలు ఆచరించారు. సరస్వతీ నదిమాతల్లి ఒడిలో భక్తుల పుష్కర స్నానాలతో భక్తి పారవశ్యంతో మునిగిపోయారు. పుష్కర స్నానాలు ఆచరించిన భక్తులు కాళేశ్వర ముక్తీశ్వర ఆలయ దర్శనానికి భక్తుల రద్దీ అంతకంతుకు పెరిగి భక్తజన జాతరగా మారింది. ఆదివారం వీకెండ్ సందర్భంగా పుష్కరాల భక్తుల రద్దీని అంచనా వేసిన అధికారయంత్రాంగం భక్తుల రద్దీకి అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా వాహనాల ను పార్కింగ్ స్థలాలలో నిలిపివేసిన అధికార యంత్రాం గం సరస్వతీ పుష్కర ఘాట్, గోదావరి ప్రధాన రహదారి, గ్రామ పంచాయతీ బైపాస్ మార్గాల ద్వారా త్రివేణి సం గమ పుష్కర ఘాట్ తీరానికి కాలినడకన ప్రయాణాలను మాత్రమే అనుమతించడంతో పిల్లలు,వృద్ధులతో భక్తులు సుమారు 3కిలోమీటర్ల మేర పుష్కర ఘాట్ తీరానికి కాలినడక ప్రయాణాలతో ఇబ్బందులు పడ్డారు. పు ష్కర స్నానాల అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర ఆలయం లో భక్తులు కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. శివనామస్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి ఆలయానికి భక్తుల రద్దీ భారీస్థాయిలో పెరగటంతో క్యూలైన్లు భక్తులతో బారులు తీరగా స్వామి వారి దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో గంటల కొద్ది వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. స్వామివారి దర్శ నంకో సంక్యూలైన్లలోభక్తులకు3నుండి4గం:సమయం పట్టింది.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో చివరి దశకు చేరుకున్న 11వ రోజు

### 10 కి.మీ మేర ట్రాఫిక్ జామ్

సరస్వతీ పుష్కరాల్లో భాగంగా ఆదివారం వీకెండ్ సందర్భంగా పుష్కర స్నానాలకు భక్తుల వాహనాల తాకిడి భారీగా పెరగడంతో పలు మార్గాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కాళేశ్వరం అన్నారం మార్గంలో సుమారు 10 కి.మీ మేర ట్రాఫిక్ జామ్ తో వాహనాలు ఎక్కడిక్కడే నిలిచిపోగా మరో మార్గమైన కాళేశ్వరంచెన్నూర్ మార్గంలో 8 కి.మీ మేర ట్రాఫిక్ జామ్ తో వాహనాలు స్థంభించిపోయాయి. వాహనాలకు గంటల కొద్ది ట్రాఫిక్ జామ్ కావడంతో భక్తులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. పిల్లలు, వృద్ధులతో పాటు భక్తులు తాగునీటి సౌకర్యం లేక అలమటించారు. అన్నారం మార్గంలోని పూస్కుపల్లి నుండి పుష్కర ఘాట్ మార్గంలో ఆర్డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల, డిటి కృష్ణ ఆధ్వర్యంలో మొబైల్ ఆటో ద్వారా భక్తులకు తాగునీటిని సరఫరా చేశారు.

## గుడిసెలు వేసుకున్న పేదలకు ఇందిరమ్మ ఇండ్లు

నేదునూరి రాజమౌళి డిమాండ్



**ప్రజాపక్షం / హసన్‌పర్తి :** సమాజంలో దోపిడీ పీడన, వివక్షత లేని నవ్య సమాజం కొరకు భారత కమ్యూనిస్టు పార్టీ వర్గ పోరాటాన్ని కొనసాగిస్తుందని, దున్నేవానికి భూమి దక్కాలని, కూడు, గూడు, నీడ, ఉపాధి, ప్రతి ఒక్కరికి దక్కాలని 100 సంవత్సరాలుగా నిర్విరామ క్రియాశీల పోరాటాలను కొనసాగిస్తున్న విప్లవ పోరాటాల చరిత్ర కలిగిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని సీనియర్ నాయకులు, మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు నేదునూరి రాజమౌళి తెలిపారు. ఆదివారం నార్లాపురం వెంక న్న అధ్యక్షతన ముచ్చర్ల క్రాస్ రోడ్ వద్ద జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో గుండ్ల సింగారం రాంపూర్, పెండ్యాల, శాయంపేట, పరకాల, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, ప్రాంతాలలో పది సంవత్సరాలుగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారికి నివాస స్థల పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డి మాండ్ చేశారు. సోమవారం నుండి హసన్‌పర్తిలో పార్టీ మహాసభలు ప్రారంభం కానున్నాయని, సోమవారం డాక్టర్ సోమశేఖర్ హాస్పటల్ నుండి ప్రభుత్వ హైస్కూల్ వరకు ప్రదర్శన నిర్వహించి హైస్కూల్లో సాయంత్రం 5 గంటలకు బహిరంగ సభ కర్రే బిక్షపతి హనుమకొండ జిల్లా సిపిఐ కార్యదర్శి అధ్యక్షతన జరుగుతుందని, ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర సిపిఐ సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరగుచున్నారని తెలిపారు. సమావేశానికి ముందు జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. ఈ సమావేశంలో మైసయ్య, బుర్క రాజు,నార్లాపూర్ వెంకట్, ఎల్లయ్య, శ్రీనివాస్,పోశయ్య, రహీం పాషా తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి సిపిఐ హనుమకొండ జిల్లా మహాసభలు

హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రే భిక్షపతి



**ప్రజాపక్షం/హనుమకొండ :** మే 26, 27 రెండు రోజులపాటు హసన్పర్తి మండల కేంద్రంలో జరుగుతున్న హనుమకొండ జిల్లా రెండవ మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి కర్రే భిక్షపతి కోరారు. హనుమకొండ బాలసముద్రంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి మాట్లాడారు. గత మూడు సంవత్సరాల కాలంలో జిల్లాలో పార్టీ పేదలు, కార్మికులు, మధ్యతరగతి ఉద్యోగస్తులు, వృత్తిదారులు, సామాజిక సమస్యలపై చేసిన పోరాటాలను సమీక్షించుకొని, భవిష్యత్తు పోరాటాలను రూపకల్పన చేసుకునేటందుకు రెండు రోజులపాటు మహాసభలను జరుపుకుంటున్నదని ఈ సందర్భంగా భిక్షపతి తెలిపారు. జిల్లాలోని 14 మండలాల్లో, పరకాల మున్సిపాలిటీ తో పాటు హనుమకొండ కార్పొరేషన్ పరిధిలో 5000కు పైగా ఉన్న పార్టీ సభ్యులు, 140 పార్టీ శాఖలకు, ప్రజా సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తూ 300 మంది పార్టీ శాఖ కార్యదర్శులు, మండల కమిటీ సభ్యులు, జిల్లా నాయకత్వం ఈ మహాసభలో పాల్గొంటున్నట్టు ఈ సందర్భంగా తెలిపారు. మొదటిరోజు సుమారు 5 వేల మందితో భారీ బహిరంగ సభను హసన్ పర్తి మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సభలకు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు , జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరవుతున్నట్లు తెలియజేశారు. ఈ మహాసభలను జయప్రదం చేయవలసిందిగా అన్ని తరగతుల ప్రజానీకానికి ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి విజ్ఞప్తి చేశారు.

## పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్లు



**ప్రజాపక్షం/జనగామ ప్రతి నిధి:** పేదల సొంతింటి కల ను సాకారం చేసేందుకు ప్ర భుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథ కం తీసుకొచ్చిందని జిల్లా క లెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో భాగంగా నిరుపేదలైన అర్హులకే ఇళ్లు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని,అందుకు అనుగుణంగా ప్రతి మండలంలోని ఒక గ్రామం చొప్పున గత జనవరి 26న ప్రభుత్వం ఈ పథకం లాంచనంగా ప్రారంభించిందన్నారు. బేస్‌మెంట్ స్థాయి వరకు నిర్మాణం పూర్తయితే రూ.1లక్ష, రూఫ్ లెవల్ స్థాయి దాటిన తర్వాత రూ.1లక్ష, స్లాబ్ పూర్తయితే రూ.2లక్షలు, మొత్తం పనులు పూర్తయ్యాక మిగిలిన రూ.1లక్షతో కలిపి మొత్తం రూ.5లక్షలను ప్రభుత్వం లబ్ధిదారులకు చెల్లిస్తుందన్నారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు లబ్ధిదారులు చింతకుంట్ల సరిత, సింగారం రేణుక, మాలోతు మోహన్, పోచంపల్లి శోభ, పానుగంటి హేమలతలు తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడంతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి పనులలో భాగంగా పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి,నగర మేయర్ గుండు సు ధారాణి 31 వ డివిజన్ హంటర్ రోడ్డులో గల నంది హిల్స్ లో రూ.40 లక్షలతో అంతర్గత రోడ్ల నిర్మాణం,59 వ డివిజన్ ఇందిరా నగర్,స్నేహ నగర్ లో రూ.62 లక్షలతో అంతర్గత రోడ్లు,సైడ్ డ్రైన్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు.అదే డివిజన్ లో ఎక్సైజ్ కాలనీలో సుమారు 80 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు.ఆదివారం దాదాపు 1.82 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. శిలాఫలకం ఏర్పాటు చేసిన కొబ్బరికాయ కొట్టిన ప్రతి అభివృద్ధి కార్యక్రమం నిర్ణీత సమయంలోనే పూర్తిచేస్తామని ప్రజలకు ప్రజా ప్రభుత్వం నిజమైన భరోసా ఇస్తుందని ఎమ్మెల్యే నాయిని తెలిపారు. నిత్యం పశ్చిమ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం,నూతన ఆవిష్కరణలు,అభివృద్ధి కార్యక్రమాలపై ముందుకు వెళ్తున్నామని ఎమ్మెల్యే అన్నారు.ఈ కార్యక్రమాలలో స్థానిక డివిజన్ ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు,కాలనీ వాసులు,ప్రజలు,పెద్దలు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా యుపిఎస్‌సి సివిల్ సర్వీస్ ప్రిలిమ్స్ పరీక్ష




**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండ జిల్లా లోని వివిధ పరీక్షా కేంద్రాలలో నిర్వహించిన యుపిఎస్‌సి సివిల్ సర్వీస్ ప్రిలిమ్స్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. 41 41మంది అభ్యర్థులు పది ప రీక్షా కేంద్రాలను కేటాయించగా ఉదయం 9:30 నుండి 11:30 గంటల వరకూ జరిగిన మొదటి సెషన్ పరీక్షకు 2435 మంది అభ్యర్థుల హాజరై పరీక్ష రాశారు.1706మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2:30 నుండి 4:30 గంటల వరకు జరిగిన రెండో సెషన్ పరీక్షకు 2422 మంది పరీక్ష రాశారు. 1719మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహిస్తున్న పలు పరీక్షా కేంద్రాలను హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సందర్శించారు. వడ్డేపల్లి లోని పింగళి ప్రభుత్వ మహిళా కళాశాల, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్ష తీరును పరిశీలించారు. పరీక్షా కేంద్రాలలోని ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షల నిర్వహణకు తీసుకున్న చర్యల గురించి ఆయా పరీక్షా కేంద్రాలకు సంబంధించిన అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

# గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం

- బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్న మద్యం వ్యాపారులు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు
- నిబంధనలు ఉల్లంఘింస్తున్నా చర్యలు శూన్యం

**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :**



జిల్లాలో మద్యం వ్యాపారం కొత్త పుంతలు తొక్కుతున్నది. ప్రభుత్వ నిబంధనలకు నీళ్లు వదిలి కాసుల వేటలో మద్యం ఏరులై పారుతున్నది. రిటైల్ మద్యం షాపులు దక్కించుకున్న మద్యం వ్యాపారులు రిటైల్‌గా ఎమ్మార్పీ రేట్లకు మద్యం అమ్మకాలు చేస్తే ఆదాయం తక్కువ వస్తుందని బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారు. బెల్టు షాపు నిర్వాహకులకు ఎమ్మార్పీ రేటు కంటే రూ. 20 నుంచి 30 ఎక్కువ ధరకు అమ్మడం వల్ల సామాన్యులు దోపిడీకి గురవుతున్నారు. మద్యం వ్యాపారుల క్రమ సంపాదనకు అధికారులు అండదండలు ఉన్నాయనే అనుమానం ప్రజల్లో నెలకొంది. జిల్లా వ్యాప్తంగా మద్యం షాపుల వ్యాపారులు సిండికేట్‌తో విచ్చలవిడి అమ్మకాలకు తెర లేపారు. మద్యం స్టాక్ వచ్చిన గంటలోనే బెల్టు షాపు నిర్వాహకులకు హోల్‌సేల్‌గా మద్యం అమ్మకాలు చేస్తూ సమయానికి ముందే వైన్ షాపులు మూసివేసి బెల్టు షాపుల వారికి సహకరిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిటైల్‌గా మద్యం అమ్మకాలు చేయాల్సిన వ్యాపారులు హోల్‌సేల్‌గా అమ్మడం అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందనేది బహిరంగ రహస్యం. ఎక్సైజ్ అధికారుల కనుసన్నల్లోనే 24 గంటల పాటు బెల్టు షాపుల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. ఓ వైపు ప్రభుత్వ వైన్ షాపుల్లో మరో వైపు బెల్టు షాపుల్లో అధిక రేట్లకు మద్యం విక్రయాలు జరుగుతున్నా ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రజలు సూటిగానే ప్రశ్నిస్తున్నారు. ఒక్కో మండలంలో గ్రామపంచాయతీల్లో దాదాపు 200పై చిలుకు బెల్టు షాపులు ఉన్నాయంటే అధికారుల అండ దండలు మద్యం వ్యాపారులకు ఎంతలా ఉన్నాయో అర్థం అవుతుంది. ఎక్కడపడితే అక్కడ తాగినోడికి తాగినంత.. మందు మస్తుగా దొరుకుతున్నదని.. ఏ ఊర్లో చూసినా, ఏ గల్లికి వెళ్లినా బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా మద్యాన్ని బహిరంగంగా విక్రయిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఎక్కడ చూసినా వైన్ షాపు టూ వయా బెల్టు సాపుల అక్రమ రవాణాతో అక్రమ దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా విరాజిల్లుతున్నది. ఈ విషయంలో సంబంధిత ఎక్సైజ్ అధికారులు నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనపడుతోందని ప్రజలు బాహాటంగానే చర్చించుకుంటున్నారు.

### చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

పట్టపగలే బెల్టు సాపులకు మద్యం తరలివెళ్తున్నా తెలిసినప్పటికీ మద్యం అక్రమ విక్రయాల పట్ల ఎక్సైజ్ అధికారులు తమకేమీ పట్టవు అన్నట్లు గాఢ నిద్రలో మునిగిపోయారని విక్రయిస్తున్నారు. మరోవైపు బెల్టు షాపుల వల్ల మద్యపానం వినియోగం పెరగడమే కాకుండా నియంత్రణలేని మద్యం అమ్మకాలతో అనేక మంది అనారోగ్యం బారినపడి అప్పుల పాలవుతున్నారని, ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు బెల్టు షాపుల వల్ల ఆకతాయిల వల్ల మహిళలు వేధింపులకు గురవుతారని, అల్లరి మూకలు పెట్రేగిపోతున్నారని అందువల్ల బెల్టు షాపులను ఎక్కడకక్కడ కట్టడి చేయాలని కోరుతున్నారు. ప్రజల ఫిర్యాదులకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేసి వీటిపై కఠినంగా వ్యవహరించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మద్యం అక్రమ దందాను నియంత్రించి, నిబంధనలను పాటించని వైన్ దుకాణాలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

### ఫంక్షన్ హాళ్లను తలపిస్తున్న పర్మిట్ రూమ్‌లు

ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారం వైన్ షాపులకు కేటాయించిన పర్మిట్ రూములు కేవలం మందు బాబులు నిలబడి తాగి వెళ్లేలా ఉండాలి కాని జిల్లా కేంద్రంలోని ప్రముఖ స్థలాలలో వైన్ షాపుల యాజమానులు పర్మిట్ రూమ్ ఏకంగా ఫంక్షన్ హాలు సైజులో నిర్మించి బార్లలో మాదిరిగా ముందు బాబులకు సకల సౌకర్యాలు కలిపిస్తున్నారు. ఇలా నిబంధనలకు విరుద్ధంగా పలు వైన్ షాపుల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వీటిని నియంత్రించాల్సిన ఎక్సైజ్ అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకోవడం లేదని, కనీసం ఆయా ప్రాంతాలలో తనిఖీలు కూడా చేపట్టడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి

## అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత

**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం:** అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 10 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న సంఘటన మండల పరిధిలోని దమ్మాయిగూడెం పిండిప్రోలు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దమ్మాయిగూడెం గ్రామానికి చెందిన వడ్డెబోయిన నరేష్ ఇంటి ముందు గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 10 క్వింటాళ్ళ రేషన్‌బియ్యం నిల్వ ఉంచగా సమాచారం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ సిఐ కిరణ్‌కుమార్ తన సిబ్బందితో రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిల్వ ఉంచిన గుర్తు తెలియని వ్యక్తుల వివరాల కోసం స్థానికులను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం నిరుపేదల కోసం సన్నబియ్యాన్ని అందిస్తుడటంతో అక్రమ రేషన్ బియ్యం దందా సాగుతుందని, సివిల్ సప్లయి, రెవెన్యూ అధికారులు, పోలీసులు అక్రమ రేషన్ బియ్యాన్ని అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## రామయ్యను దర్శించుకున్న ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



**ప్రజాపక్షం/భద్రాచలం:** శ్రీసీతారామ చంద్ర స్వామివారి ఆలయాన్ని ఎంఎల్‌సి అద్దంకి ద.యాకర్ ఆదివారం సతీ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదలప్రకారం స్వాగతం పలికారు. గర్భగుడిలోని స్వామికి ప్రత్యేక పూజలు చేసిన ఆయన ఆలయం ప్రాంగణంలోని శ్రీ లక్ష్మీ తాయారమ్మ వారు, అభయాంజనేయ స్వామివర్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ విశిష్టత గూర్చి అర్చక స్వాములు వారికి వివరించారు. ఆలయం తరుపున షాలువ కప్పి సత్కరించి జ్ఞాపికను అందజేసారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు ఉన్నారు.

## ఉద్యోగులకు ఆటవిడుపు ఎంతో హాయినిస్తుంది

### ఐటిడిఒ రాహుల్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** నిత్యం ఉద్యోగ విధుల్లో సతమతమవుతూ, కనీసం కుటుంబానికి కూడా సమయాన్ని వెచ్చించే తీరకలేని ఉద్యోగులు సరదాగా ఒక రోజు ఆటవిడుపు గా క్రీడలు ఆడుకోవడం ఎంతో హాయినిస్తుందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. ఆదివారం పాల్వంచలోని కిన్నెరసాని క్రీడా మైదానంలో ఉద్యోగులతో కలిసి ఆయన క్రికెట్ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ కార్యాలయంలో పనిచేసే అధికారులతో పాటు సిబ్బంది విధి నిర్వహణలో అలసి సొలసిపోతున్నారని, సరదాగా నిర్వహించుకునే ఇలాంటి క్రీడలు ఎంతో సంతోషాన్ని ఇస్తాయని చెప్పారు. శారీరక, మానసిక ఒత్తిడి నుండి ఉపశమనం ఉంటుందని, అప్పుడప్పుడు ఇలాంటి క్రీడల్లో పాల్గొంటూ సిబ్బంది హాయిగా గడపాలని చెప్పారు. స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాలరావు నేతృత్వంలో నిర్వహించిన ఈ పోటీలో విన్నర్స్, రన్నర్స్‌కు, ఆటలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి పిఓ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట ఏటిడిఓ చంద్రమోహన్, ఏఎస్ఓ వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/కొణిజర్ల :** ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొని బైక్ పై ప్రయాణిస్తున్న వ్యక్తి చనిపోయిన సంఘటన మండల కేంద్రం కొణిజర్ల లో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం మండల పరిదిలోని పెద్దరాంపురం గ్రామానికి చెందిన ఇనపనూరి నాగేశ్వరరావు (35) కూతుర్ని ఖమ్మంలోని ఓ ఆసుపత్రిలో చేర్పించి డబ్బులు తీసుకెళ్లేందుకు తన ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా మండల కేంద్రం కొణిజర్ల పోలీస్ స్టేషన్ సమీపంలో మధిర నుంచి ఖమ్మం వెళుతున్న ఆర్టీసి బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య సుష్మ, కూతుళ్లు ప్రియ, ప్రసన్న, అక్షయ ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## 8న ఆర్యవైశ్య మహాసభ నూతన కమిటీ ప్రమాణం



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆర్యవైశ్య మహాసభ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం జూన్ ఎనిమిదిన కల్లూరులో జరుగుతుందని ఆర్యవైశ్య మహాసభ ఖమ్మంజిల్లా అధ్యక్షులు పసుమర్తి చందర్‌రావు తెలిపారు. ఆర్యవైశ్య మహాసభ నూతన కమిటీ ప్రమాణస్వీకారం ఏర్పాట్లు, తదితర విషయాలపై చర్చించేందుకు ఆదివారం ఖమ్మం వాసవీమాత ఆలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో చందర్‌రావు మాట్లాడుతూ వెనకబడిన ఆర్యవైశ్యులకు న్యాయం జరిగేవిధంగా సంక్షేమ కార్యక్రమాలు ప్రభుత్వం నుంచి అందేలా కృషి చేస్తామన్నారు. మహాసభ కమిటీ ప్రమాణస్వీకారానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మి నారాయణ, అతిథులుగా ధన్‌వాల్ సూర్యనారాయణ, జగ్గయపేట శాసనసభ్యులు శ్రీరాం తాతయ్య, సుజాత గుప్తా, ఉప్పల శారద తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం నగర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు వనమా సూరి, ప్రధాన కార్యదర్శి , తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్‌పై పరిశోధనకు డాక్టరేట్

### అంతర్జాతీయ స్థాయిలో ప్రవీణ్‌కుమార్‌కు ప్రశంసలు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** క్యాన్సర్ వైద్యం పై పరిశోధన చేసినందుకు కన్నెకంటి ప్రవీణ్‌కుమార్ డాక్టరేట్ సాధించారు. ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లి గ్రామానికి చెందిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల దమ్మపేట ప్రిన్సిపాల్ డా।। కన్నెకంటి వెంకటేశ్వర్లు కుమారుడు కన్నెకంటి ప్రవీణ్ కుమార్ ప్రొ।। టి. నర్సింహాస్వామి పర్యవేక్షణలో హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్స్ సైన్సెస్ (ఐఐసిటి), సెంటర్ ఫర్ సెక్యూలర్ అండ్ మాలిక్యూలర్ బయాలజీ (సిసిఎంబి) సహకారంతో ప్రవీణ్‌కుమార్ చేసిన పరిశోధనలు ఉత్తమ ఫలితాలు ఇవ్వడంతో డాక్టరేట్ అందుకున్నారు. అంతేకాకుండా క్యాన్సర్ వ్యాధి ట్రీట్‌మెంట్‌లో వాడే మందులపై తాను చేసిన ప్రయోగాలను ఇంటర్నేషనల్ జర్నల్స్‌లో ప్రచురించి అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందారు. ప్రస్తుతం క్యాన్సర్ వైద్యంలో వాడుతున్న మందుల కంటే తాను సూచించిన రసాయనాల మిశ్రమాన్ని తగు మోతాదులో వాడితే క్యాన్సర్ వ్యాధిని సమర్థవంతంగా ఎదుర్కొనవచ్చునని శాస్త్రీయంగా నిరూపించినట్లు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ప్రవీణ్‌కుమార్‌ను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐఐసిటి, సిసిఎంబి పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత పోలీస్ అధికారులకు ఉచిత హెల్త్ క్యాంపు




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విశ్రాంత పోలీస్ అధికారులకు ఉచిత మెగా హెల్త్ క్యాంపును నిర్వహించారు. ఖమ్మం నగరంలోని డాక్టర్ గణేష్ ఎండోకేర్ ఆసుపత్రిలో విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్. రాధాకృష్ణమూర్తి, రుద్ర వెంకటనారాయణ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘం గౌరవాధ్యక్షులు, మాజీ ఎంఎల్ఏ లావుడ్యా రాములు నాయక్ హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్ మాట్లాడుతూ విశ్రాంత పోలీస్ అధికారులకు వారి జీవిత భాగస్వాములకు, కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఖమ్మంజిల్లాలో తనది మొట్టమొదటి ఎండోకేర్ ఆసుపత్రి అని విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు షుగర్ వ్యాధి పెరగకుండా నియంత్రణలో ఉంచుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్‌ను సన్మానించారు.ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు ఎస్ సంజీవరావు, నాగేశ్వరరావు, రిటైర్డ్ సిఐలు, ఎస్ఐలు, ఎఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు నీరు..నీడ..మెడికల్ కిట్టు ఎక్కడ?

### ప్రాణాలు పోతేనే వసతులు కల్పిస్తారా?

### ఎండకు ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఉపాధి కూలీలు



**ప్రజాపక్షం/వైరా:** ఉపాధి కూలీలకు నీరు లేదు. నీడ లేదు. ఉపాధి కూలీలకు ఉపాధి పనులు వద్ద ఎలాంటి భద్రత లేదు. కనీస వసతులు కూడా కరువయ్యాయి. ఉపాధి పనికి వెళ్లిన కూలీలకు ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పని చేసే ప్రాంతంలో త్రాగునీరు ఉండదు. నిలవడానికి నీడ ఉండదు. ప్రమాదం జరిగితే మెడికల్ కిట్టు ఉండదు. ఇది ఉపాధి కూలీల పరిస్థితి. ఇంటి నుంచి పనికి వెళ్లే ఉపాధి కూలీలు వారి వెంట లీటర్ నుండి రెండు లీటర్ల త్రాగునీరుని తీసుకొని పోతారు. పనిచేసే సమయంలో అవి ఎక్కడ అయిపోతాయి అని కొసిరి కొసిరి వాటిని తాగుతూ ఉంటారు. కొద్దిసేపు ఎక్కడైనా స్వేదతీర్చుకుందాం అని అనుకుంటే నీడ కరువైంది. పనుల వద్ద కనిపించని టెంట్లు. దీంతో ఎండలోనే ఆ పొలం వద్ద కూర్చొని పరిస్థితి వారికి ఏర్పడింది. సరైన మెడికల్ కిట్లు కూడా ఉపాధి పని వద్ద కనిపించడం పోవడం జరుగుతుంది. ప్రతి గ్రామంలో పెద్ద ఎత్తున ఉపాధి పనికి పోతూ ఉన్నారు. పని వద్దకు వెళ్లిన కూలీలకు ఎండ తీవ్రతతో డిహైడ్రేషన్ అయితే అక్కడ వారికి అందించడానికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా అందుబాటులో ఉండటం లేదు. ఇలా చెప్పుకుంటూ పోతే ఉపాధి కూలీలకు నీరు నీడ వైద్యం అందుబాటులో లేదని చెప్పవచ్చును. గత కొన్ని నెలలుగా ఉపాధి కూలీల వద్ద ఏర్పాటు చేయాల్సిన టెంటు సరఫరాలు కూడా నిలిపివేశారు. ఎవరైనా ప్రశ్నిస్తే దానికి సమాధానం ఉండదు. దీనిపై పట్టించుకోవాల్సిన అధికార యంత్రాంగం ఏమైపోతుంది. ఉపాధి పని వద్ద త్రాగునీటి సరఫరా చేయాల్సిన బాధ్యత ఎవరిది? కూలీలు స్వేదతీర్చుకునేందుకు నీడను కల్పించాల్సిన బాధ్యత ఎవరిది? ఏదైనా ప్రమాదం జరిగితే అక్కడ ఫస్ట్ ఎయిడ్ చేసేందుకు కావాల్సిన మెడికల్ కిట్టు ఏమైంది? గత కొన్ని రోజులుగా ఎండలు విపరీతంగా మండిపోతున్నాయి. ఈ ఎండలకు ఉపాధి కూలీలు ఉక్కిరిబిక్కిరితో అల్లాడిపోతున్నారు. పనికి పోకుండా ఉండాలంటే ఆర్థిక ఇబ్బందులు గుర్తు చేస్తున్నాయి. గ్రామాల్లో జరిగే ఉపాధి పనుల వద్ద పర్యవేక్షించాల్సిన బాధ్యత మండలంలో ఎవరిది? ఆయా మండలాల్లో ఉపాధి హామీ అధికారులు ఏమైపోతున్నారు. కేవలం ఫీల్డ్‌అసిస్టెంట్‌లకే బాధ్యతలు ఇస్తున్నారే తప్ప ఆ ఫీల్డ్ అసిస్టెంట్‌లకు వసతుల గురించి ఎందుకు ఆదేశాలు ఇవ్వడం లేదు. దీనిపై ఎందుకు మౌనం వహిస్తున్నారు. ఉపాధి పని వద్ద కూలీలు ప్రాణాలు పోతేనే స్పందిస్తారా ఒక్కసారి ఆలోచించండి. ఉపాధి పనికి పోయిన ప్రతిఒక్కరికి అన్ని వసతులు ఏర్పాటు చేసేవిధంగా ఉండాలి. వారి ఆరోగ్యానికి భద్రత ఇచ్చే విధంగా అధికారులు పనితీరు కనిపించాలి. వారు ఆరోగ్యంగా లేకపోయి ఏదైనా ప్రమాదం అక్కడ జరిగితే ఆ కుటుంబ పరిస్థితి ఏ విధంగా ఉంటుంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు సంబంధిత ఉపాధిహామీ అధికారులు, ఉపాధి పనుల వద్ద కూలీలకు త్రాగునీరు నీడ వైద్యసేవలు మెడికల్ కిట్లు ఏర్పాటు చేసే వారికి అండగా నిలవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## ములకలపల్లిలో పర్యటించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండలంలో అశ్వారావుపేట ఎంఎల్ఏజారే ఆదినారాయణ పర్యటించారు. మండలంలోని తాళ్ళపాయ పంచాయితీ రింగిరెడ్డిపల్లి గ్రామంలో గ్యాంగ్ వార్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చౌటుగూడెం గ్రామంలో జరుగుతున్న శ్రీశ్రీశ్రీ వీర్ల అంకమ్మ తల్లి నాగులమ్మ తల్లి రాజు గౌడుగులు జాతర మహోత్సవంలో పాల్గొన్నారు. గ్రామస్తులు ఆయనకు శాలువాతో సన్మానించి, ఘనంగా స్వాగతం పలికారు. మార్గమధ్యలో ఉన్న పాములేరు పనులు పూర్తి కావస్తున్న చప్టాను ఆయన సందర్శించారు. వర్షాకాలంలో వర్షాలు పెరగకముందేచప్టాప్రజలకు అందుబాటులో తేవాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలో జరుగుతున్న సెంట్రల్ లైటింగ్ పనులను పరిశీలించారు. మురుగు నీరు ఎక్కడ నిల్వ ఉండకుండా చూడాలని విద్యుత్ శక్తిగా అంతరాయం కలగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్యాంగ్ వార్ యూత్ వాలీబాట్ టోర్నీ నిర్వాహకులు కొంద్రు అనిల్, చౌటుగూడెం ఆలయ కమిటీ పూజారి కాక ఆదినారాయణ స్వామి, అశ్వారావుపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పాలకుర్తి సుమిత్, ములకలపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొడిమ వంశీ, అడ్వకేట్ ఊకే రవి, పాత్రికేయులు , ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

## బాలరాజు మృతికి డిప్యూటీ సిఎం భట్టి నివాళి



**ప్రజాపక్షం/మధిర:** మధిర మండలంలోని ఆత్కూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఎస్సీసెల్ మండల అధ్యక్షులు దారా బాలరాజు (52) గుండెపోటుకు గురై అకాల మృతి చెందారు. ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంపై ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో అకస్మాత్తుగా గుండెపోటుకు గురై కింద పడినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. బాలరాజు అకామృతి పట్ల డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతి వార్త తెలుసుకున్న వెంటనే హైద్రాబాద్ నుండి బయలుదేరి ఆత్కూరు గ్రామానికి చేరుకుని దారా బాలరాజు పార్థిదేహాన్ని ఆయనతో పాటు సతీమణి మల్లు నందిని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపి ఓదార్చారు. దారా బాలరాజు అకాల మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ఇతర పార్టీల నాయకులు దారా బాలరాజు పార్థదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, అభిమానులు, ఆత్కూరు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతాం:ఎమ్మెల్యే మట్టా



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** జంగాల కాలనీ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతామని సత్తుపల్లి శాసన సభ్యురాలు డా. మట్టా రాగమయి అన్నా రు. పట్టణంలోని 13 వ వార్డ్ జవహర్ నగ ర్‌లోగల జంగాల కాలనీలో రూ . 14 లక్షలతో ఏర్పాటు చేస్తున్న సు మా రు 80 విద్యుత్ స్థంభాలకు కాలనీ వాసులతో కలిసి ఎమ్మెల్యే రాగమయి శనివారం రాత్రి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా జంగాల కాలనీ అభివృద్ధికి నోచు కోక చీకటిమయమైందని, గత ఎన్నికల్లో వారికి ఇచ్చిన మాట ప్రకారం వారి కాలనీకి, కాలనీ ప్రజల జీవితాల్లోకి వెలుగులు నింపే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. పేదల ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని, తమను గెలిపించిన, తమపై నమ్మకంతో ఓటు వేసిన ప్రతి ఒక్కరికి అభివృద్ధి , సంక్షేమ పథకాలు అందేలా చేస్తామన్నారు. సత్తుపల్లి మార్కెట్ కమిటి చైర్మన్ , సత్తుపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ , సీనియర్ నాయకులు , మున్సిపల్ కమీషనర్ , విద్యుత్ శాఖ డిఈ రాములు,ఎఇ శరత్, జవహర్ నగర్, జంగాల కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కాటా తనిఖీ: సిపిఐ డిమాండ్




**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు లోని ఆదివారం నాడు సిపిఐ కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి అయోధ్యతో మణుగూరు కోల్ ట్రాన్స్పోర్ట్, లారీ ఓనర్స్ అసోసియేషన్ వారు కలిసి లారీఓనర్లు జరుగుతున్న అవకతవకల మీద, లోడింగ్ విషయాల మీద చర్చించి వారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా బి అయోధ్య మాట్లాడుతూ సింగరేణి లో భూములు ఇండ్లు కోల్పోయినటువంటి అనేక మంది నిర్వాసితులు, ఇతరులు ఫైనాన్స్ తీసుకొచ్చి లారీలు కొనుక్కొని సింగరేణి ద్వారా బొగ్గు సరఫరా చేస్తూ జీవనం సాగిస్తున్నారని, సింగరేణి లోడింగ్ సరిగా లేకపోవడం మూలంగా లారీ ఓనర్లు ఫైనాన్స్ కట్టలేక పోవడంతో అనేకమంది లారీలను లాక్కెళ్లడం జరుగుతుందన్నారు. లోడింగ్ సరిగా లేకపోవడం వలన పర్మిట్ తీసుకురాలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మణుగూరులో కాటా లారీ బొగ్గు లోడింగ్ చేసి సీల్ వేసి లేబుల్ ప్రకారం కంపెనీ కి బొగ్గు పంపిస్తే అక్కడ అన్లోడ్ చేసే దగ్గర కాటా వేస్తే తేడా వస్తుందని సుమారు 4, లేక 5 వేల రూపాయలు లాస్ వస్తుందని సుమారు 6 కంపెనీలలో ఇదే పరిస్థితి నెలకొందని దీనివలన ట్రాన్స్పోర్ట్ ఇబ్బంది పడుతున్నారని కావున సంబంధిత సింగరేణి అధికారులు దీనిపై దృష్టి సారించి పరిశీలించాలని, బొగ్గు సప్లై చేసిన సరైన టైంలో ఓనర్లకు కిరాయిలు ఇవ్వకపోవడం వలన అనేక ఇబ్బందులు పడుతున్నారని కావున వీటన్నింటి పైన మణుగూరు సింగరేణి జిఎం, ఉన్నతాధికారులు పరిశీలించి వీరికి న్యాయం జరిగేలా చూడాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ పినపాక నియోజకవర్గం కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మణుగూరు పట్టణ కార్యదర్శి దుగ్గ్యాల సుధాకర్, మణుగూరు కోల్ ట్రాన్స్పోర్ట్, లారీ ఓనర్స్ అసోసియేషన్ ,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్‌టిఐ కమిషనర్‌ను కలిసిన కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** ఆర్‌టిఐ కమీషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టి జిల్లాకు విచ్చేసిన పివి శ్రీనివాస్‌ను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదివారం స్థానిక సింగరేణి గెస్ట్‌హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు మొక్కను బహుకరించారు. జిల్లాకు మొదటి సారి విచ్చేసినందుకు జిల్లా ప్రజల తరుపున కృతజ్ఞతలు చెప్పారు

## నర్సరీలను వదిలేశారా?

### వృధా అవుతున్న ప్రజా ధనం

### ఎండిపోతున్న మొక్కలు



**ప్రజాపక్షం/ఖమ్మం :** గత ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీలోనూ నర్సరీలను ఏర్పాటు చేసి నర్సరీలలో పెంచిన మొక్కలను హరితహారం కార్యక్రమానికి ఉపయోగించే వారు. గ్రామాల్లో, పట్టణాల్లో నర్సరీల ద్వారా పెంచిన మొక్కలే హరితహారంలో ఉపయోగించే వారు. ప్రతి గ్రామ పంచాయతీలోనూ మిగిలిన వ్యవహారం ఎలా ఉన్న నర్సరీల నిర్వహణ మాత్రం ఫర్వాలేదనిపించే స్థితిలో ఉంది. కానీ ఇప్పుడు గ్రామ పంచాయతీల పాలక వర్గాలు లేకపోవడం ప్రభుత్వానికి కూడా నర్సరీలపై కూడా అంతగా దృష్టి లేక పోవడంతో నర్సరీలు ఎండిన మొక్కలతో వెలవెలపోతున్నాయి. ప్రత్యేకాధికారులు నర్సరీల గురించి పట్టించుకునే స్థితిలో లేరు. ఇప్పటికే ప్రతి నర్సరీకి వేలాది రూపాయలు ఖర్చు చేసినా సంరక్షణ లేక మొక్కలు ఎండిపోతుండడంతో ప్రజా ధనం వృధా అవుతుంది. నర్సరీని పట్టించుకునే వారు లేక సంరక్షణ కరువై మొక్కలు ఎండిపోతున్నాయి. ఒకవేళ నర్సరీల సంరక్షణ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంటే నర్సరీలను నిర్లక్ష్యానికి వదిలేసినా అధికారులపై తగు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

## ఆరెకోడుతండాలో విషాదం...

### విషతుల్యమైన మేతతిని సుమారు 50 జీవాలు మృతి

### ఘటనా స్థలాన్ని పరిశీలించిన సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్, సిపిఐ శ్రేణులు * ఆదుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి విజ్ఞప్తి





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** పొలంలో మేతకు వెళ్లిన 50జీవాలు మృతి చెందిన విషాదకర సంఘటన ఖమ్మం రూరల్ మండలంలోని ఆరెకోడుతండలో ఆదివారం చోటు చేసుకుంది.గ్రామానికి చెందిన మాలోత్ హరిదాస్, బానోత్ బాలాజీ, బోడ సరస్వతి, బానోత్ రామ్లా, మాలోత్ గోపి, గుగులోత్ కిరణ్, బానోత్ శంకర్‌తో పాటు తదితరులకు చెందిన సుమారు 600ల జీవాలను రోజువారిలాగానే మేతకు తోలారు. కాగా అవి ఆ గ్రామానికి చెందిన ఓ రైతు బెండతోటలో మేస్తునే నురుగలు కక్కుంటూ కింద పడిపోయాయి. మృతి చెందిన జీవాలను అక్కడే వదిలేసి, ఊపిరితో కొట్టుకుంటున్న జీవాలను ఖమ్మంలోని పశువైద్యశాలకు తరలించారు. గమనించి వైద్యులు విషతుల్యమైన ఆహారం తినడం వలన మృత్యువాత పడినట్టుగా తెలిపారు. జరిగిన ఘటనతో జీవాలను కోల్పోయిన బాధితులు కన్నీరు మున్నీరుగా విలపించారు. జీవాలను కోల్పోయి తమ బ్రతుకులు రోడ్డున పడ్డాయని, ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమపై దయచూపి నష్టపరిహారం అందించాలని వేడుకున్నారు.

**ప్రభుత్వం బాధితులకు న్యాయం చేయాలి...దండి**

తమ జీవనాధరమైన జీవాలను కోల్పోయిన నిరుపేద గిరిజనులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. తమ జీవనాధరమైన జీవాలు కోల్పోయిన గిరిజనులకు సీఎం సహాయనిధి నుంచి తక్షణమే ఆర్థిక సాయం అందించాలన్నారు. అలాగే మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ తరుపున తమ వంతుగా వారికి ఆర్థికసాయం అందిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజ్మీరా రామ్మూర్తి నాయక్, జిల్లా సమితి సభ్యులు యడ్లపల్లి శంకరయ్య, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మండల సమితి సభ్యులు ఏలూరి భాస్కర్,సిపిఐ శాఖ నాయకులు మోహన్‌చంద్ర, మల్సూర్, సీతారాములు, హరిదాస్, శివ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**జీవాల రైతులకు న్యాయం చేయండి**

**సిపిఐ నేత బాగం**

ఆరెకోడు తండాలో విషహారం తిని పదుల సంఖ్యలో జీవాలు మృతిచెందాయని, ఆ రైతులకు న్యాయం చేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఖమ్మం రూరల్ మండలం ఆరెకోడు తండాలో విషహారం తిని వందల సంఖ్యలో జీవాలు అనారోగ్యానికి గురి కాగా అందులో 70 జీవాలు మృతిచెందాయి. రైతులు విషహారం తిని అనారోగ్యానికి గురైన జీవాలను ఖమ్మం రాపర్తి నగర్‌లోని పశువుల ఆసుపత్రికి తరలించారు. కడుపు ఉబ్బి వెంటనే ప్రాణాలను కోల్పోయి. ఆసుపత్రికి బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రైతు సంఘం బాధ్యులు యడ్లపల్లి శంకరయ్య తదితరులు చేరుకుని రైతులను ఓదార్చారు. వైద్యులతో మాట్లాడారు. జీవాల మృతికి పోస్టుమార్టం చేస్తే తప్ప కారణం చెప్పలేమన్నారు. ఆరెకోడు తండాలో 20 కుటుంబాలకు చెందిన రైతులు సుమారు 300 జీవాలను కలిపి మేతకు తోలుకుని వెళ్లారు. జీవాలు ఏమి తిన్నాయో కానీ కడుపుఉబ్బి 70 వరకు చనిపోగా మిగిలినవి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ జీవాల రైతులందరూ నిరుపేదలని జీవాలపై ఆధారపడి జీవిస్తున్నారని ప్రభుత్వం తక్షణం పరిహారం అందించి తిరిగి జీవాలు కొనుగోలు చేసుకునేందుకు ఆర్థిక సాయం అందించాలని హేమంతరావు కోరారు. బాధిత రైతులను సిపిఐ నాయకులు ఓదార్చారు.

ఫోకస్

# ఆరోగ్యం



బాలల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో తల్లిదండ్రులు, గురువులు కీలక పాత్ర పోషించాలి..

## బాలల వికాసం..

'నేటి బాలలే రేపటి పౌరులు' అనేది నిత్యం అంటున్న... వింటున్నదే అయినప్పటికీ, నిజంగానే బాలల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తున్నామా అన్నదే ప్రశ్న. బాలల ఆరోగ్యం అనేది 0 నుండి 18 సంవత్సరాల వయస్సు వరకు ఉన్న పిల్లల శారీరక, మానసిక, సామాజిక, భావోద్వేగ శ్రేయస్సును సూచిస్తుంది. ఈ వయస్సు వారిలో ఆరోగ్యకరమైన అభివృద్ధి మన దేశ భవిష్యత్తుకు మూలస్తంభంగా నిలుస్తుంది. బాలల ఆరోగ్యానికి ముఖ్య అంశాల్లో మొదటిది శారీరక ఆరోగ్యం. పిల్లలకు ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉన్న ఆహారం అవసరం. పాలు, పండ్లు, కూరగాయలు, గింజలు వంటి పోషకాహారం అవసరం. టీకాలు సమయానికి వేయించడం ద్వారా అనేక వ్యాధుల నుండి రక్షణ కల్పించాలి. ఆటలద్వారా శరీరం తదుపరి అభివృద్ధికి ఉపకరిస్తుంది. ఇలాంటి ప్రయత్నం పిల్లలకు తప్పక ఉండాలి. వయస్సు పెరుగుతో ఆటలకు దూరం చేయడం తరచు పెద్దలు చేస్తున్న అతిపెద్ద నేరం. చేతులు కడుక్కోవడం, శుభ్రత పాటించడం వంటి ఆరోగ్య సూత్రాలను చిన్నప్పటి నుండే నేర్పించడం కూడా అవసరమే. ఇక రెండోది మానసిక ఆరోగ్యం. పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంచేలా మాట్లాడాలి. ఒత్తిడి లేదా భయాల కారణంగా పిల్లలు నలుగురిలో కలవలేకపోతే, ఆ విషయాన్ని గుర్తించి సానుకూలంగా స్పందించాలి. వారికి ధైర్యం చెప్పి, దీనిని దూరం చేయాలి. ఆడుకోవడం, క్రియాశీలంగా ఉండటం మానసిక ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇతరులతో మెరుగైన సంబంధాలు పెంచుకోవడం, స్నేహితులతో కలసి ఆటలు ఆడడం, పాఠశాలలో అనుసంధానం పెంచుకోవడం, సమాజంలోని విలువలు నేర్చుకోవడం పిల్లలకు అవసరం. ఈ విషయాల్లో పెద్దలే మార్గదర్శకం చేయాలి. బాలల ఆరోగ్య సమస్యలు (సాధారణంగా ఎదురయ్యేవి) విషయానికి వస్తే, ఎక్కువ మంది పోషణ లోపం (malnutrition)తో బాధపడుతుంటారు. అంతేగాక, గర్భస్థ స్థాయి నుండి తగిన సంరక్షణ లోపం కూడా ఉంది. వ్యాధులు (అంటు వ్యాధులు, సాంప్రదాయ వ్యాధులు) తరచు పిల్లలను వేధిస్తుంటాయి. ఇటీవల కాలంలో, మానసిక ఒత్తిడి, ఉత్సాహం లోపం పెరిగాయి. బాల్యవివాహం, బాల కార్మిక వ్యవస్థ వల్ల ఆరోగ్యానికి హాని కలిగిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో, బాలల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో తల్లిదండ్రులు, గురువులు కీలక పాత్ర పోషించాలి. తల్లిదండ్రులు ప్రేమతో, శ్రద్ధతో, ఆరోగ్యకరమైన అలవాట్లను బోధిస్తూ పిల్లలను ఎదగనివ్వాలి. అదే విధంగా గురువులు పాఠశాలలో విద్యతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి. ప్రభుత్వం కూడా ఈ మహాయజ్ఞంలో భాగస్వామ్యం తీసుకోవాలి. పోషకాహార కార్యక్రమాలు (అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన పథకాలు) అమలులో ఉండాలి. అప్పుడే ఆరోగ్యవంతమైన బాలల ప్రపంచం సాధ్యమవుతుంది.

# మళ్లీ కొవిడ్ కలకలం!



ప్రపంచ వ్యాప్తంగా మళ్లీ కొవిడ్ కలకలం మొదలైంది. కొన్ని దేశాలు ఇప్పటికే ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాయి. కొవిడ్ 19 కొత్త వేరియంట్లు పుట్టుకురావడంతో, తిరిగి యాక్టివ్ కేసులు నమోదవుతున్నాయి. ముఖ్యంగా కొత్త వేరియంట్లు జెఎన్.1, ఎన్‌బి.1.8.1, ఎల్‌ఎఫ్.7, హెచ్‌కెయు5 సిఒవి2 విజృంభిస్తున్నాయి. ఫలితంగా కేసులు పెరుగుతున్నాయి. ఈనెల 23న హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ప్రాంతంలో నివాసం ఉంటున్న ఒక పల్మనాలజిస్ట్‌కు కొవిడ్ పాజిటివ్ నిర్ధారణ కావడంతో ఇక్కడ కూడా ఆందోళనలు పెరుగుతున్నాయి. అయితే, ఈ కేసు మినహా ప్రస్తుతం తెలంగాణలో క్రియాశీలకు కొవిడ్ కేసులు లేవు. ప్రజలు ఇప్పటికే వైరస్‌పై రోగనిరోధక శక్తిని అభివృద్ధి చేసారని ఆరోగ్య శాఖ అధికారులు అంటున్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న పరిస్థితిని పరిశీలిస్తే, జెఎన్.1 వేరియంట్ ప్రస్తుతం ఉన్న కేసుల్లో 53 శాతం కేసులకు కారణమవుతోంది. ఈ వేరియంట్ అధిక వ్యాప్తి సామర్థ్యాన్ని కలిగి ఉన్నప్పటికీ, తీవ్రమైన లక్షణాలు లేకపోవడం కొంత ఊరటనిస్తున్నది. తక్కువగా కనిపిస్తున్నాయి. ఎన్‌బి.1.8.1, ఎల్‌ఎఫ్.7 వేరియంట్లు కూడా వెలుగులోకి వచ్చాయి. తమిళనాడులో ఎన్‌బి.1.8.1ను, గుజరాత్‌లో ఎల్‌ఎఫ్.7ను గుర్తించారు. ఇవి జెఎన్.1 వేరియంట్‌కు అనుబంధంగా పేర్కొంటున్నారు. అందుబాటులో ఉన్న వివరాలను అనుసరించి దేశ వ్యాప్తంగా సుమారు 300 యాక్టివ్ కేసులు దేశంలో ఉన్నాయి. కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. కాగా, కొవిడ్ వేరియంట్స్ ప్రస్తుతం అదుపులోనే ఉన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) ప్రకటించింది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి అని వివరించింది.

వైరస్ మ్యూటేషన్లు, కొత్త వేరియంట్స్ కొన్ని ప్రాంతాల్లో వ్యాపిస్తున్నాయని గుర్తించారు. ఇవి వేగంగా వ్యాపిస్తాయి కాబట్టి జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. కాగా, చాలా మందికి గతంలో వేసిన వాక్సిన్ల ప్రభావం తగ్గిపోయే అవకాశం ఉంది, బూస్టర్ డోసులు అవసరం కావచ్చు. కొవిడ్ గతంలో సృష్టించిన విధ్వంసాన్ని మరచిపోవడం కూడా సమస్యకు కారణమవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. మాస్కులు ధరించకపోవడం, సామాజిక దూరాన్ని పాటించకపోవడం వల్ల వ్యాప్తి మళ్లీ పెరగవచ్చని స్పష్టం చేస్తున్నారు. మళ్లీ కేసులు పెరిగితే ఆసుపత్రులపై ఒత్తిడి రావచ్చు. కాబట్టి, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అన్ని విధాలా ఉత్తమం.

## తీసుకోవాల్సిన జాగ్రత్తలు..



**మాస్క్ ధరించండి:** ప్రజాభారిత ప్రాంతాల్లో మాస్క్ ధరించడం కొనసాగించండి.

**హ్యాండ్ శానిటైజర్ ఉపయోగించండి:** చేతులను తరచుగా శుభ్రంగా ఉంచండి.

**లక్షణాలు ఉంటే పరీక్షించుకోండి:** జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, డయేరియా వంటి లక్షణాలు ఉంటే వెంటనే పరీక్ష చేయించుకోండి.

**ప్రభుత్వ సూచనలు పాటించండి:** ఆరోగ్య శాఖ సూచనలు అనుసరించండి.

ప్రస్తుతం పరిస్థితి నియంత్రణలో ఉన్నప్పటికీ, అప్రమత్తంగా ఉండడం అవసరం. ప్రభుత్వం, ఆరోగ్య శాఖలు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. మీరు ఆరోగ్యంగా ఉండేందుకు పై సూచనలు పాటించండి.

# హెల్త్ అంటే ఏమిటి?



ఈ ప్రశ్న వినడానికి కొంత హాస్యాస్పదంగా ఉన్నప్పటికీ, చాలా మందికి స్పష్టమైన అవగాహన ఉండదనేది నిజం. ఆరోగ్యం అనేది కేవలం వ్యాధులేదనేది మాత్రమే కాక, శారీరక, మానసిక మరియు సామాజికంగా సంపూర్ణమైన నాణ్యతా స్థితిని సూచిస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) నిర్వచనం ప్రకారం, ఆరోగ్యం అనేది కేవలం వ్యాధి లేకుండటం మాత్రమే కాదు, శారీరక, మానసిక, సామాజిక శ్రేయస్సు సమృద్ధిగా ఉండే స్థితి.

### ఆరోగ్యంలోని ముఖ్యాంశాలు..

శారీరక ఆరోగ్యం: శరీరం బలంగా, వ్యాధుల లేని స్థితిలో ఉండడం. శ్రద్ధగా ఆహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం, సరైన నిద్ర వంటి విషయాలు దీన్ని ప్రభావితం చేస్తాయి.

మానసిక ఆరోగ్యం: మనస్సు ప్రశాంతంగా ఉండటం, ఒత్తిడిని తట్టుకోవడం, భావోద్వేగాలను నియంత్రించుకోవడం, సానుకూలంగా ఆలోచించగలగడం.

సామాజిక ఆరోగ్యం: ఇతరులతో సత్సంబంధాలు కలిగి ఉండటం, సమాజంలో భాగస్వామిగా చక్కగా కలిసిమెలసి జీవించడం.

### ఆరోగ్యానికి అవసరమైనవి..

సుమారైన పోషకమైన ఆహారం, నిత్య వ్యాయామం, ఒత్తిడి నియంత్రణ, తగినంత నిద్ర, శుభ్రత, వ్యసనాల నుండి దూరంగా ఉండటం, పర్యావరణం శుభ్రంగా ఉండటం వంటి చర్యలు అత్యవసరం. సరళంగా చెప్పాలంటే, ఆరోగ్యం అంటే శరీరం, మనస్సు, మన సమాజ జీవితం ఆనందమయంగా ఉండడం.

## జంతువుల నుంచి మనుషులకు..



ఈ ఏడాది ఫిబ్రవరి మాసంలో, చైనాలోని ఉహాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (డబ్ల్యుఐవి) పరిశోధకులు గుర్తించిన ఒక కొత్త బ్యాట్ కరోనా వైరస్‌ను గుర్తించారు. దీనిని హెచ్‌కెయు5 సిఒవి2గా పిలుస్తున్నారు. ఇది మెర్బెకోవైరస్ ఉపజాతికి చెందింది. దీనిలో ఎంఇఆర్‌ఎస్‌సిఒవి (మిడిల్ ఈస్ట్ రెస్పిరేటరీ సిండ్రోమ్ వైరస్) కూడా ఉంటుంది. హెచ్‌కెయు5 సిఒవి2, కొవిడ్ 19కి కారణమైన సార్స్‌సిఒవి2 మాదిరి, మానవ కణాల్లోకి ప్రవేశించడానికి ఏసిఇ2 రిసెప్టర్‌ను ఉపయోగిస్తుందని, అందుకే, దీని పట్ల అప్రమత్తంగా ఉండాలని పరిశోధకులు అంటున్నారు. ఇది జూనోటిక్ వ్యాప్తి (జంతువుల నుండి మనుషులకు వ్యాధి సంక్రమణ) అవకాశాన్ని సూచిస్తుంది. ల్యాబ్ పరీక్షల్లో ఈ వైరస్ మానవ కణాల్లోకి ప్రవేశించగలిగినా, సార్స్ సిఒవి2తో దాని బైండింగ్ సామర్థ్యం తక్కువగా ఉంది. ఇది మానవులకు సంక్రమించే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ప్రస్తుతం, మానవుల్లో హెచ్‌కెయు5 సిఒవి2 కేసులు నమోదు కాలేదు. అయితే, ఏసిఇ2 రిసెప్టర్ వినియోగం వల్ల హెచ్‌కెయు5 సిఒవి2 ఇతర జంతు జాతులలో కూడా వ్యాప్తి చెందే అవకాశాలున్నాయి. డా. షి జెంగ్లీ నేతృత్వంలో డబ్ల్యుఐవి పరిశోధకులు హెచ్‌కెయు5 సిఒవి2ను గుర్తించారు. ఈ వైరస్, మానవ ఏసిఇ2 రిసెప్టర్‌ను ఉపయోగించి కణాల్లోకి ప్రవేశించగలదని కూడా వారు నిర్ధారించారు. లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ ట్రాపికల్ మెడిసిన్ (ఎల్‌ఎస్‌హెచ్‌టిఎం)లోని ప్రొఫెసర్ డేవిడ్ హేయ్మన్ మాట్లాడుతూ, 'ప్రతి కొత్త వైరస్ పాండెమిక్‌కు దారితీయదని, కానీ జాగ్రత్త అవసరం' అని తెలిపారు. ప్రస్తుతం హెచ్‌కెయు5 సిఒవి2 మానవులకు ప్రత్యక్ష ప్రమాదం కలిగించకపోయినా, దాని లక్షణాలు జూనోటిక్ వ్యాప్తి అవకాశాన్ని సూచిస్తున్నాయి. కాబట్టి, ఈ వైరస్‌పై నిరంతర పరిశోధన, పర్యవేక్షణ అవసరం. నివారణ చర్యలు ఎంతగానో ఉపయోగపడతాయి. సాధ్యమైనంత వరకూ వన్యప్రాణుల నుంచి దూరంగా ఉండాలి. ప్రత్యేకించి గబ్బిళాలు ఉన్న పరిసరాలకు వెళ్లకపోవడం మంచిది. అదే విధంగా ఆహార పరిశుభ్రత పాటించాలి. కూరగాయలు, పండ్లు, మాంసాహారాన్ని శుభ్రంగా కడగడం మరియు సరిగ్గా వండడం ద్వారా వైరస్ సంక్రమణను నివారించవచ్చు. ప్రభుత్వ ఆరోగ్య శాఖల సూచనలు, మార్గదర్శకాలను పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

## ప్రజలకిచ్చిన హామీల అమలెప్పుడు?

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు అంజయ్యనాయక్



**ప్రజాపక్షం/డిండి :** ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలతో పాటు ఆరు గ్యారంటీలను ఎప్పటివరకు అమలు చేస్తారని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్యనాయక్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం డిండి మండలంలోని గదరాల్ తండా సిపిఐ గ్రామశాఖ మహాసభకు అంజయ్యనాయక్ ముఖ్య అతిథిగా హాజరై సిపిఐ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా విషయంలో ప్రభుత్వం రాష్ట్ర రైతాంగానికి ప్రభుత్వ విధానాన్ని తెలపాలని, రైతులకు ఎన్ని పంటలకు రైతు భరోసా, ఎన్ని ఎకరాలకు వేస్తారో తేటతెల్లం చేసి రైతులకు రైతు భరోసాపై ఉన్న అపోహలను తొలగించాలన్నారు. పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు ప్రభుత్వం పట్టాలివ్వాలన్నారు. జిల్లా సమితి సభ్యులు తూం బుచ్చిరెడ్డి మాట్లాడుతూ 100 ఏళ్ల సిపిఐ ఉద్యమ ప్రస్థానంలో ప్రజల పక్షాన నిలబడి అధికారం లేకున్నా ఉద్యమ పంతాను ఎంచుకొని ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుందన్నారు. సమావేశంలో సిపిఐ డిండి మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి, మండల కార్యవర్గ సభ్యులు సోమిడి శ్రీనయ్య, గ్రామ కార్యదర్శి కృష్ణనాయక్, సహాయ కార్యదర్శి పుల్లారెడ్డి, తౌక్లాపూర్ గ్రామశాఖ కార్యదర్శి చక్రి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ని ఎకరాల వరకు రైతు భరోసా ఇస్తారో స్పష్టం చేయాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి డిమాండ్

**ప్రజాపక్షం/మరిపెడ :** రైతు భరోసా రైతులకు ఎన్ని ఎకరాల వరకూ ఇస్తారో కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టం చేయాలని మహబూబాబాద్ జిల్లా సిపిఐ కార్యదర్శి బి.విజయసారథి డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఐ మరిపెడ మండల ఐదో మహాసభ ఒంటికొమ్ము లక్ష్మారెడ్డి ఫంక్షన్ హాల్‌లో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అధ్యక్షన జరగ్గా జయసారథి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రబీ సీజన్ అయిపోయి ఖరీఫ్‌సీజన్ ప్రారంభం కాబోతున్నా ఇప్పటికి నాలుగు ఎకరాల లోపు రైతాంగానికి మాత్రమే భరోసా అందించారన్నారన్నారు. కొత్త రేషన్‌కార్డుల జారీ చేయాలని, అర్హత గల వృద్దులు, వితంతువులు, దివ్యాంగులకు కొత్తగా పెన్షన్‌లు అందించాలని, ఇందిరమ్మ ఇండ్లలో ఉన్న గందరగోళాన్ని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మండల కార్యదర్శిగా మారగాని బాలకృష్ణను, సహాయ కార్యదర్శిగా అబ్దుల్ రషీద్ మరో ఏడుగురితో మండల సమితిని ఎన్నుకున్నారు. సమావేశంలో కరణం రాజన్న, మల్లెపాక యాకన్న, పగిళ్ళ అంజయ్య, అక్కినపల్లి రాములు, పాక వెంకన్న, తిప్పర్తి సైదులు, పానుగోతు వెంకన్న, మధు, లింగయ్య, రేగ నరసయ్య, గంట వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# రాజ్యాంగాన్ని, లౌకికవాద ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్




**ప్రజాపక్షం/సూర్యాపేట :** భారత రాజ్యాంగాన్ని, లౌకికవాద ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందా మని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్ పిలుపునిచ్చారు. రాజ్యాంగం అందించిన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతత్వం అందరికి అందని ద్రాక్షగా పాలకులు చేస్తున్నారని విమర్శించారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని కామ్రేడ్ ధర్మభిక్షం భవన్‌లో సిపిఐ సూర్యాపేట పట్టణ కమిటీ నాలుగో మహాసభ బొమ్మగానిశ్రీనివాస్, చామల అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరై బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ పేదలు, దళితులు, బహుజనులకు నేటికి రాజ్యాంగ హక్కులు అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్వేచ్ఛగా భావాలు వెలిబుచ్చితే అర్బన్ నక్సలైట్లు, దేశద్రోహులంటున్నారన్నారు. దేశప్రజలలో ఆర్థిక వ్యత్యాసాలు పెరిగిపోయి తీవ్ర అలజడులు, పోరాటాలు నెలకొంటున్నాయన్నారు. పహల్గామ్ ఉగ్రదాడిలో అమాయక పౌరుల ఉసురుతీసిన పాకిస్తాన్ ఉగ్రవాదులను ఆపరేషన్ సింధూర్ పేరుతో మట్టుపెట్టడాన్ని సిపిఐ హర్షిస్తోందని, కాని భారత్ అంతరంగిక విషయాలలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జోక్యం చేసుకోవడాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నామన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జూన్ 8న సూర్యాపేట జిల్లా కేంద్రంలో పార్టీ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కెవిఎల్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం మావోయిస్టు నేతలను ఎన్‌కౌంటర్ల పేరుతో చంపుతూ పైశాచిక ఆనందాన్ని పొందుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందన్నారు. మావోయిస్టు పార్టీ ప్రభుత్వంతో శాంతిచర్చలు జరుపుతామని, ఆయుధాలను పక్కనపెట్టి కాల్పుల విరమణ ప్రకటించిన తర్వాత నక్సలైట్ల ఏరివేత కార్యక్రమాన్ని కేంద్రం చేపట్టడం హేయమైన చర్య అన్నారు. ఆపరేషన్ కగార్ నిలిపివేసి శాంతిచర్చలు జరపాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణ నూతన కమిటీని 22 మంది కౌన్సిల్ సభ్యులు, 14మంది కార్యవర్గ సభ్యులతో ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా బూర వెంకటేశ్వర్లు తిరిగి ఎన్నికయ్యారు. సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు అనంతుల మల్లేశ్వరి, రాష్ట్ర నాయకులు బొమ్మగాని నాగభూషణం, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, పట్టణ కార్యవర్గ సభ్యులు దంతాల రాంబాబు, దొరేపల్లి శంకర్, చివ్వెంల మండల కార్యదర్శి ఖమ్మంపాటి అంతయ్య, నిమ్మల ప్రభాకర్, పెంద్రకృష్ణ, దీకొండ శ్రీను, బూర సైదులు, ఎండిపాషా, ఎడెల్లి శ్రీకాంత్, సైదులు, దంతాల పద్మ, రేఖ, హేమలత, తాళ్ల సైదులు, వాడపల్లి వెంకన్న, వాడపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల పక్షాన నిలబడి పోరాడేది సిపిఐ ఒక్కటే : మర్రి వెంకటస్వామి

**ప్రజాపక్షం/ఇల్లందకుంట :** పేద ప్రజల కోసం అనునిత్యం పోరాటాలు చేస్తూ పేదల అభ్యున్నతికి పాటుపడే పార్టీ సిపిఐ ఒక్కటేనని పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. ఆదివారం సిపిఐ ఇల్లందకుంట మండల మహాసభ మల్యాల గ్రామంలో మాదారపు రత్నాకర్ అధ్యక్షతన జరిగింది. సభకు మర్రి వెంకటస్వామి హాజరై మాట్లాడుతూ నిరుపేదలకు ఇండ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు, యువతకు ఉపాధి హక్కుల సాధన కోసం, పేదల పిల్లలకు ఉచిత విద్య, వైద్యం కోసం అనేక పోరాటాలు చేసిన చరిత్ర సిపిఐకి ఉందన్నారు. దున్నేవాడికే భూమి కావాలని భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం, బానిసత్వం పోవాలని వీరోచితంగా సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి సిపిఐ నాయకత్వం వహించిందన్నారు. పేదల డిమాండ్ల కోసం పోరాటం చేస్తున్న మావోయిస్టులపై బిజెపి ప్రభుత్వ దమన కాండను ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. మావోయిస్టులు కేంద్రప్రభుత్వంతో చర్చలకు సిద్ధమని చెప్పి లేఖలు రాసినా బిజెపి ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వానికి పేద ప్రజల కోసం పోరాడే మావోయిస్టులతో చర్చలు జరపడం చేతగాదు గానీ పాకిస్తాన్ ఉగ్రవాదులతో చర్చలు జరపడానికి మాత్రం సిద్ధంగా ఉండడం సిగ్గుచేటన్నారు. ఇటీవల ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పంజాల శ్రీనివాస్, ఇజ్జిగిరి రాంగోపాల్, బుర్ర సతీష్, తిరుపతి ఐలయ్య, శ్రీకాంత్, అనిల్, సమ్మయ్య, రవి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఆట, పాటతో ప్రజల్లో చైతన్యం

'ఇఫ్టా' జాతీయనేత స్వామి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇఫ్టా) 83వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం గోదావరిఖని భాస్కరరావు భవన్‌లో ఇఫ్టా జాతీయ నాయకులు కె.స్వామి పతాకావిష్కరణ చేశారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ హాజరై మాట్లాడుతూ కళాకారులు ప్రజలు, కార్మిక, కర్షకులు ఎదుర్కొంటున్న సమస్యలపై తమ ఆటపాటతో చైతన్యం తీసుకువస్తున్నారన్నారు. సిపిఐ నగర కార్యదర్శి కె.కనకరాజ్ మాట్లాడుతూ ఖనిలో నిర్మిస్తున్న కళాభవన్‌కు ఇఫ్టా జాతీయ నాయకులు జాకబ్ పేరుపెట్టాలని డిమాండ్ చేశారు. ఇఫ్టా జాతీయ నాయకులు కే.స్వామి మాట్లాడుతూ ఇఫ్టాకు అనుబంధంగా ప్రజానాట్యమండలి ఏర్పడి నాటి నుండి నేటివరకు ప్రజాసమస్యలపై పోరు చేస్తుందన్నారు. ప్రజానాట్యమండలి నగర అధ్యక్షుడు ఎజ్జ రాజయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గోసిక మోహన్, గౌతం గోవర్ధన్, ప్రజానాట్యమండలి నగర కార్యదర్శి వై.లెనిన్, తాళ్ళపెల్లి మల్లయ్య, మడికొండ ఓదేమ్మ, తొడుపునూరి రమేశ్ కుమార్, మార్కపూరి సూర్య, అబ్దుల్ ఘని, జూల మోహన్, నూకల మొండి, తదితరులు పాల్గొన్నారు.

# నిఘా వైఫల్యంతోనే పహల్గామ్ దాడి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల్‌నర్సింహ్మ



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** కేంద్రహోంశాఖ నిఘా వైఫల్యంతోనే కాశ్మీర్‌లో పహల్గామ్ ఉగ్రదాడిలో 26మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల్‌నర్సింహ్మ ఆరోపించారు. మండలంలోని వెల్గొండ గ్రామశాఖ సిపిఐ మహాసభను ఆదివారం ఈర్ల గంగాధర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్‌నర్సింహ్మ మాట్లాడుతూ ఉగ్రవాదులను హతమార్చాలని పౌరులజోలికి వెళ్లవద్దని సిపిఐ సూచిస్తే ఆర్‌ఎస్‌ఎస్, బిజెపినేతలు విమర్శలు చేశారని, మనదేశ వ్యవహారాల్లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జోక్యం చేసుకొని శాంతింపచేశామని చెబుతున్నారని ఇది దేశ సార్వభౌమత్వానికి అవమానం అన్నారు. ఏడురాష్ట్రాల్లో ఆపరేషన్ కగార్ పేరుతో దేశ ఆదివాసులను హతమారుస్తున్నారని విమర్శించారు. మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలన్నారు. కమ్యూనిస్టులుగా ప్రజలకు చేరువగా వారి సమస్యల కోసం పోరాటాలు చేస్తున్నారన్నారు. శ్రామిక, కార్మిక, కర్షక వర్గ నిరుపేదల పక్షాన ఫలితాలు సాధించే వరకు పోరాడుతూ గత వందేళ్ల కాలంగా ప్రజల మదిలో నిలిచి పోయింది కేవలం కమ్యూనిస్టులు మాత్రమే అని ఆయన తెలిపారు. వివిధ వర్గాలు, మతాలు, ప్రాంతాల పేరిట మనుషుల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టటం ద్వారా ఓట్లు దండుకొనే తుచ్ఛ రాజకీయాలతో పదేళ్లపైబడి కేంద్రంలో అధికారం వెలగబెడుతున్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దాసోహమై కార్మిక, కర్షక, శ్రామికవర్గాలను అణచివేసే దిశగా పాలిస్తూ అత్యంత ప్రమాదకరంగా తయారైందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ఒక్కటొక్కటిగా ప్రభుత్వ ప్రయివేట్ రంగ సంస్థలన్నిటిని అంబాని, ఆదానిలాంటి సంపన్న వర్గాలకు ప్రయివేటీకరణ పేరట అప్పచెప్పి వారిచ్చే డబ్బులతో ఎన్నికల్లో ఓట్లు పొందేందుకు కుటిల యత్నాలకు పాల్పడుతుందన్నారు. అధికారంతో పని లేకుండా ప్రజా పోరాటాల్లో అన్ని వర్గాలకు అండగా నిలుస్తూ పోరాటం చేస్తున్నది సిపిఐ మాత్రమే అన్న విషయాన్ని ప్రజల్లో మరింత ముందుకు తీసుకొని వెళ్లాలన్నారు. వచ్చేనెలలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని సిపిఐ బలమున్న అన్నిచోట్ల పోటీచేసి గెలవాలని సిపిఐ మండల సహాయకార్యదర్శి ఈర్ల భూపేష్‌బాబు పిలుపునిచ్చారు. ప్రజలకు చేరువై ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ శ్రేణులు పోరాడాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఈర్లచంద్రమౌళి, కృష్ణారెడ్డి, పురుషోత్తం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికం REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## నేడు మంథనిలో మంత్రి శ్రీధర్ బాబు పర్యటన

**ప్రజాపక్షం/ముత్తారం/మంథని :** పెద్ద పల్లి జిల్లా మంథని మండలంలో సోమవారం ఉదయం 8 గంటల 30 నిమిషాలకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ మంథని కార్యాలయంలోని గుంజపడుగు గ్రామంలో 2.90 కోట్లతో ఏర్పాటు చేయబోయే సోలార్ ప్రాజెక్ట్ (PM Kusum) కు సంబంధించిన అనుమతి పత్రాలను మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీద మంథనిలో సింగిల్ విండో చైర్మన్,పాలకవర్గానికి అందజేస్తారు. అలాగే ఉదయం 9 గంటలకు మంథని బస్ డిపో సమీపంలో తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీమ్, స్టార్ట్, రైజ్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్‌లో భాగంగా మంథని టౌన్ గ్రామీణ ప్రోటోటైపింగ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను మంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.ఉదయం 10 గంటలకు కొయ్యూరులోని సరస్వతీ పుష్కరాలకు వెళతున్న భక్తులకు అన్నదాన కార్యక్రమంలో పాల్గొంటారని మంత్రి శ్రీధర్ బాబు వ్యక్తిగత పిఏ ఒక ప్రకటనలో వరకు తెలిపారు.

## మా ఊరిపై దయ చూపండి...



**ప్రజాపక్షం / మల్లాపూర్ :** రైతులకు, సాగునీరు, నోరులేని మూగజీవులకు, వన్య ప్రాణులకు తాగునీరు అందించే చెరువు కట్ట తెగిపోయి 3 సంవత్సరాలు నీరు నిలువ లేక ఇబ్బందులు పడుతున్నామని మా ఊరిపై దయ చూపండి సార్లు అని గొర్రెపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ ఎన్నారై గెల్లె మల్లేష్ యాదవ్ సోషల్ మీడియాలో చేసిన పోస్టు వైరల్‌గా మారింది. అయ్యా ఎంపి ధర్మపురి అరవింద్, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ జువ్వాడి నర్సింగరావులకు విన్నవిస్తూ గ్రామానికి దక్షిణ భాగంలో గల కొత్త చెరువు కట్ట భారీ వర్షాల కారణంగా తెగిపోయి మూడు సంవత్సరాలు దాటిందని, తాత్కాలిక పనులు ద్వరగ చేపట్టారే తప్ప శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో పాడిపంటలకు సాగునీరు పశువులకు తాగునీరు లేక అల్లాడిపోతున్నాయని, తక్షణమే చెరువు కట్టకు శాశ్వత పరిష్కారం చూపి గొర్రెపల్లి గ్రామ ప్రజలను, మూగ జీవాలను ఆదుకోవాలని కోరారు. కాగా పరాయి దేశంలో ఉండి గ్రామ సమస్యపై సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో మరింత ఆసక్తిగా మారింది. ఏది ఏమైనా మూడు సంవత్సరాలుగా శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై నేతల పనితీరుకు చెరువు కట్టే ప్రశ్నార్థకంగా మారిందని అనడంలో అతిశయోక్తి లేదనిపిస్తోంది.

## సిబిల్ స్కోర్ లేకుంటే గోడలకు అతికిస్తారా..



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కింద రునాలు అందించాలని లక్ష్యంతో ప్రవేశపెట్టిన రాజీవ్ వికాసం పథకం అధికారుల పనితీరుతో అపహాస్యం అవుతుంది. మల్లాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న రాజీవ్ వికాసం ఇంటర్వ్యూలకు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువతకు సిబిల్ స్కోర్ లేదనే నెపంతో ముందుగానే కార్యాలయం ఆవరణలో దరఖాస్తుదారుల పేరుతో గోడలకు అతికించడం సరైంది కాదని అంబేద్కర్ సంఘాల రాష్ట్ర నాయకుడు ఎర్ర రమేష్ అధికారులను ప్రశ్నించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సిబిల్ స్కోర్‌తో సంబంధం లేదని ప్రకటిస్తుంటే మల్లాపూర్ మండల పరిషత్‌లో మాత్రం స్కోర్ లేదని అనర్హులుగా గుర్తిస్తూ ఇంటర్వ్యూకు రాకుండా ముందుగానే గోడలకు అతికిస్తూ యువతను అవమానిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి మాటలకు సైతం గౌరవ లేకుండా పోయిందని అన్నారు. ఎద్దైనా అధికారులు ముందుగానే రిజెక్టెడ్ పేరుతో గోడలకు అతికించడంతో తమ మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించడం సరికాదని అనర్హులుగా గుర్తించిన దరఖాస్తుదారులు అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## బిసి మేలు కొలుపు రథ యాత్ర



**ప్రజాపక్షం/ముత్తారం :** రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన 42% రిజర్వేషన్ బిల్ అమలు చేయాలని తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని, దేశ వ్యాప్తంగా కుల గణన ప్రక్రియ శాస్త్రీయ పద్ధతిలో వెంటనే చేపట్టాలని బీసీ ఆజాది ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీసీ మేలు కోలుపు రథ యాత్ర ఆదివారం కమాన్ పూర్ కేంద్రానికి చేరుకున్నది, జక్కని సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న యాత్రలో బీసీ నేతలు పాల్గొని జనాభా ప్రాతిపదికన బీసీలకు విద్యా ఉద్యోగ వ్యాపార రాజకీయ రంగాలలో వాటాను అందించాలని మేమెంతో మాకంత వాటా నినదించారు, పట్టణంలోని స్థానిక అంబేద్కర్ చౌరస్తా ర్యాలీ నిర్వహించారు, పూలే, అంబేద్కర్, కొండ లక్ష్మ ణ్ బాపూజీ, అమరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు, ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాలు, కుల సంఘాలు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా బీసీ ఆజాది ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు సరియైన అవకాశాలు లేక అన్ని రంగాల్లో వెనుకబడి అణగారిన వర్గాలుగా పేద వారుగా ఉన్నారని నిజానికి ఈ దేశానికి మూల నివాసులైన ప్రజలు మెజారిటీ ప్రజలు బీసీలనీ, ఈ స్వతంత్ర భారతదేశంలో మెజారిటీ ప్రజల లక్ష్యాలను పక్కనపెట్టి కార్పొరేటీకరణకు, పెట్టుబడిదారులకు ప్రభుత్వాలు వత్తాసు పలుకుతున్నాయని విద్యా, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాలలో బీసీలకు జనాభా ప్రాతిపదికన అవకాశాలను కల్పించాలని, జనాభా ప్రాతిపదికన వాటాను అందించాలని తద్వారా బీసీల అభివృద్ధి సాధించి ప్రతి పౌరుడు అభివృద్ధి ద్వారా దేశ అభివృద్ధి సాధ్యమవుతుంది కాబట్టి దేశ అభివృద్ధికి దోహదపడాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ఆజాది ఫెడరేషన్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు క్యాతం మహేందర్,నాయకులు బండ నిఖిల్ వడ్డేపల్లి మనోహర్, గుమ్మాల శ్రీనివాస్, జక్కని శ్రీకాంత్, అశోక్ తో పాటు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మునీర్ మరణం పత్రికా రంగానికి తీరని లోటు

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** ప్రముఖ పాత్రికేయుడు, సింగరేణి ఉద్యోగులు,విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై ఎన్నో సార్లు తన కలం ద్వారా వెలుగులోకి తెచ్చిన ప్రముఖ పాత్రికేయుడు ఎం.డి మునీర్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ ఒమేగా హాస్పిటల్ లో నిన్న రాత్రి మరణించడం సింగరేణి ప్రాంతవాసులకు తీరని లోటు.వారి ఆత్మకు శాంతి చేకూరాలని,సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు దండంరాజు రామచందర్ రావు, ప్రధాన కార్యదర్శి బుపెల్లి బానయ్య, ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్,టి.ఉమాకర్, ఎం.విజయ్ బాబు,బి.రాజయ్య,కె.బీరయ్య, ఎస్.నర్సింగ్ రావు,జి.కనకయ్య మునీర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## గ్రామ పరిపాలన అధికారుల పరీక్షకు 130 మంది అభ్యర్థులు హాజరు

14 గైర్హాజరు
కలెక్టర్ మనుచౌదరి



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** గ్రామ పరిపాలన అధికారుల పరీక్షను విజయవంతంగా నిర్వహించినట్టు జిల్లా కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. ఆదివారం సిద్దిపేట డిగ్రీ కళాశాలల్లో నిర్వహించిన గ్రామ పరిపాలన అధికారుల పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పర్యవేక్షించారు. పరీక్ష గదుల్లో అభ్యర్థుల సౌకర్యం కోసం ఏర్పాట్లు చేసిన వసతులను పరిశీలించారు. సెక్యూరిటీ ఏర్పాట్లను పరిశీలించారు. అభ్యర్థులు పరీక్ష రాయటానికి ఏలాంటి ఇబ్బందులు కలుగకుండ చూసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ జిల్లాలో గ్రామ పాలన పరీక్ష నిర్వహణ విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు.144వి అభ్యర్థులకు 14 మంది అభ్యర్థులు గైర్హాజరైనాని, 130 మంది అభ్యర్థులకు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట అదనపు జిల్లా కలెక్టర్ అబ్దుల్ హమీద్, సిద్దిపేట ఆర్డీఓ సదానందం,,కలెక్టర్ ఎఓ రహమాన్, సిద్దిపేట అర్బన్ తహశీల్దార్ సలీం మియా తదితరులు పాల్గొన్నారు.

## మునీర్ మరణం కార్మిక వర్గానికి తీరని లోటు

సిపిఐ, ఏఐటియుసి నాయకుల సంతాపం

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ ఉద్యమ కారుడు మునీర్ మరణం పట్ల సిపిఐ, ఏఐటియుసి నాయకులు మద్దె ఎల్లా గౌడ్, కే.స్వామి, ఆరెల్లి పోషం, గౌతం గోవర్ధన్, గోసిక మోహన్, కె.కనక రాజ్, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.లెనిన్, ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆఫీస్ కార్యదర్శి తోడుపునూరి రమేశ్ కుమార్ లు ఒక సంయుక్త ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. వామ పక్ష భావజాలం కల్గిన మునీర్ కోల్ బెల్ట్ ప్రాంత ప్రజల, కార్మికుల సమస్యలపై, దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై నిరంతరం విశ్లేషణ చేస్తూ వివిధ పత్రికల్లో వ్యాసాలు రాస్తూ మెప్పు పొందారని వారు పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగుల సమస్యలపై ఎన్నో సార్లు తన కలం ద్వారా వెలుగులోకి తెచ్చిన ప్రముఖ పాత్రికేయుడని వారు కొనియాడారు. మునీర్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ ఒమేగా హాస్పిటల్ లో శనివారం రాత్రి మరణించడం సింగరేణి ప్రాంత వాసులకు తీరని లోటని వారు తెలిపారు. మునీర్ కుటుంబ సభ్యులకు వారు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## శ్రీరేణుక ఎల్లమ్మను దర్శించుకున్న సిపిఐ నేత చాడ వెంకటరెడ్డి




**ప్రజాపక్షం/చిగురుమామిడి:** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం చిన్నముల్కనూర్ గ్రామంలో గత వారం రోజులుగా జరుగుతున్న శ్రీరేణుక ఎల్లమ్మ జాతరలో భాగంగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డితో పాటు పొన్నం సత్యం, మంత్రి పర్సనల్ సెక్రటరీ కటకం వెంకటరమణలు ఎల్లమ్మ తల్లిని దర్శించుకుని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు అమ్మవారికి పట్టు వస్త్రాలను గౌడ సంఘం ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా వారికి ఘన స్వాగతం పలికి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని వారు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు పైడిపల్లి చంద్రయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు చిలువేరి శ్రీనివాస సిపిఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, మాజీ జడ్పిటిసి అందె స్వామి, మాచర్ల అంజయ్య గౌడ్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు పూదరి వేణుగోపాల్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్ రెడ్డి, సిపిఐ మండల సహాయ కార్యదర్శి పైడిపల్లి వెంకటేష్, మాజీ ఉపసర్పంచ్ సాంబారి బాబు, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు మార్క రాజు గౌడ్, మండల కొమురయ్య, ఎనగందుల రాజు, గజ్జల రాములు, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి

సిపిఐ నగర కార్యదర్శి
కామ్రేడ్ కె.కనకరాజ్



**ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి:** రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 49వ డివిజన్ అశోక్ నగర్‌లో సిపిఐ శాఖ మహాసభ ఆదివారం అశోక్ నగర్ లోని ప్రమీల దేవి భవన్ వద్ద జరిగింది.ఈ మహాసభ కు ముఖ్య అతిథిగా విచ్చేసిన సిపిఐ నగర కార్యదర్శి కామ్రేడ్ కే. కనకరాజ్ మాట్లాడుతూ 49వ డివిజన్లో కామ్రేడ్ ప్రమీల దేవి ఆధ్వర్యంలో సిపిఐ అనేక పోరాటాలు నిర్వహించిందని గుర్తుచేశారు. సిపిఐ గతంలో ఈ డివిజన్ లో పోటీ చేసి మెరుగైన ఫలితాలు సాధించిందని ఈసారి కూడా 49వ డివిజన్లో రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీకి సన్నదం కావాలని ఆయన అన్నారు.రోడ్లు వీధి దీపాలు డ్రైనేజీ లు అదే విధంగా రేషన్ కార్డుల కోసం పింఛన్ల కోసం సిపిఐ చేసిన పోరాటాల్లో అశోక్ నగర్ నుండి అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరై విజయవంతం చేసేవారని ఆయన గుర్తు చేశారు,అశోక్ నగర్ లో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని ఈ ప్రాంతంలో నివసిస్తున్న ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంకా ఈ మహాసభలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి కామ్రేడ్ తాళ్లపల్లి మల్లయ్య,మహిళా సమాఖ్య నాయకురాలు మడికొండ ఓదెమ్మ, తదితరులు మాట్లాడారు, దుబాసి రేణుక అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో 49 డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కామ్రేడ్ దుబాసి రేణుక, సహాయ కార్యదర్శిగా టి ప్రశాంత్, కోశాధికారిగా మారెళ్ళ శ్రీలత కార్యవర్గ సభ్యులుగా జంగా లక్ష్మి, రాజేశ్వరి, రామదుగు మల్లేష్, విజయ, రాధ తదితరులను ఎన్నుకున్నారు.

## 27న కరీంనగర్‌లో సిపిఐ జిల్లా మహాసభలు



**ప్రజాపక్షం/తిమ్మాపూర్:** భారత కమ్యూనిస్టు పార్టీ కరీంనగర్ జిల్లా 23వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ జిల్లా మహాసభల కరపత్రాన్ని ఆదివారం ఇందిరానగర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ తిమ్మాపూర్ మండల కార్యదర్శి బోయిని తిరుపతి మాట్లాడుతూ దేశం కోసం, ప్రజల కోసం అనేక ప్రజా ఉద్యమాలను ముందుండి నడిపించిన పార్టీ సిపిఐ అన్నారు. పెట్టుబడిదారీ విధానానికి, దోపిడీకి, శ్రమదోపిడీకి వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించి కార్మిక కర్షక ప్రజా శ్రేయస్సు కోసం ఎన్నో ఉద్యమాలు నిర్వహించి అనేక విజయాలు సాధించిన ఘనమైన చరిత్ర సిపిఐకి ఉందన్నారు. భూమి కోసం, భుక్తి కోసం వెట్టిచాకిరీ విముక్తి కోసం వీరోచితంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటానికి సిపిఐ నాయకత్వం వహించిందన్నారు. 10 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు పంచిన పార్టీ అన్నారు. 4500 మంది అమర వీరులు ప్రజల కోసం తమ ప్రాణాలను త్యాగం చేశారని తెలిపారు.
మహాసభలు ఈ నెల 27న సాయంత్రం 4 గంటలకు కరీంనగర్‌లోని మధు గార్డెన్ ఫంక్షన్‌హాలులో ప్రారంభమవుతాయని, ఈ ప్రారంభానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, కార్యదర్శివర్గ సభ్యుడు కలవేని శంకర్‌లు హాజరవుతారని తెలిపారు. ఈ నెల 27, 28 తేదీలలో జరిగే మహాసభల్లో 300 మంది జిల్లాలో ఎంపిక కాబడ్డ ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గంగిపల్లి శంకర్, ఇంద్రనగర్ గ్రామశాఖ కార్యదర్శి అల్వాల మనోజ్, ఎ.సతీష్, ఎస్.నరసయ్య, నరేష్, నవీన్, అల్వాల శేఖర్‌లు పాల్గొన్నారు.

## దళితబంధు పేరుతో మోసం చేసిన వారిపై చర్యలు

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు
అందె అశోక్



**ప్రజాపక్షం/కొమురవెల్లి:** దళిత బంధు పేరుతో డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, బాధితులకు డబ్బులు ఇప్పించేంతవరకు సిపిఐ పోరాటం చేస్తుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ అన్నారు.ఆదివారం కొమురవెల్లి మండలంలోని లెనిన్‌నగర్ గ్రామస్తుడు దాసరి హరిబాబును ఇంటికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం కోసం 2022 సంవత్సరంలో లెనిన్ నగర్ కు చెందిన దాసరి హరిబాబు వద్ద అప్పటి బీఆర్ఎస్ మాజీ ఎంపీపీ భర్త అతని డ్రైవర్ దళిత బంధు ఇప్పిస్తానని 1,50,000 తీసుకొని దళిత బంధు ఇప్పించకపోగా డబ్బులు మళ్ళీ తిరిగి ఇవ్వమని పరుమార్లు వేడుకున్నా ఇవ్వకపోగా ఇదే విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా స్టేషన్‌కి వచ్చి డబ్బులు ఇస్తానని చెప్పి అతని డ్రైవర్ గ్యారెంటర్ అని చెప్పి బాండ్ పేపర్ మీద డబ్బులు తిరిగి ఇస్తానని రాసి ఇచ్చారని, నేటి వరకు డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇలా నియోజకవర్గ వ్యాప్తంగా డబ్బులు ఇప్పిస్తానని చాలామంది బిఆర్ఎస్ నాయకులు మోసం చేశారన్నారు. ఇప్పుడైన జనగామ బిఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బాధితుడైన హరిబాబుకు న్యాయం చేయాలన్నారు. బాధితుడైన హరిబాబు మాట్లాడుతూ తను పనిచేస్తే కాని పూట గడవని పరిస్థితి అని దళిత బంధు కోసం అప్పు తీసుకొని వాళ్లకు ఇచ్చాడని, వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నాడని, ఈ విషయంలో న్యాయం జరగకపోతే ఆత్మ హత్య శరణ్యమని వాపోయాడు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, సీపీఐ కొమురవెల్లి మండల కార్యదర్శి కుడిక్యాల బాలమోహన్, మండల నాయకులు నంగి కనకయ్య, బూరుగు సత్తయ్య, మల్లం అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పాలన అధికారుల నియామక పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కరీంనగర్ సప్తగిరి కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గ్రామ పాలన అధికారుల (జిపిఒ) నియామక పరీక్షను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదివారం సమీక్షించారు. గత ప్రభుత్వం రద్దు చేసిన వీఆర్వో, వీఆర్ఏలను తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకునేందుకు గ్రామాల్లో రెవెన్యూ సేవల పునరుద్ధరణ కోసం గ్రామ పాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నదన్నారు. ఈ మేరకు జిపివో పోస్టులకు ధరఖాస్తు చేసుకున్న వీఆర్వో, వీఆర్ఏలకు ఆదివారం సప్తగిరి కాలనీలోని జడ్పీ హెచ్ఎస్‌లో రాత పరీక్ష నిర్వహించారు. 189 మంది వీఆర్వో, వీఆర్ఏలు ఈ పోస్టుల కోసం ధరఖాస్తు చేసుకోగా 172 మంది పరీక్షకు హాజరయ్యారు. రాత పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించి అక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షకు ధరఖాస్తు చేసుకున్న, హాజరైన అభ్యర్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, డీఆర్వో పవన్ కుమార్, రెవెన్యూ డివిజనల్ అధికారి మహేశ్వర్, నెహ్రూ యువ కేంద్ర కో ఆర్డినేటర్ రాంబాబు, డివైఎస్వో శ్రీనివాస్, ఏవో సుధాకర్ ఉన్నారు.

## ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి ప్రతిష్ఠాత్మక అవార్డు



**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర విద్యారంగంలో అత్యుత్తమ ఫలితాలను సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నందుకు గాను అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా.వి.నరేందర్‌రెడ్డికి ప్రతిష్టాత్మక వెంకట్ ఫౌండేషన్ వై.రఘునాథం ఎక్సలెన్స్ అవార్డు వరించింది. ఈ మేరకు ఆదివారం కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాలులో వెంకట్ ఫౌండేషన్ ఆద్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక వేడుకలో రిటైర్డ్ ఐపిఎస్, పూర్వ జాయింట్ డైరెక్టర్ సిబిఐ వివి లక్ష్మి నారాయణ, వెంకట్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ గంప వెంకట్, ఇతర అతిథుల చేతుల మీదుగా అవార్డును ప్రధానం చేశారు. ఈ సంధర్భంగా అతిధులు, నిర్వాహకులు మాట్లాడుతూ తెలంగాఅణ రాష్ట్ర విద్యారంగానికి మార్గదర్శకంగా నిలుస్తూ ఎంతో మంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందిస్తున్నారన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల ద్వారా అత్యుత్తమ విద్యను అందిస్తూ తెలంగాణ రాష్ట్ర విద్యారంగాలలో సమూలమైన మార్పులు తీసుకువస్తున్నందుకు గాను వై.రఘునాథం ఎక్సలెన్స్ అవార్డు ప్రధానం చేసినట్లు పేర్కొన్నారు. ఈ సంధర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా విద్యారంగానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల ద్వారా అత్యుత్తమ సేవలను అందిస్తున్నామని, ఎంతో మంది విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడమే కాకుండా వారిని ప్రతిష్టాత్మక స్థానాలలో స్థిరపడేందుకు ప్రోత్సాహం అందిస్తున్నామని చెప్పారు. అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఈ అవార్డు బాధ్యత మరింత రెట్టింపు చేసిందన్నారు. ఈ అవార్డు రావడానికి కృషి చేసిన సిబ్బందికి, ప్రోత్సాహాన్ని అందిస్తున్న తల్లిదండ్రులకు అందికి తమిస్తున్నానని తెలుపుతూ సహకారం అందిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రశాంతంగా జరిగిన గ్రామ పాలన అధికారి పరీక్షలు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** పెద్దపల్లి జిల్లాలో గ్రామ పాలన అధికారి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని అదనపు కలెక్టర్ డి.వేణు తెలిపారు.ఆదివారం అదనపు కలెక్టర్ డి.వేణు పెద్ద కాల్వల లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రామ పాలన అధికారి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ గ్రామ పాలన అధికారి పరీక్షలకు పెద్దపల్లి జిల్లాలో 90 మంది అభ్యర్థులు హాజరవు కావాల్సి ఉండగా 82 మంది అభ్యర్థులు హజరయ్యారని పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ మాకు బాస్.. ఆయన బాటలోనే నడుస్తాం

కవిత పార్టీ పెట్టడం ఊహాగానాలే
ఎమ్మెల్యే గంగుల కమలాకర్



**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి/కొత్తపల్లి:** బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ మాకు నాయకుడని.. ఆయన బాటలోనే నడుచుకుంటామని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. కెసిఆర్ ఆదేశాలను పాటిస్తామన్నారు. ఎమ్మెల్సీ కవిత పార్టీ పెట్టడం అనేది ఊహాగానాలేనని కొట్టిపడేశారు. ఆదివారం కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 20వ డివిజన్‌లో గల ఆరెపల్లిలో స్మశాన వాటికలో అభివృద్ధి, కల్వర్టు నిర్మాణ పనులకు నగర బిఆర్ఎస్ అధ్యక్షుడు చల్లహరిశంకర్, స్థానిక మాజీ కార్పోరేటర్ తుల రాజేశ్వరి బాలయ్యలతో కలిసి ఎమ్మెల్యే గంగుల భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత కెసిఆర్‌కు రాసిన లేఖపై ఎమ్మెల్యే స్పందించారు. బిఆర్ఎస్ పార్టీ ప్రజాస్వామ్య బద్ధంగా ఉన్న పార్టీ అని, ప్రతి ఒక్కరి అభిప్రాయాలను వారు తెలియజేయవచ్చునన్నారు. గానీ బహిరంగ లేఖ రాయడం కాకుండా కెసిఆర్‌కు వ్యక్తిగతంగా విషయాలను చెప్పి ఉంటే బాగుండు అని కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను తాను కూడా ఏకీభవిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో భాగంగా గతంలో ఆరెపల్లి గ్రామ పంచాయతీగా ఉండేదని, డివిజన్ వాసులకు స్మశాన వాటిక లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, స్మశాన వాటిక నిర్మాణానికి 15వ ఫైనాన్స్ నిధుల నుంచి సుమారు రూ.49.50 లక్షల రూపాయలను వెచ్చించి అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఆరెపల్లి నుంచి రాణిపూర్, నగునూర్ దుర్గామాత ఆలయానికి వెళ్లే దారిలో సాధారణ నిధుల ద్వారా సుమారు 12 లక్షల రూపాయలను వెచ్చించి కల్వర్టును నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఎన్నారైల ఆద్వర్యంలో జూన్ రెండవ తేదీన అమెరికాలో డలాస్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలను నిర్వహిస్తున్నారని, ఈ నెల 31న న్యూయార్క్‌లో బిఆర్ఎస్ ప్రిలిమనరీ సమావేశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్లు జంగిలి సాగర్, ఐలేందర్ యాదవ్, దిండిగాల మహేష్, నాయకులు పిల్లి మహేష్ గౌడ్, మాజీ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ కర్ర సూర్య శేఖర్, మాజీ సుడా డైరెక్టర్ నేతి రవివర్మ, పలువురు బిఆర్ఎస్ నాయకులు, ఆరెపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ప్రజాపక్షం/శ్రీరాంపూర్ : శ్రీరాంపూర్ ఏరియాలోని శ్రీలక్ష్మీ శిశు మందిర్ హైస్కూల్ యొక్క 2003–2004 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి చిలిపి చేష్టలు, మధురమైన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో సత్కరించారు, జ్ఞాపికలను (మెమెంటోలను) అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్, రాజ్ కుమార్, కనకయ్య, రాజలింగు, రమణారెడ్డి, పూర్వ విద్యార్థులు దిలీప్, తిరుపతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్‌షాక్‌తో నాలుగు గేదెలు మృతి

ప్రజాపక్షం/లోకేశ్వరం : మండలంలోని గోడిసెరా గ్రామంలోని విద్యుత్ షాక్‌తో నాలుగు గేదెలు మృతి చెందాయి. గ్రామంలోని పెద్దలు, విద్యుత్ షాక్ గురైన బాధితులు మాట్లాడుతూ శుక్రవారం రోజున గేదెలు మేతకు వెళ్లాయని తిరిగి ఆదివారం రోజు చూడగా 4 గేదెలు మృతి చెందాయని ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన గేదెల్లో ఎల్లన్న ఒకటి, మల్లేష్ ఒకటి, భూమన్నవి రెండు గేదెలు మృతి చెందాయి ఒక్కోదాని విలువ లక్ష పది వేలు ఉన్నవి అని అధికారులు నాయకులు స్పందించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని తెలియజేశారు.

**పాపన్నపేటలో...**



**ప్రజాపక్షం/పాపన్నపేట:** మేతకు వెళ్లిన పాడిగేదె ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన పాపన్నపేట మండలంలోని కుర్తివాడ శివారులో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పుట్టి వెంకటేశం వ్యవసాయంతో పాటు పాడి గేదెల ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో రోజూ మాదిరిగానే ఆదివారం గేదెలను మేతకు తీసుకెళ్లగా గ్రామ శివారులోని ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై పాడి గేదె మృత్యువాత పడింది. విద్యుత్ అధికారులు, గ్రామ పశువైద్యాధికారి అవారి రాకేష్‌లు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. విద్యు త్ అధికారులు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

## ఈ సెట్‌లో మణికాంత్‌కు 57వ ర్యాంక్



ప్రజాపక్షం/సోన్ : ఇటీవల విడుదలైన ఈసెట్ ఫలితాల్లో సోన్ మండలంలోని న్యూవెల్మల్ గ్రామానికి చెందినటువంటి అంకం మణికాంత్ 57వ ర్యాంకు సాధించారు. పట్టుదలతో చదువుకొని మంచిర్యాంకు సాధించిన ఈ విద్యార్థిని గ్రామస్తులు అభినందించారు.

## సిగ్నల్స్ అంతరాయంతో ఇబ్బందులు

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : చరవాణిల్లో సిగ్నల్స్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొన్ని రోజులుగా జిల్లా కేంద్రంలో పలు టెలికాం సంస్థల నెట్వర్క్ సిగ్నల్స్ సరిగా లేకపోవడంతో తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని, దీంతో చరవాణిలో కాల్స్ వస్తున్నప్పుడు మాటలు సరిగా వినపడడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా టెలికాం సంస్థల అధికారులు మొబైల్‌సిగ్నల్స్‌లో అంతరాయం లేకుండా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## కామ్రేడ్ ఎండి.మునీర్ పార్థివదేహానికి సిపిఐ నివాళి



ప్రజాపక్షం/మంచిర్యాల : ప్రముఖ కమ్యూనిస్ట్ వాది, పాత్రికేయుడు కామ్రేడ్ ఎండి. మునీర్ పార్థివ దేహానికి సిపిఐ పార్టీ జెండా కప్పి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేని శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు భీమనాధుని సుదర్శన్, దాగం మల్లేష్, కాలేందర్ అలీ ఖాన్, రేగుంట చంద్రశేఖర్, ఎం.పోల్, ఐ. లింగయ్య, పట్టణ నాయకులు ఆర్. వెంకన్న, దొంతుల రాజం, సీనియర్ కమ్యూనిస్ట్ నాయకులు శతకోపం కిష్టయ్య, మహిళా నాయకురాలు బియ్యాల పద్మ, కలవల శ్రీనివాస్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా వేణుగోపాల్



ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : ఆసిఫాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా వేణుగోపాల్ గెలుపొందారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రెస్ క్లబ్ కార్యాలయంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులకు గాను 8 మందితో కూడిన ఎన్నికల నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో క్లబ్ అధ్యక్షుడిగా ఆంధ్రజ్యోతి రిపోర్టర్ వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా సాక్షి రిపోర్టర్ వారణాసి శ్రీనివాస్, కోశాధికారిగా ప్రజాపక్షం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ కలకుంట్ల శ్రీధర్‌లు గెలుపొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తామని, జర్నలిస్టుల సమస్యలపై పోరాడుతామని ముక్తకంఠంతో పేర్కొన్నారు. అనంతరం గెలుపొందిన క్లబ్ సభ్యులకు జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు రామ్మోహన్, హనుమయ్య, సురేష్, అబ్దుల్ రెహమాన్, మహేష్, కృష్ణంరాజు, తారు, మీర్జా సలీంలతో పాటు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం పునరుద్ధరణ ఖర్చు ప్రభుత్వానిదేనా? : పాల్వాయి

ప్రజాపక్షం/కాగజ్‌నగర్ : కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ, మరమ్మతుల ఖర్చును ప్రభుత్వం భరిస్తుందా అని బిజెపి చీఫ్ విప్ డా.పాల్వాయి హరీష్ బాబు సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై చర్చ జరుగుతుండగా, గుత్తేదారు సంస్థలు పునరుద్ధరణ ఖర్చును ప్రభుత్వమే భరించాలని కోరడం అనుమానాలకు తావిస్తోందని అన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు రూ.10వేల కోట్లు ఖర్చయ్యే అవకాశం ఉందని, ఈ భారాన్ని ప్రభుత్వం భరిస్తే రాష్ట్రం దివాళా తీసే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వరంలో జరిగిన అవినీతిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, బాధ్యులైన గుత్తేదారు సంస్థలు, నాటి ప్రభుత్వ పెద్దల నుంచి డబ్బులు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

# అకాల వర్షాలకు 'ధాన్యం మొలకలు'

### అధికారుల నిర్లక్ష్యంపై రైతుల కన్నెర్ర..!



ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి : నిర్మల్ జిల్లాలో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యం అకాల వర్షాల బారిన పడి తీవ్ర నష్టాన్ని చవి చూస్తోంది. కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి వేచి ఉన్న ధాన్యం వర్షాలకు తడిసి, మొలకెత్తుతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. అధికారులు 6080 శాతం కొనుగోలు ప్రక్రియ పూర్తయిందని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి దారుణంగా ఉంది. మరో మూడు రోజులలో ధాన్యం పూర్తిగా కొనుగోలు చేస్తాం అంటూ అధికారులు ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో మాత్రం జాప్యం జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల మాటలు. రైతుల కష్టాలు..**

నిర్మల్ జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో 1.22 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, 1.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇందుకోసం 318 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 1.07 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అంటే ఇంకా 30 వేల నుంచి 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. అయితే, కోనుగోలు ప్రక్రియ వేగవంతం కాకపోవడం, లారీల కొరత, గన్నీ సంచుల సమస్యలు రైతులను నిండా ముంచుతున్నాయి. పలు కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కుప్పలు వర్షాలకు తడిసి ముద్దయ్యాయి. కల్లాల్లోనే ఆరబెట్టిన వరి ధాన్యం కూడా వర్షాలకు కొట్టుకుపోయింది. కొంతమంది రైతులు మూడు వారాలుగా కొనుగోలు కేంద్రాల వద్దే భార్యాపిల్లలతో కలిసి జాగారం చేస్తున్నామని వాపోతున్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ధాన్యం మొలకెత్తుతున్నా, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని మళ్లీ ఆరబెడితేనే తూకం వేస్తామని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు చెబుతుండటంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. ఇది అధికారుల నిర్లక్ష్యానికి, అలసత్వానికి నిదర్శనమని రైతులు మండిపడుతున్నారు.

**ప్రకృతి ప్రకోపం.. ప్రభుత్వ వైఫల్యం..**

అకాల వర్షాలు రైతుల ఆశలపై నీళ్లు చల్లడమే కాకుండా, ప్రభుత్వ కొనుగోలు విధానంలోని లోపాలను కూడా స్పష్టంగా బయటపెట్టాయి. వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ కొనుగోలు కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం, రవాణా సమస్యలు, సరిపడా గన్నీ సంచులు లేకపోవడం వంటి సమస్యలు ఏళ్ల తరబడి రైతులను వేధిస్తున్నా, వాటికి శాశ్వత పరిష్కరం చూపడంలో ప్రభుత్వం విఫలమవుతోందని రైతులు ఆరోపిస్తున్నారు. కొన్ని చోట్ల రైతులు రోడ్డెక్కి రాస్తారోకోలు నిర్వహించగా, స్థానిక ఎమ్మెల్యే, అధికారులు హామీలు ఇచ్చి ఆందోళనలను విరమింపజేశారు. అయితే, ఈ హామీలు కేవలం మాటలకే పరిమితం కాకుండా, ఆచరణలో చూపాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. తడిసిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని అధికారులు చెబుతున్నా, మొలకెత్తిన ధాన్యాన్ని ఎవరు కొంటారన్న ప్రశ్న రైతులను వెంటాడుతోంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లముందే నాశనమవుతుంటే, రైతన్న గుండె పగిలేలా రోదిస్తున్నాడు. ప్రభుత్వం తక్షణమే స్పం దించి, ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి, మొలకెత్తిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

## ప్రశాంతంగా గ్రామ పాలన అధికారి పరీక్ష



ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి : ప్రశాంతంగా గ్రామ పాలన అధికారి పరీక్ష ముగిసిందని డిఆర్‌ఓ భుజంగరావు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రామ పాలన అధికారి పరీక్షా కేంద్రాన్ని ఆర్డీవో రమాదేవితో కలిసి డిఆర్‌ఓ భుజంగరావు సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ, కళాశాలలో గ్రామ పాలన అధికారి పరీక్షలు పగడబ్బందిగా నిర్వహించినట్టు తెలిపారు. డిగ్రీ కళాశాలలో గ్రామ పాలన అధికారి పరీక్షకు 104 పరీక్ష రాయాల్సి ఉండగా 79 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. 25 మంది అనివార్య కారణాలవల్ల అభ్యర్థులు పరీక్షకు హాజరు కాలేదని చెప్పారు. పరీక్ష రాసేందుకు వీలుగా తరగతి గదుల్లో బెంచీలు, లైటింగ్, ఫ్యాన్లు, తాగునీరు, మూత్రశాలలు, తదితరాల వంటి మౌలిక వసతులను సమకూర్చినట్లు వివరించారు. పోలీస్ యంత్రాంగం పటిష్ట భద్రత ఏర్పాటు చేశారని చెప్పారు. ఏ విధమైన పేపర్ లీకేజీ గానీ, మాల్ ప్రాక్టీస్‌కి తావు లేకుండా గ్రామ పరిపాలన అధికారి పరీక్ష పగడ్బందీగా నిర్వహించినట్టు తెలిపారు. మొత్తం 104 మంది అభ్యర్థులకుగాను 79 మంది హాజరైనారని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంగటన జరగకుండా ప్రశాంతంగా పరీక్ష ముగిసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో యూనస్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హుస్సేన్, తహసిల్దార్ లక్ష్మణ్ బాబు, ఆర్ ఐ లక్ష్మణ్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## వేసవి శిక్షణ తరగతులు అభినందనీయం



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : రామకృష్ణ సేవా సమితి వేసవి శిక్షణ తరగతులు ప్రతి సంవత్సరం నిర్వహించటం అభినందనీయమని జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. రామకృష్ణ సేవా సమితి నిజామాబాద్ ఆధ్వర్యంలో గత ఏప్రిల్ 24 నుంచి ప్రారంభమైన వేసవి శిక్షణ శిబిరం మే 25న ముగింపు కార్యక్రమం రామకృష్ణ వివేకానంద ధ్యాన మందిరంలో గంగస్థాన్ ఫేస్2లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాధికారి అశోక్ విద్యార్థులను తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. రామకృష్ణ సేవా సమితి వేసవి శిక్షణ తరగతులు ప్రతి సంవత్సరం నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు శిక్షణతో పాటు రామకృష్ణుడు, శారదామాత వివేకానందుని సూక్తులను మంచి నడవడికలను అలవర్చుకోవాల్సిన అవసరముందన్నారు. వివేకానందుడి బోధనలో లక్ష్యాన్ని చేరే వరకు విశ్రమించకు అనే దాన్ని విద్యార్థులు అలవాటు చేసుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో కూడా మండలాల్లో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించామని గుర్తు చేశారు. గౌరవ అతిథిగా హైదరాబాద్‌కు చెందిన స్వామి తపతానంద జి.రామకృష్ణ మాట్లాడుతూ ఈనెల రోజులు కూడా సంస్కార్ వేసవి శిక్షణకు హాజరైన విద్యార్థులు వివిధ అంశాల్లో శిక్షణ పొంది విద్యార్థులు విన్యాసాలను ప్రదర్శనలను అద్భుతంగా ప్రదర్శించడం తన మనసు గెలుచుకున్నారు. యోగ డ్రాయింగ్, కరాటే, మ్యూజిక్, వేదిక్ మ్యాథ్స్, నాట్యం వివిధ అంశాల్లో మీ శక్తివంతటిని కూడా కూడగట్టుకుని శిక్షణను తీసుకున్నారు. ఈ శక్తిని మీకు ఆ రామకృష్ణుడు వివేకానందుడు అందించాడన్నారు. దానిని మన నిజజీవితంలో కూడా ఆచరించాలని, తల్లిదండ్రులను ఎల్లప్పుడూ గౌరవించాలన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్‌లో జాతీయ అవార్డు గ్రహీత తోట రాజశేఖర్ (వ్యవస్థాపక కార్యదర్శి రామకృష్ణ సేవ సమితి) వీరిని స్వామిజీ, మితి సభ్యులు సన్మానించారు. నెల రోజులు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో సూర్యప్రకాష్, రాంచందర్, గోపాల్, రాజశేఖర్, వసంత్‌పాటిల్, దీపక్, వినోద్, స్వరూప్, నర్సయ్య, గంగాప్రసాద్, వినోద్, శ్రీనివాస్, శ్రీలేఖ, రమేష్, హన్మాండ్లు వేసిన శిక్షణశిబిర ఇన్‌చార్జి రాజేంద్రప్రసాద్, సభ్యులు రాజ్‌కుమార్ సుబేదార్, సేవా సమితి సభ్యులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు స్వామిజీ అందజేశారు. ప్రతి విద్యార్థికి రామాయణ పుస్తకాన్ని స్వామిజీ అందజేశారు.

# కత్తెరసాలలో వడ్ల దందా

### అధికారులు చోద్యం

ప్రజాపక్షం/ చెన్నూర్ : మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం కత్తెరసాల గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రంలో దళారులు అక్రమంగా చొరబడి రాత్రికి రాత్రే వడ్లు అమ్ముకుంటున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమంగా వడ్లు తరలిస్తున్న లారీని రైతులు అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమ వడ్లను వెంటనే కొనుగోలు చేయాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కత్తెరసాల పిఏసీసి సెంటర్‌ను దళారులు ఏకంగా లీజుకు తీసుకుని దందా చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుంచి తక్కువ ధరకు (క్వింటాల్‌కు 1800) వడ్లు కొనుగోలు చేసి, వాటిని పిఏసీసి సెంటర్‌కు తరలించి, అమాయక రైతుల పేర్లతో ట్రాక్ షీట్లు తయారు చేసి, మిల్లర్లకు పంపి క్వింటాల్‌కు 2350 చొప్పున ప్రభుత్వానికి అమ్ముకుంటున్నారని వారు తెలిపారు. అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఎడిఏ ఎలాంటి అక్రమం జరగడం లేదని ధ్రువీకరించడంతో పోలీసులు లారీని విడిచిపెట్టారు. ఈ వ్యవహారంపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## సీనియర్ ఇంటర్ జిల్లా ఛాంపియన్‌షిప్ పోటీలలో రిత్వికకు మూడు బంగారు పతకాలు



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో ఆదివారం రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 10వ తెలంగాణ సీనియర్ ఇంటర్ డిస్టిక్ ఛాంపియన్‌షిప్ 2025 రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలలో జిల్లా క్రీడాకారిణి మిట్టాపల్లి రిత్విక సీనియర్ నేషనల్ స్విమ్మింగ్ పోటీల విభాగంలో పాల్గొని ఉత్తమమైన ప్రతిభ కనబర్చి 3 బంగారు పతకాలు సాధించింది. 50 మీటర్ల బెస్ట్‌స్ట్రోక్‌లో 100 మీటర్ల బెస్ట్‌స్ట్రోక్‌లో 200 మీటర్ల బెస్ట్ స్ట్రోక్‌లో బంగారు పతకం సాధించి జూన్ 22 నుంచి 26 వరకు ఒరిస్సా రాష్ట్రం భువనేశ్వర్‌లో జరిగే 78వ నేషనల్ అక్విటిక్ ఛాంపియన్‌షిప్ 2025 జాతీయస్థాయి పోటీలకు రాష్ట్రం తరపున ఎన్నికైంది. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో 3 బంగారు పతకాలు సాధించి సీనియర్ నేషనల్ 78వ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన మిట్టాపల్లి రిత్వికను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి ఉమేష్, ఉపాధ్యక్షులు మహిపాల్‌రెడ్డి, జిల్లా స్విమ్మింగ్ అధ్యక్షులు గడిల శ్రీరాములు, సభ్యులు వేణుగోపాల్, శ్యాంసుందర్‌రెడ్డి, కైసర్, కర్ణాటక శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, ముత్యాల శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

## అందుబాటులో జీలుగ, జనుము విత్తనాలు



ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి : మెదక్ జిల్లాలో రైతులకు జీలుగ, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా ఇంచార్జి వ్యవసాయ అధికారి వినయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలపై జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ, మెదక్ జిల్లాకు 15 వేల క్వింటాల జనుము, 30, వేల క్వింటాల జీలుగు విత్తనాలకు సరఫరాకు గాను ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగింది. అన్నారు. ప్రస్తుతం మెదక్ జిల్లాకు 15 వందల క్వింటాల జనుము, 5 వేల క్వింటాల జీలుగు విత్తనాలు ప్రభుత్వం తరపున అందుబాటులో ఉంచామన్నారు. వరి నాట్లు ఎక్కడైతే ముందు జరుగుతాయో ఆ మండలాల్లో ప్రాథమిక సహకార సంఘాలు, రైతు ఆగ్రోస్ కేంద్రాల వద్ద పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మిగతా మండలాలకు నాలుగు రోజుల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. నేలకు, పంటకు మేలు చేసే పచ్చిరొట్ట ఎరువును తయారు చేసేందుకు ప్రభుత్వం జీలుగ విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందజేస్తూ వస్తున్నది. పట్టాదారు పుస్తకం, ఆధార్ కార్డు ఉన్న రైతుకు మాత్రం 50 శాతం వరకు సబ్సిడీపై అందుతుందన్నారు. రసాయన ఎరువులు వాడకాన్ని తగ్గించి సేంద్రీయ పద్ధతిలో భూసారాన్ని పెంచే దిశగా పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు వినయ్ తెలియజేశారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన



ప్రజాపక్షం/సారంగాపూర్ : ఇటీవలే కురిసిన అకాల వర్షాల వలన తడిసిన వడ్లను వివిధ కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమ కోసం పని చేస్తుందని, ఎన్నడు లేని విధంగా ధాన్యం ఉత్పత్తి పెరిగిందని 2023 సంవత్సరంలో రబీలో 36 లక్షల మెట్రిక్ టన్నులు వస్తే ఇప్పుడు 2025లో 60 అరవై లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేయడం జరిగిందన్నారు. గతంలో ఎన్నడూ జరగని విధంగా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుంది గత ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయలేదు. కరువు పేరు మీద రైతులను దోచుకుంది. రైతులు ఎవరు కూడా అధైర్యపడవద్దు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సివిల్ సప్లై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి రైతులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ నిర్మల్ జిల్లా జెడ్పిటిసీల ఫోరం మాజీ అధ్యక్షుడు సారంగాపూర్ జెడ్పిటిసి పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ అయిర నారాయణ రెడ్డి, స్థానిక మాజీ సర్పంచ్ సూజాత నర్సారెడ్డి, సారంగాపూర్ మార్కెట్ డైరెక్టరు అహమద్ ముక్తరు, కాంగ్రెస్ పార్టీ నాయుకులు ఓలత్రి నారాయణరెడ్డి, అట్ల ముత్యం రెడ్డి, కండెల భూమన్న, నక్క రాజన్న ఉన్నారు.

## మంచిర్యాలలో రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు



ప్రజాపక్షం/మంచిర్యాల : మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని ఎఫ్‌సిఏ ఫంక్షన్ హాల్‌లో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్, సబ్ జూనియర్, యూత్ స్థాయి బాల బాలికల టైసన్ కప్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీల ప్రారంభోత్సవంలో మంచిర్యాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు పాల్గొన్నారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 23 జిల్లాల నుంచి క్రీడాకారులు, క్రీడాకారిణులు హాజరయ్యారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాను క్రీడారంగంలో రాష్ట్ర స్థాయిలో నిలిపేందుకు కృషి చేస్తానని అన్నారు. త్వరలోనే జిల్లాలో అన్ని క్రీడలను ఒకే వేదికపై నిర్వహించేందుకు ఇండోర్ స్టేడియం నిర్మించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు విద్య, వైద్యంతో పాటు ఆటవిడుపు కోసం క్రీడలు ఎంతో ముఖ్యమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బాక్సింగ్ టోర్నమెంట్ నిర్వాహకులు, మంచిర్యాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ జిల్లాలకు చెందిన బాక్సింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## మొబైల్ ఫోన్లను రికవరీ చేసిన పోలీసులు



ప్రజాపక్షం/కాగజ్‌నగర్ : మొబైల్ ఫోన్ పోయిన వెంటనే సిఇఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయాలని కాగజ్ నగర్ ఇన్స్పెక్టర్ కె. ప్రేమకుమార్ సూచించారు. కాగజ్ నగర్ టౌన్‌కు చెందిన పోతుల సాంబయ్య, సయ్యద్ ముదశిర్ ఇటీవల తమ మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్నారు. ఈ నేపథ్యంలో, ఇన్‌స్పెక్టర్ కె.ప్రేమకుమార్ సూచనలతో మొబైల్ ఫోన్ల వివరాలను సిఇఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌లో నమోదు చేశారు. అనంతరం, మహిళా కానిస్టేబుళ్లైన జోష్న, వరలక్ష్మి ల సహకారంతో పోర్టల్‌ను ఉపయోగించి ఫోన్లను గుర్తించి రికవరీ చేసి బాధితులకు తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కె.ప్రేమకుమార్ మాట్లాడుతూ మొబైల్ ఫోన్ పోయిన వెంటనే సిఇఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే, ఫోన్‌ను బ్లాక్ చేయడం ద్వారా దుర్వినియోగాన్ని నివారించవచ్చు. అలాగే, పోగొట్టుకున్న ఫోన్‌ను గుర్తించి త్వరగా రికవరీ చేయొచ్చు. అందుకే, ఎవరికైనా ఫోన్ పోయినపుడు వెంటనే సిఇఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయాలి అని తెలిపారు.

## మత్తు రహిత సమాజ నిర్మాణానికి ఆరోగ్య భారతి కృషి

### ఆరోగ్య భారతి ప్రశిక్షణ కార్యక్రమం



ప్రజాపక్షం/బైంసా : బైంసా మండలం మాంజ్రి గ్రామం సమీపంలోని ఆరాధన ఆయుర్వేద వెల్నెస్ రీసర్చ్ సెంటర్ లో ఆరోగ్య భారతి ప్రశిక్షణ వర్గ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఆరోగ్య భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్.రాంసింగ్ మాట్లాడుతూ దేశం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని అన్నారు.రోజు 45 నిమిషాలు వారానికి 5 రోజులు వ్యాయామానికి కేటాయించాలని తెలిపారు. రోజుకు 2 గంటలకన్నా ఎక్కువగా సెల్‌ఫోన్ వాడితే అనేక మెదడు, నరాల వ్యాధులు వస్తాయని అన్నారు. నిర్మల్ జిల్లా ఆరోగ్య భారతి అధ్యక్షుడు డాక్టర్ యు.రామకృష్ణ మాట్లాడుతూ శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా బలంగా ఉన్నట్లయితే ఒత్తిడిని జయించవచ్చునని అన్నారు. ఆరాధన ఆయుర్వేద వెల్నెస్ అండ్ రీసర్చ్ సెంటర్ చైర్మన్ డాక్టర్ రాజా రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య జీవనశైలి ఆహారం, విహారం, ఔషధ నియమాలను పాటిస్తూ ప్రతి ఒక్కరూ ఉదయం లేచినప్పటి నుండి రాత్రి పడుకునే వరకు ఆరోగ్య దినచర్యను పాటిస్తూ రోగరహితులుగా ఉండాలని ఆకాంక్షించారు. బైంసా డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డా.ఏ.దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఆరోగ్య భారతి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ముష్కం రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ ఆరోగ్య భారతి ప్రతి ఏటా నిర్వహించే ధన్వంతరి జయంతి, అంతర్జాతీయ యోగా దినోత్సవం, ఆరోగ్య రక్షాబంధన్, రథసప్తమి వంటి ఉత్సవాలను పాఠశాలలో బస్తిలలో నిర్వహించడం వల్ల ఆరోగ్యం, ఆధ్యాత్మికత మెరుగవుతుందని అన్నారు. డా.యు.కృష్ణంరాజు మాట్లాడుతూ భౌతికంగా, శారీరకంగా, మానసికంగా, సామాజికంగా ఆరోగ్యంగా ఉండడాన్ని ఆరోగ్యం అంటారని ఆ లక్ష్యాన్ని ఆరోగ్య భారతి నెరవేరుస్తుందని తెలిపారు. గురుకృపా ఒకేషనల్ జూనియర్ కళాశాల డైరెక్టర్ ముష్కం ప్రసన్న రాణి మాట్లాడుతూ వ్యాయామం, పోషకాహారం, నిద్ర సమతుల్యంగా ఉంటేనే శారీరకంగా దృఢంగా ఉంటారని తెలిపారు. నిర్మల్ జిల్లా పతాంజలి యోగ ప్రభారి అధ్యక్షుడు శోభ మందని మాట్లాడుతూ యోగ చేసిన వారే యోగిగా మారుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి,ఆసంవార్ సాయినాథ్,పురోస్తు గోపాల్,శైలేష్ మగాశెట్టి వార్,నిర్మల్,బైంసా రెవెన్యూ డివిజన్ యొక్క వివిధ మండలాల ఆరోగ్యభారతి ప్రతినిధులు పాల్గొన్నారు.

# క్రీడ

# సూపర్ కింగ్స్ ఆల్‌రౌండ్ షో..




## గుజరాత్‌కు రెండో హార్ట్‌బ్రేక్..

ఐపిఎల్ 18వ సీజన్ చివరి లీగ్ మ్యాచ్‌లోనూ గుజరాత్ టైటాన్స్‌కు ఓటమి తప్పలేదు. టాపార్డర్‌నే నమ్ముకుంటూ వరుస విజయాలు సాధిస్తూ ప్లే ఆఫ్స్ చేరిన ఆ జట్టు.. సొంత గడ్డపై చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్ల ధాటికి కుప్పకూలింది. భారీ ఛేదనలో టాపార్డర్‌లోనే 3 వికెట్లు కోల్పోయిన గుజరాత్.. రవీంద్ర జడేజా (217), నూర్ అహ్మద్(321)ల స్పిన్‌కు విలవిలలాడింది. ఈ ఇద్దరూ తిప్పేయడంతో 83 పరుగుల తేడాతో సీఎస్కే జయకేతనం ఎగురవేసింది. ఈ ఎడిషన్‌కు విజయంతో వీడ్కోలు పలికింది. గత మ్యాచ్‌లో 200 ప్లస్ లక్ష్యాన్ని అందుకోలేక లక్నో చేతిలో చిత్తైన గిల్ బృందానికి తాజా పరాజయం శరాఘాతమే. ప్లే ఆఫ్స్ చేరుకోలేదనే బాధలో ఉన్న చెన్నై సూపర్ కింగ్స్ ఎట్టకేలకు మురిసింది. లీగ్ దశ చివరి పోరులో గుజరాత్ టైటాన్స్‌ను వాళ్ల సొంత గడ్డపైనే ఓడించిన సీఎస్కే గెలుపు సంబురాలు చేసుకుంది. బ్యాటర్లు సమిష్టిగా రాణించడంతో 330 రన్స్ కొట్టిన చెన్నై.. అనంతరం బౌలర్ల విజృంభణతో ఆతిథ్య జట్టును 147కే కట్టడి చేసింది. 83 పరుగుల భారీ విజయంతో టోర్నీకి వీడ్కోలు పలికింది ధోనీ సేన. మరోవైపు.. గత పోరు లక్నో చేతిలో కంగు తిన్న గిల్ బృందానికి.. ఈ ఓటమి రెండో హార్ట్ బ్రేక్ కానుంది. వరుసగా రెండో మ్యాచ్‌లో 200 ప్లస్ ఛేదనకు సిద్ధమైన గుజరాత్ టైటాన్స్‌కు చెన్నై పేసర్లు భారీ షాక్ ఇచ్చారు. భీకర ఫామ్‌లో ఉన్న శుభ్‌మన్ గిల్(13) ను అన్షుల్ కంబోజ్ మూడో ఓవర్లోనే పెవిలియన్ చేరాడు. 24కే తొలి వికెట్ పడిన వేళ జోస్ బట్లర్(5), సాయి సుదర్శన్(41 నాటౌట్)తో కలిసి జట్టును ఆదుకుంటాడని అనుకుంటే.. అతడిని ఖలీల్ వెనక్కి పంపాడు. వరుసగా రెండు వికెట్ల షాక్ నుంచి తేరుకునేలోపే.. డేంజరస్ హిట్టర్ రూథర్‌ఫోర్డ్(0)ను అన్షుల్ డకౌట్ చేశాడు. అంతే.. గుజరాత్ 5వ ఓవర్ మూడో బంతికే మూడో కోల్పోయింది. తద్వారా ఈ సీజన్‌లో శుభ్‌మన్ గిల్ సేన తొలిసారి పవర్ ప్లేలో మూడు వికెట్లు కోల్పోయింది. కష్టాల్లో పడిన జట్టును ఓపెనర్ సాయి సుదర్శన్(41), షారుక్ ఖాన్(19)లు ఆదుకునే ప్రయత్నం చేశారు. శివం దూబే వేసిన 10వ ఓవర్లో సాయి వరుసగా రెండో ఫోర్లు కొట్టగా.. షారుక్ ఖాన్ స్ట్రెయిట్‌గా సిక్సర్ బాదగా స్కోర్ 80 దాటింది. 10 ఓవర్లకు ఓవర్లకు గుజరాత్ స్కోర్.. 853. దాంతో, అప్పటికీ ఆ జట్టుకు గెలుపుపై ఆశలు ఉన్నాయి.

### జడ్డూ జాదూ..

క్రీజులో పాతుకు పోయిన సాయి, షారుక్‌లను విడదీసిన జడేజా గుజరాత్‌ను కోలుకోలేని దెబ్బ కొట్టాడు. స్ట్రాటజిక్ బ్రేక్ తర్వాత బంతి అందుకున్న జడ్డూ.. తొలుత షారక్‌ను పెవిలియన్ చేర్చాడు. దాంతో, నాలుగు వికెట్ 55 పరుగుల భాగస్వామ్యాన్ని విడగొట్టాడు. అదే ఓవర్లో నాలుగో బంతికి సాయి పెద్ద షాట్ ఆడి శివం దూబేకు చిక్కాడు.

అంతే.. 86 వద్ద గుజరాత్ ఐదో వికెట్ పడింది. ఆ తర్వాత నూర్ అహ్మద్ (321) తన స్పిన్ మ్యాజిక్ చూపిస్తూ రషీద్ ఖాన్(12), గెరాల్డ్ కొయెట్జీ(5), రాహుల్ తెవాటియా(14)లను ఔట్ చేసి గుజరాత్‌ను ఓటమి అంచుల్లోకి నెట్టాడు. అన్షుల్ కంబోజ్ వేసిన 19వ ఓవర్లో సాయి కిశోర్ ధోనీకి క్యాచ్ ఇవ్వడంతో గుజరాత్ 147కే ఆలౌటయ్యింది.

### బ్రెవిస్, కాన్వే విధ్వంసం

చివరిదైన లీగ్ మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటర్లు చెలరేగారు. ఆకలిగొన్న సింహాల్లా గుజరాత్ టైటాన్స్ బౌలర్లపై విరుచుకుపడి బౌండరీలతో విజృంభించారు. ఓపెనర్లు డెవాన్ కాన్వే(52), ఆయుష్ మాత్రే (34) రెచ్చిపోయి ఆడారు. వరుసగా 6, 6, 4, 4, 6తో 24 పరుగులు పిండుకున్నాడు. మాత్రేతో కలిసి 44 రన్స్ జోడించిన కాన్వే.. అనంతరం.. ఉర్విల్ పటేల్(37)తో కలసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. దూకుడుగా ఆడిన ఉర్విల్ రెండో వికెట్‌కు 63 పరుగులు జోడించాడు. సాయి కిశోర్ బౌలింగ్‌లో సిక్సర్ బాదిన ఉర్విల్.. ఆ తర్వాత క్రీజు వదిలి పెద్ద షాట్‌కు యత్నించి మిడాఫ్‌లో శుభ్‌మన్ గిల్ చేతికి దొరికాడు. దాంతో, 107 వద్ద చెన్నై రెండో వికెట్ పడింది.

ఆఖర్లో కుర్రాడు డెవాల్డ్ బ్రెవిస్(57) ఆకాశమే హద్దుగా ఆడాడు. ఫోర్లు, సిక్సర్లతో విధ్వంసక ఇన్నింగ్స్ ఆడిన బ్రెవిస్.. చెన్నై స్కోర్ 200 దాటించాడు. డెత్ ఓవర్లలో జడేజాతో కలిసి శివాలెత్తిపోయాడు. సిరాజ్ వేసిన 19వ ఓవర్లో 6, 4 బాది హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కాన్వే, బ్రెవిస్ మెరుపులతో, చెన్నై నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి పరుగులు చేసింది.

## క్లాసెన్, హెడ్ విధ్వంసం..

ఐపిఎల్‌లో భాగంగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ భారీ స్కోరు చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 278 పరుగులు చేసింది. హెన్రిచ్ క్లాసెన్ (105; 39 బంతుల్లో 6 ఫోర్లు, 9 సిక్స్‌లు) 'శత' క్కొట్టగా.. ట్రావిస్ హెడ్ (76; 40 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లు) చెలరేగాడు. అభిషేక్ శర్మ (32; 16 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంత సేపూ మెరుపులు మెరిపించాడు. ఇషాన్ కిషన్ (29; 20 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. కోల్‌కతా బౌలర్లలో సునీల్ నరైన్ 2, వైభవ్ అరోరా ఒక వికెట్ పడగొట్టారు. వైభవ్ అరోరా వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో రెండే పరుగులు రాగా.. తర్వాత నుంచి హైదరాబాద్ బ్యాటర్ల విధ్వంసం మొదలైంది. వైభవ్ వేసిన మూడో ఓవర్‌లో రెండు సిక్స్‌లు, ఓ ఫోర్ బాదిన హెడ్. హర్షిత్ బౌలింగ్‌లో మూడు ఫోర్లు బాదాడు. నరైన్ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లు బాదిన అభిషేక్ తర్వాత బంతికే ఔటైపోయాడు. కాసేపటికే హెడ్ అర్ధ శతకం (26 బంతుల్లో) అందుకున్నాడు. మరోవైపు, క్రీజులోకి వచ్చిన క్లాసెన్ కూడా దూకుడుగా ఆడటంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. వరుణ్ బౌలింగ్‌లో క్లాసెన్ మూడు ఫోర్లు బాదేయడంతో 10 ఓవర్లకు స్కోరు 139/1కి చేరింది. హర్షిత్ బౌలింగ్‌లో క్లాసెన్ వరుసగా 4, 6, 6 కొట్టి 17 బంతుల్లోనే హాఫ్ సెంచరీ అందుకున్నాడు. తర్వాత నరైన్ బౌలింగ్‌లో హెడ్. రస్సెల్‌కు చిక్కాడు. క్లాసెన్, ఇషాన్ జోరు కొనసాగించడంతో 18 ఓవర్లకు స్కోరు 250 దాటింది. దీంతో సన్‌రైజర్స్ తన పేరిట ఉన్న 287/3 స్కోరు రికార్డును తిరగరాస్తుందేమో అనిపించింది. అయితే, తర్వాతి ఓవర్లో వైభవ్ ఇషాన్‌ను ఔట్ చేసి ఏడు పరుగులే ఇచ్చాడు. చివరి ఓవర్‌లో 17 పరుగులే రావడంతో కొత్త రికార్డు నమోదు కాలేదు.



# రీల్

# ఆ నలుగురిలో నేను లేను

### థియేటర్ల బంద్ వివాదంపై స్పందించిన అల్లు అరవింద్



'ఆ నలుగురు'లో నేను లేను... ఆ నలుగురులో నన్ను కలపకండి... ఆ వ్యాపారం వదిలేశాను. పదిహేను వందల థియేటర్లు ఉంటే నాకు పదిహేను మాత్రమే ఉన్నాయి. తెలంగాణాలో ఒక్క థియేటర్ మాత్రమే ఉంది' అని అల్లు అరవింద్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం సినీ పరిశ్రమలో జరుగుతున్న పరిణామాలపై నిర్మాత అల్లు అరవింద్ క్లారిటీ ఇచ్చారు. రెండు రోజులుగా సినిమా ఇండస్ట్రీలో జరుగుతున్న విషయాల గురించి మీకు అవగాహన ఉంది. మీడియాలో ఆనలుగురు అనే ఓ ప్రచారం ఉంది. ఆ నలుగురికి నాకు సంబంధం లేదు. నేను ఆ నలుగురిలో లేను. గత పదిహేను సంవత్సరాల క్రితం ఆ నలుగురు అనే సంబోధన స్టార్ట్ అయ్యింది. అది ఎవరూ పట్టించుకోవడం లేదు. పదిమంది దగ్గర ప్రస్తుతం థియేటర్‌లు ఉన్నాయి. ఆ నలుగురు వ్యాపారం నుంచి కోవిడ్ సమయంలోనే బయటికి వచ్చేశాను. తెలంగాణలో నాకు ఒక్క థియేటర్ మాత్రమే ఉంది. ఏఏఏ ఏషియన్ థియేటర్ మాత్రమే వుంది. ఆంధ్రాలో కూడా అన్ని థియేటర్స్ ఎప్పుడో వదిలేశాను. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో పదిహేను వందలు థియేటర్స్ ఉంటే మా దగ్గర కేవలం పదిహేను మాత్రమే ఉన్నాయి. ఈ థియేటర్‌లు కూడా లీజు రెన్యూవల్ గడువు ముగిసిన తరువాత లీజు కంటిన్యూ చేయడం లేదు. పాత అలవాటు ప్రకారం ఆ నలుగురిలో నా ఫోటోను వాడుకుంటున్నారు. జూన్1 నుంచి థియేటర్స్ మూసివేస్తాం అనే అంశంపై సినిమాటోగ్రఫీ మంత్రి రియాక్ట అయిన విధానం చాలా సమంజసంగా ఉందని నాకు అనిపించింది. నేను ఈ థియేటర్స్ అంశానికి సంబంధించిన ఏ మీటింగ్‌లో పాల్గొనలేదు. నా గీతా డిస్ట్రిబ్యూషన్ సంబంధించిన వ్యక్తులు కానీ, నాతో అసోసియేట్ అయిన మనుషులు కానీ ఈ మీటింగ్‌కు వెళ్లొద్దని చెప్పాను. థియేటర్స్‌కు చాలా కష్టాలు ఉన్నప్పుడు ఇండస్ట్రీపెద్దలతో మాట్లాడి సమస్యలు, సామరస్యంగా పరిష్కరించుకోవాలి. థియేటర్స్ మూసివేస్తున్నాం అనడం కరెక్ట్ కాదు. పవన్ కల్యాణ్ సినిమా విడుదల సమయంలో థియేటర్స్ మూసి వేస్తామని చెప్పడం దుస్సాహసం. ఎవరో ఇటీవల మనది ప్రభుత్వానికి సంబంధం లేని రంగం అని అంటుంటే విన్నాను. ప్రభుత్వానికి సంబంధం లేని పరిశ్రమ అయితే గత చీఫ్ మినిస్టర్‌ను సినీ పరిశ్రమలోని పెద్ద పెద్ద వాళ్లంతా వెళ్లి ఎందుకు కలిశారు? ఏ వ్యాపారం అయినా సవ్యంగా చేసుకోవలంటే ప్రభుత్వ సహకారం లేకుండా జరగదు. ఇప్పుడు ప్రభుత్వంను వెళ్లి కలవకపోవడం సరికాదు. మనకు కష్టం వస్తే తప్ప మనం ప్రభుత్వం దగ్గరికి వెళ్లమా? ఏపీ మంత్రి దగ్గర నుంచి వచ్చిన నోట్ ఎంతో సమర్థనీయంగా ఉంది. నిజంగానే సింగిల్ స్క్రీన్ థియేటర్లకు సమస్యలు ఉన్నాయి. సమస్యలు ఉన్నప్పుడు మాట్లాడుకోవాలి తప్ప ఇలా థియేటర్స్ మూసి వేస్తున్నామని చెప్పడం సరికాదు' అన్నారు. నా దగ్గర నుంచి సినిమా తీసుకువెళ్ళేది థియేటర్ ఓనర్ కాదు డిస్ట్రిబ్యూటర్. క్యూబ్ కంపెనీలో నాకు వాటా లేదు. అది సురేష్ బాబు చేతుల్లో కూడా లేదు. అందులో నేను భాగస్వామిని కాదు అని మీడియా ప్రతినిధి ఒకరు అడిగిన ప్రశ్నకు అల్లు అరవింద్ సమాధానం చెప్పారు.

## 'ఓజీ' రిలీజ్ డేట్ ఫిక్స్..




పవన్‌కల్యాణ్ అభిమానులకు శుభవార్త. సుజీత్ దర్శకత్వంలో ఆయన నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'ఓజీ'. ఈ మూవీ ఎప్పుడెప్పుడు వస్తుందా? అని ఎదురు చూస్తున్న వారి కోసం చిత్ర బృందం క్రేజీ అప్‌డేట్‌ను ఇచ్చింది. ఈ చిత్రాన్ని దసరా కానుకగా సెప్టెంబరు 25న ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నట్లు తెలిపింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ 'ఫైరింగ్ వరల్డ్ 25 సెప్టెంబరు 25' అని పేర్కొంది. ఈ ప్రకటనతో పవన్ అభిమానులు తెగ సంబర పడిపోతున్నారు. పవన్‌కల్యాణ్ ఇప్పటికే ఒప్పుకొన్న సినిమాలను ఒక్కొక్కటిగా పూర్తి చేసే పనిలో ఉన్నారు. తాజాగా 'హరి హర వీరమల్లు' షూటింగ్ పూర్తి చేసి, 'ఓజీ' కోసం రంగంలోకి దిగారు. ఇటీవల షూటింగ్ మళ్లీ మొదలు పెట్టినట్లు చిత్ర బృందం కూడా ప్రకటించింది. వీలైనంత త్వరగా ఈ మూవీని పూర్తి చేయాలని నిర్మాణ సంస్థ డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ భావిస్తోంది. ఇప్పటికే విడుదల చేసిన టీజర్ మూవీ అంచనాలను పెంచింది.

## అదే ఉంటే హారర్ సినిమా చేసేదాన్ని కాదు..

### నెపోటిజంపై అదా శర్మ కామెంట్స్



బాలీవుడ్‌లో బంధుప్రీతి (నెపోటిజం)పై తరచుగా చర్చలు జరుగుతాయన్న విషయం తెలిసిందే. ఈ విషయంపై నటి అదా శర్మ తనదైన శైలిలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను సినిమా కుటుంబం నుండి వచ్చి ఉంటే.. తనను హారర్ సినిమాతో పరిచయం చేసేవారు కాదని ఆమె పేర్కొన్నారు. అదా శర్మ తన కెరీర్‌ను 2008లో విడుదలైన హారర్ సినిమా '1920' తో ప్రారంభించారు. ఈ సినిమా బాక్స్ ఆఫీస్ వద్ద విజయం సాధించినప్పటికీ, ఒక నటిగా మంచి గుర్తింపు లభించలేదు. దీనిపై అదా శర్మ మాట్లాడుతూ, నేను సినిమా కుటుంబం నుండి వచ్చి ఉంటే, నన్ను పరిచయం చేయడానికి ఒక పర్ఫెక్ట్ రొమాంటిక్ సినిమా కోసం వేచి ఉండేవారు. నా కుటుంబం నన్ను హారర్ సినిమా చేయనిచ్చేది కాదు. ఎవరు తమ కెరీర్‌ను దెయ్యం పట్టినట్లు, నల్లటి పళ్లతో తెరపై కనిపిస్తూ ప్రారంభిస్తారు? ప్రముఖుల కుటుంబం నుండి వచ్చి ఉంటే, ఒక సాధారణ రొమాంటిక్ సినిమాతో నా కెరీర్ ప్రారంభమయ్యే అవకాశం ఉండేది. నేను '1920' తో ప్రారంభించాను, అందుకు నేను అదృష్టవంతురాలిని. నేను ఏదైనా కొత్తగా ప్రయత్నించినప్పుడల్లా ప్రేక్షకులు నన్ను అంగీకరించారు, బహుశా అందుకే సినీ నిర్మాతలు కూడా నన్ను విభిన్న పాత్రలలో నటించడానికి ధైర్యం చేస్తున్నారు అని అన్నారు.

# త్రివేణి సంగమంలో గవర్నర్ పుష్కర స్నానాలు

### కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో గవర్నర్ దంపతుల ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి/కాళేశ్వరం** : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన కాళేశ్వరం త్రివేణి సంగమంలో ఆదివారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు శాస్త్రక్తంగా పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం పుష్కర ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన సరస్వతి ఏక శిలా విగ్రహాన్ని దర్శించుకున్నారు. హైదరాబాద్ నుండి ఉదయం 11:02 గంటలకు హెలికాప్టర్ ద్వారా కాళేశ్వరం చేరుకున్న గవర్నర్ జిష్ణుదేవ్ దంపతులకు ఐటి పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే పుష్ప గుచ్ఛం అందించి ఘనస్వాగతం పలికారు. అనంతరం త్రివేణి సంగమ తీరంలో గవర్నర్ దంపతులు వేద పుష్కర స్నానం ఆచరించి నదీతీరంలో వేదపండితుల మంత్రోచ్చారణాల మధ్య సరస్వతీ నదీమతల్లికి సారె, చీర సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గవర్నర్ దంపతులు శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న గవర్నర్ దంపతులకు దేవాదాయ శాఖ కమీషనర్ వెంకట్ రావు స్వాగతం పలుకగా ప్రధాన రాజగోపురం వద్ద గవర్నర్ దంపతులకు ఆలయ అర్చకులు పరివట్టం, పూర్ణ కుంభం, మంగళ వాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ దంపతులు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. గవర్నర్ దంపతులకు ఆలయ అర్చక బృందం ఆధ్వర్యంలో ఆశీర్వచనం అందించి స్వామి వారి శేష వస్త్రలతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందించారు.అనంతరం సరస్వతీ మాత అమ్మవారి జ్ఞాపికను గవర్నర్ దంపతులకు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు సరస్వతీ పుష్కర ఘాట్ తీరం వద్ద ప్రతి రోజు సాయంత్రం కాశీ పండితుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సరస్వతి నవరత్న మాలా హారతి వైభవాన్ని గవర్నర్ కు వివరించారు. అనంతరం పుష్కర ఏర్పాట్లను పరిశీలించిన గవర్నర్అధికారులను అభినందించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయడం ప్రశంసనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, గత 11రోజుల నుండి సరస్వతీ పుష్కరాలు వైభవంగా జరుగుతున్నాయని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.భక్తుల పుష్కర స్నానాలు ఆచరించాలని ఈ సందర్భంగా గవర్నర్ సూచించారు. ఆయన వెంట రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**పుష్కర స్నానం ఆచరించిన పలువురు ప్రముఖులు**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతీ పుష్కరాల్లో భాగంగా పలువురు ప్రముఖులు త్రివేణి సంగమ తీరంలో పుష్కర స్నానాలు ఆచరించారు. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ కుటుంబ సమేతంగా కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా త్రివేణి సంగమంలో యోగానంద సరస్వతీ పుష్కర స్నానం ఆచరించి కాళేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సినీనటులు తనికెళ్ళ భరణి పుష్కర స్నానం ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.




# సిపిఐ పోరాటాలు

(మొదటి పేజీ తరువాయి)

కార్పొరేట్ శక్తులకు దాసోహమై కార్మిక, కర్షక, శ్రామిక వర్గాలను అణచి వేసే దిశగా పాలిస్తూ అత్యంత ప్రమాదకరంగా తయారైందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ఒక్కటొక్కటిగా ప్రభుత్వ ప్రయివేట్ రంగ సంస్థలన్నిటిని అంబాని, ఆదానిలాంటి సంపన్న వర్గాలకు ప్రయివేటీకరణ పేరట అప్పచెప్పి వారిచ్చే డబ్బులతో ఎన్నికల్లో ఓట్లు పొందేందుకు కుటిల యత్నాలకు పాల్పడుతున్న బిజెపిని అంతం చేయాల్సిందేనన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే వారిని తప్పుడు కేసులు బనాయించటం ద్వారా వరవరరావు, దివంగత ప్రొఫెసర్ సాయిబాబా లాంటి వాళ్లను జైళ్లల్లో మగ్గేలా చేయటమో, చివరికి ప్రాణాలు పోవటమో లాంటి విధానాలతో బిజెపి ప్రభుత్వం అణచివేస్తోందన్నారు. దోపిడీలు చేసే వారు అధికారంలో, ప్రజా పోరాటంలో ఉన్న వారు కారాగారాల్లో ఉండాల్సిన దౌర్భాగ్య స్థితి నెలకొందని వాపోయారు. ప్రజా సమస్యల సాధనే లక్ష్యంగా తమ జీవితాలను పణంగా పెట్టి తమ వారందరిని వదలి పెట్టి అడవుల్లో కాలం గడుపుతూ పోరాటం చేస్తున్న మావోయిస్టులను ఎన్‌కౌంటర్ల పేరిట హతమార్చే హక్కు ప్రభుత్వానికి ఎక్కడిదని ఎమ్మెల్యే కూనంనేని ప్రశ్నిస్తూ చర్చలకు సిద్ధమని చెబుతున్నా అవకాశం ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం చేస్తోందన్నారు. అదే విధంగా పహల్గాం ఉగ్రవాదుల దాడులను సైతం తమకు అనుకూలంగా మార్చుకొన్న బిజెపి ప్రభుత్వం హిందూ ముస్లిం విభేధాలుగా చెప్పుకోవటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఉగ్రవాదులకు కుల, మత,ప్రాంత తేడాలు అనేవి ఉండవని, కేవలం ఇస్లాం రాజ్య లక్ష్యంగా నరమేధానికి పాల్పడుతుంటారని, ఇలాంటి ఉదంతాలు అనేక దేశాల్లో తరచు చోటు చేసుకొంటున్నాయన్నారు. ఇందుకు గాను దేశంలో వామపక్ష లౌకిక శక్తులు ఏకం కావాలన్నారు.

### ప్రజల్లో చైతన్యం తేవాలి

బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలు, ఓట్ల కోసం వైషమ్యాలను రెచ్చ గొట్టే తీరును ప్రజల ముందుకు తీసుకెళ్లటానికి కమ్యూనిస్టులు కృషి చేయాలన్నారు. మండల స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు నిర్వహించే మహాసభల్లో పజా సమస్యలను అధ్యయనం చేసుకొంటూ అనుసరించాల్సిన విధానాల రూపకల్పనతో నిర్మాణాత్మకంగా కదిలే సత్తా కేవలం సిపిఐకి మాత్రమే ఉందన్నారు. అధికారంతో పని లేకుండా ప్రజా పోరాటాల్లో అన్ని వర్గాలకు అండగా నిలుస్తూ పోరాటం చేస్తున్నది సిపిఐ మాత్రమే అన్న విషయాన్ని ప్రజల్లో మరింత ముందుకు తీసుకొని వెళ్లాలన్నారు. గత వందేళ్ల కాలంలో ప్రతికూల పరిస్థితులను సైతం లెక్క చేయకుండా ప్రజల మధ్యనే ఉంటూ అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటూ నిలుస్తన్న ఏకైక పార్టీ సిపిఐ ఉద్యమాలే అన్నారు. డబ్బులతో పని లేకుండా ఎన్నికలు జరిపితే సిపిఐ అభ్యర్థులకు విజయ ఢంకా మోగించే సత్తా ఉందన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ చట్ట సభల్లో బలహీనంగా ఉన్నప్పటికి అన్ని వర్గాలను సమీకృతం చేస్తూ ముందకు వెళ్లే సత్తా ఉన్న పార్టీ సిపిఐ మాత్రమే అన్నారు. గత పదేళ్ల కాలంగా బిజెపి పాలనలో అప్రజాస్వామిక పాలన, కార్మిక, శ్రామిక, కర్షక వ్యతిరేక విధానాలు కొనసాగుతున్నాయని వీటికి వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు.కార్మిక, కర్షక వ్యతిరేక చట్టాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని, రిజర్వేషన్లు సైతం ఎత్తి వేసే కుటిల యత్నాలకు పాల్పడుతోందని, సిపిఐ పోరాడి కేంద్ర ప్రభుత్వ తలలు వంచి కులగణనకు సిద్ధమయ్యేలా చేసామన్నారు. సిద్దాంత పరంగా నిస్వార్థంగా కమ్యూనిస్టులు సమరశీల పోరాట బాట పట్టాలని ఆయన పిలుపిచ్చారు. అధికారం లేక పోతే కొద్ది కాలానికే కనుమరగయ్యే రాజకీయ పార్టీల తరహాలో కాకుండా సిపిఐ వందేళ్ల కాలంలో ప్రజల మధ్యే నిరంతరం ఉంటూ బలమైనా పార్టీగా నిలిచిందన్నారు. గత పదేళ్ల కెసిఆర్ పాలనలో అన్నివర్గాలపై నిర్బంధంతో ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడ్డారని, కార్మిక యూనియన్లను అణచి వేసారన్నారు. అనంతరం వివిఎస్ బోస్, ఎండి యూసూఫ్‌లు సభను ఉద్దేశించి ప్రసంగించారు.

మహాసభకు ముందుగా ఈసిఐఎల్ చౌరాస్తా నుండి సిపిఐ శ్రేణులు కార్యస్థలి వరకు ఎర్రజెండాల చేతబట్టుకొని పార్టీ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి అమర వీరులకు జోహారులర్పించారు. సభ ప్రారంభంలో అమరులైన బాలమల్లేష్, రొయ్యల కృష్ణమూర్తి, పోటు ప్రసాద్ తదితరులకు నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కార్యదర్శి డిజి సాయిలు గౌడ్, సహాయ కార్యదర్శి ఉమామహేష్, ప్రజా సంఘాల నాయకులు మండల కార్యదర్శులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పోలీసుల డేగ కన్ను

(మొదటి పేజీ తరువాయి)

నిఘా పెట్టారు. ఫరహాన్‌తో పాటు అతని స్నేహితులు, కుటుంబ సభ్యుల కదలికలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఫరహాన్ హైదరాబాద్‌కు ఎప్పుడేప్పుడు వచ్చాడు, ఎవరిని కలిసేవాడు అనే అంశంపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. స్వచ్ఛందసంస్థ ముసుగులో ఫరహాన్ ఉగ్రకార్యకలాపాలకు పాల్పడుతున్నాడని నసీర్, సమీర్‌లు విచారణలో వెల్లడించినట్లు సమాచారం. ఈ సమాచారం మేరకు విజయనగరం పోలీసులతో పాటు తెలంగాణ పోలీసులు వరంగల్‌కు చేరుకుని అహీం సంస్థపై ఆరా తీస్తున్నారు. ఐఎస్ఐఎస్ ఉగ్రవాద సంస్థలో పని చేస్తు పట్టుబడిన నసీర్, సమీర్‌లకు ఉత్తరప్రదేశ్‌కు చెందిన మరో ఉగ్రవాది బాదర్‌తో కూడా పరిచయాలు ఉన్నట్లు విచారణలో తేలింది. దీంతో మరో పోలీసు బృందం ఒకటిరెండు రోజుల్లో యూపికి వెళ్లనున్నట్లు తెలిసింది. అసలు ఈ బాదర్ ఎవరు, గతంలో ఇతనిపై ఏమైనా నేర చరిత్ర ఉండదా, ఉగ్ర కార్యకలాపాలపై ఆరా తీసే అవకాశాలు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన బాదర్, వరంగల్‌కు చెందిన ఫరహాన్‌లను కూడా త్వరలో అరెస్టు చేసే అవకాశాలు ఉన్నాయి. వీరికి కూడా సౌదీ నుంచి 'ఉగ్ర' నిదులు అందాయా అనే అంశంపై పోలీసులు కన్నేసిపెట్టారు. వారి బ్యాంక్ ఖాతాలపై ఆరా తీస్తున్నారు.

# కలుపుతీతే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

లంచం డిమాండ్ చేస్తూన్నారు కొంత మంది పోలీసులు. గత ఏడాది తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అనేక పోలీసు అధికారులను అవినీతి కేసుల్లో అరెస్టు చేసింది. ఈ కేసులు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నమోదయ్యాయి. కేవలం ఒక్క పోలీసు శాఖలోనే ఎసిబి అధికారులు 31 మంది పోలీసులను లంచం తీసుకుంటుండగా పట్టుకుంది. వీరిలో కానిస్టేబుల్ స్థాయి నుంచి డిఎస్‌పి స్థాయి వరకు ఉన్నారు. ఇతర విభాగాలకంటే ముందు పోలీసు విభాగంలో ఉన్న అవినీతి పరులను ఏరివేయడమే డిజి విజయ్‌కుమార్ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ క్రమంలోనే అవినీతి పోలీసులపై ఫిర్యాదు చేసే బాధితుల పక్షాన ఆయన సింహస్వప్నంగా నిలుస్తున్నారు. అవినీతికి పాల్పడిన కొన్ని ముఖ్య ఘటనలు పరిశీలిస్తే సూర్యాపేట జిల్లాలో సూర్యపేట డిఎస్‌పి కె. పార్థ సారథి, టౌన్ సిఐ పి. వీర రాఘవులు లంచం డిమాండ్ చేసిన కేసులో అరెస్టు అయ్యారు. వీరి నివాసంలో 21 లైవ్ రౌండ్లు, 69 ఖాళీ బుల్లెట్లు, ఆస్తి పత్రాలు, బంగారు ఆభరణాలు, రూ.3 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా హైదరాబాద్‌లో సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సిసిఎస్) సిఐ ఒక కేసును మూసివేయడానికి రూ.15 లక్షల లంచం డిమాండ్ చేసి, రూ.3 లక్షలు స్వీకరించేటప్పుడు ఎసిబికి చిక్కారు.

మాధాపూర్ పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ రూ.30 వేలు, మీర్‌పేట పోలీస్‌స్టేషన్లో ఓ కానిస్టేబుల్ రూ.10వేలు, చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో ముగ్గురు పోలీసులు, నాలుగు ప్రైవేట్ వ్యక్తులు కలిసి ఒక వ్యక్తిని బెదిరించి రూ.5లక్షలు వసూలు చేస్తుండగా, అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సంగారెడ్డి జిల్లా ఇన్స్పెక్టర్ రూ.1.5 కోటి లంచం డిమాండ్ చేసి, రూ.5 లక్షలు తీసుకుంటుండగా, మెడ్చల్ జిల్లా అసిస్టెంట్ సబ్‌ఇన్స్పెక్టర్ (ఎఎస్ఐ) కె. మధుసూదన్ రావు రూ.50వేలు లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డారు. కామారెడ్డి జిల్లాలో కానిస్టేబుల్ నిమ్మ సంజయ్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుగులోత్ అశోక్ శివ నాయక్‌తో కలిసి రూ.10వేలు, ఆసిఫాబాద్ జిల్లా సబ్ ఇన్‌స్పెక్టర్ రాజ్యలక్ష్మి రూ.25వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.

### ఫిర్యాదు చేయండి : ఎసిబి డిజి విజయ్‌కుమార్

లంచం లేదా అవినీతికి సంబంధించి ఏవైనా సమాచారం ఉంటే వెంటనే ఎ సిబి టోల్‌ఫ్రీ నంబర్ 1064 ద్వారా ఫిర్యాదు చేయాలని ఎసిబి డిజి విజయ్‌కుమార్ తెలిపారు.

సోషల్ మీడియాలో @TelanganaACB ద్వారా కూడా సమాచారం అందించాలని, బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతామని విజయ్‌కుమార్ పేర్కొన్నారు.

# బహిష్కరించిన లాలూ

(మొదటి పేజీ తరువాయి)

తాను ఒక మహిళతో 12 సంవత్సరాలుగా రిలేషన్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. తేజ్ ప్రతాప్ వివాహం చేసుకున్నప్పటికీ, అతని విడాకుల పిటిషన్ పాట్నాలోని కుటుంబ కోర్టులో ఇంకా పెండింగ్‌లో ఉంది. అయితే కొన్ని గంటల తర్వాత తేజ్ ప్రతాప్ పోస్ట్‌ను తొలగించాడు. తన ఫేస్‌బుక్ పేజీ 'హ్యాక్' అయిందని ఎక్స్‌లో పేర్కొన్నాడు. కాగా, తేజ్ ప్రతాప్ ప్రవర్తన, బాధ్యతారహిత వైఖరి వల్లే తొలగించానని లాలూ సోషల్ మీడియాలో తెలిపారు. తేజ్‌ప్రతాప్ ప్రవర్తన తమ కుటుంబ సంప్రదాయాలకు సరిపోలడం లేదని పేర్కొన్నారు. ఇకపై తేజ్‌ప్రతాప్‌కు పార్టీలో, కుటుంబంలో ఎలాంటి పాత్ర ఉండదని స్పష్టం చేశారు. 'వ్యక్తిగత జీవితంలో నైతిక విలువలను విస్మరించడం వల్ల సామాజిక న్యాయం కోసం మన సమష్టి పోరాటాన్ని బలహీనపరుస్తుంది. పెద్ద కొడుకు తేజ్ ప్రతాప్ కార్యకలాపాలు, ప్రవర్తన మా కుటుంబ విలువలు, సంప్రదాయాలకు అనుగుణంగా లేవు. అందువల్ల పార్టీ, కుటుంబం నుంచి తొలగిస్తున్నాను. ఇక నుంచి తేజ్ ప్రతాప్‌కు పార్టీ, కుటుంబంలో ఎలాంటి పాత్ర ఉండదు. 6 సంవత్సరాలపాటు బహిష్కరిస్తున్న. అతడితో సంబంధాలు కలిగి ఉన్న వారందరూ వారి సొంత నిర్ణయాలు తీసుకోవాలి' అంటూ లాలూ ప్రసాద్ యాదవ్ పోస్ట్ చేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల సమయం మాత్రమే మిగిలి ఉండగానే ఈ పరిణామం జరగడం గమనార్హం. ఆర్‌జెడి లాలూ ప్రసాద్ చిన్న కుమారుడు తేజస్వి యాదవ్ నాయకత్వంలో పోటీ చేయనుంది. ఇదిలా ఉండగా, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్‌ను చివరి ప్రయత్నం ఏమిటని అడిగినప్పుడు, ఆయన జాగ్రత్తగా స్పందించారు. 'నా అన్నయ్య పెద్దవాడు. ఆయన తన వ్యక్తిగత జీవితంలో ఏదైనా ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉంది. కానీ మనం సహించలేని కొన్ని విషయాలు ఉన్నాయి. మా జాతీయ అధ్యక్షుడు తన పోస్ట్‌లో స్పష్టం చేశారు' అని అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు యాదవ్ అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com